# రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం

# (యఫ్.పి.ఓ./రైతు సంఘం)

# ఉద్దేశాలు, సభ్యత్వం

ఒక రోజు శిక్షణా కార్యక్రమం

అభ్యాసకులు: పాలకవర్గ సభ్యులు

రూపకల్పన: వాసన్

సహకారం: APMAS

# సెషన్ -1

# రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం (ఎఫ్‌పిఓ), ఉద్దేశాలు

**ఉద్దేశాలు:** ఎఫ్‌పిఓ/రైతుసంఘం నిర్వచనం, ఉద్దేశం సభ్యులు వివరించగలుగుతారు

**అభ్యాసకులు:** పాలకవర్గ సభ్యులు, సిబ్బంది

**విషయాంశములు:**

1.1 రైతుల ప్రస్తుత స్థితిగతులు, రైతు సంఘం ఆవశ్యకత

1.2 రైతులకు ఏంకావాలి? రైతుసంఘం ఉద్దేశాలు ఏమిటి?

**శిక్షణా పరికరాలు:** చార్టులు, పెన్నులు, పోస్టర్లు

**సమయం:** 1 గంట

పద్దతి, వివరణ

## 1.1 రైతుల ప్రస్తుత పరిస్థితి:

పద్ధతి: 'మంచిరోజులు ఎంతదూరం' కథ

పద్ధతి వివరణ:

**1) కథ చదివి వినిపించాలి. అభ్యావకులను కథచివరన ఉన్న ప్రశ్నలు అడుగుతూ వాటికి సమాధానాలు రాబట్టాలి.**

**2) ఈ కథ చదివిన తర్వాత, రంగయ్యలాంటి రైతుల వెతలు తీరాలంటే ఏంచేయాలో చర్చించాలి.**

## 1.2 రైతుసంఘం ఉద్దేశాలు

పద్ధతి: 1.1 లోని కథనుండి అభ్యాసకులు కొన్ని పనులకు కలిసి చేసుకోవచ్చు. కాబట్టి సంఘం అవసరమని అర్థంఅవుతుంది. సంఘం ద్వారా సాధించుకోగలిగిన పనులను గుర్తించాలి. సంఘం ఉద్దేశాలు వివరించాలి.

## సెషన్ ఫలితం:

సభ్యులందరి ఉమ్మడి అవసరాలు తీర్చుకోవడానికి ఎఫ్‌పిఓ/రైతుసంఘం ఏర్పడిందని, దాని నిర్వచనం, ఉద్దేశాలు గురించి అవగాహనను పెంపొందించుకుంటారు.

# మంచిరోజులు ఎంత దూరం......!

అల్లుగుండు అనంతపురం జిల్లాలో ఒక పల్లెటూరు. ఎక్కువ మంది రైతులు. అక్కడక్కడా బోర్లు. బోర్లకింద కొంత వ్యవసాయం. మిగిలిందంతా వర్షాధారమే. రంగయ్య ఆ ఊళ్ళో నాలుగెకరాల పొలం ఉన్న చిన్న రైతు. సరిగా పంటపండటం లేదు. బోరు వేద్దామటే పెట్టుబడి పెట్టడానికి తనదగ్గర ఉన్న డబ్బులు సరిపోవు. పెళ్ళయిన కొత్తలో రెండు మేకలతో మొదలుపెడితే ఓ రెండేళ్లలో అవి పెరిగి పదయ్యాయి. అమ్మితే కొంత డబ్బొచ్చింది. ఇంకా కొంత అప్పుచేసి బోరు వేశాడు. ఒక ఎకరానికి సరిపడా నీళ్ళు పడ్డాయి. రంగయ్యకు ఇద్దరు పిల్లలు. బడికెళ్ళి చదువుకొంటున్నారు.

ఈ మూడేళ్ళుగా సరిగా వర్షాలు పడక, పంట చేతికి రావడంలేదు. అంతోఇంతో పండిన పంట ఖర్చులకు కూడా సరిపోలేదు. విత్తనాలకు, ఎరువులకు, పురుగుమందులకు చేసిన అప్పులు అలాగే ఉండిపోయాయి. వర్షం పడిన వెంటనే అదునులో విత్తనం వేద్దామంటే సమయానికి ట్రాక్టరు దొరకలేదు. ఊళ్లో మంచిభూముల్లోనూ, ఇతర రైతులందరికీ దున్నినతర్వాతే రంగయ్యలాంటి బీదరైతులవద్దకు ట్రాక్టరువాళ్లు వస్తారు. పనిముట్లు లేక, కూలీలలను పెట్టుకొనే స్థోమత లేక, ఇంట్లో ఉన్న కొద్దిమంది కలిసి కలుపులు తీశారు. సరైన యంత్రాలు ఉంటే తక్కువ ఖర్చుతో తొందరగానే కలుపు తీయవచ్చు. అసలే వేరుశెనగ విత్తనం ఖర్చు చాలా ఎక్కువ. సమయానికి విత్తనం తెచ్చుకోవడం కూడా గొప్పే.

పోయిన సంవత్సరం తొందరగానే వర్షాలు పడ్డాయి. ఎలాగోలా అదునులోనే విత్తనం వేశాడు కానీ మధ్యలో చాలా రోజులు వర్షం పడక బెట్ట ఎక్కువై పంట దిగుబడి సరిగా రాలేదు. వచ్చిన పంట అమ్మబోతే, షావుకారు అప్పు కిందకు జమచేసుకొన్నాడు. బోర్లో నీళ్లు ఉన్నాయి కానీ, వేసిన వరిపంటకే సరిపోవు. బోరునుండి వర్షాధార భూమికి నీళ్ళు తీసుకొనిపోవడం కూడా శక్తికి మించిన పనే. ఉపాధిహామీ పనులతో ఆలుమగలు ఇద్దరూ కష్టపడితే తప్ప ఇల్లు గడవదు. ఏంచేయాలో పాలుపోవడంలేదు. బోరుకోసం అమ్మగా మిగిలిన 4 మేకలు, ఇంట్లోఉన్న కోళ్ళు పోయిన సంవత్సరం రోగాలొచ్చి చనిపోయాయి. అవైనా ఉంటే కొంతైనా ఆదుకొనేవి. ఊరికి దగ్గర్లోని గుట్టల్లో మేకలు మేపేవారు. ఆగుట్టల్లో కూడా చెట్లు, చేమలు ఎండిపోయి గడ్డికూడా దొరకడంలేదు. రానురాను చెట్లన్నీ ఎండిపోయాయి.

ఇంకో బోరు వేసి, నీళ్ళు పడితే తన సమస్యలన్నీ తీరుతాయని ఆశ. అందుకే ఎవరైనా అప్పు ఇస్తే బోరువేద్దామని ఆలోచిస్తున్నాడు రంగయ్య.

ఇది సర్వసాధారణంగా కనిపించే ఒక చిన్నరైతు కథ. ఈ ప్రశ్నలకు సమాధానాలు ఆలోచించండి.

**1) రంగయ్య కుటుంబానికి పెట్టుబడి ఎక్కడినుండి సమకూరింది?**

**2) రంగయ్య కుటుంబం అప్పుల ఊబిలో ఎందుకు కూరుకుపోయింది?**

ఇలాంటి చిన్న రైతులకు ఒక ఆనందమయమైన జీవితాన్ని అందివ్వలేమా? ప్రభుత్వాన్ని కాసేపు పక్కనపెడితే రైతులు సంఘాలుగా ఏర్పడి ఈ పరిస్థితిని ఎదుర్కోలేవా? రంగయ్యలాంటి కుటుంబాలు ఊళ్ళో గౌరవంగా బతకాలంటే ఏంచేస్తే బాగుంటుంది?

# రైతుసంఘం దేనికోసం? దాని ఉద్దేశాలు ఏమి?

**1 సంక్షోభం నుండి బయటపడటానికి**

* రైతుకు అవసరమైన భరోసా ఇవ్వడానికి
* పంట నష్టాలను తగ్గించే మార్గాలు ఆలోచించి, తమలాంటి ఇతర రైతులతో కలిసి ఉమ్మడిగా పరిష్కరించుకోవడానికి
* తాము ఆధారపడిన సహజవనరుల ఉత్పాదకతను పెంపొందించుకోవడానికి
* గొర్రెలు, మేకలు, పాడిపెంపకం ద్వారా ఉత్పాదకతను పెంపొందించుకోవడానికి
* వివిధ పథకాల ద్వారా సంఘ పరిధిలోని సభ్యుల వ్యవసాయ భూములలో ఉత్పాదక పెంపుదలకు సహజ వనరుల యాజమాన్య కార్యక్రమాలను చేపట్టడం
* సంఘ సభ్యులకు సామాజిక భద్రత (బీమా సౌకర్యం, గుర్తింపు కార్డులు) కల్పించడం
* సభ్యుల వ్యవసాయ ఉత్పత్తికి అవసరమైన శిక్షణలు అందించి అభివృద్ధికి దోహదపడటం

**2. రైతు మరింత మెరుగైన వ్యవసాయం సహజవనరులపై ఆధారపడిన జీవనోపాధులతో బతకడానికి**

* సహకార సంస్థలలోని సభ్యుల, సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడం
* వ్యవసాయ కూలీలు, భూమిలేని వారు వ్యవసాయ అనుబంధ కార్యక్రమాల ద్వారా జీవనోపాధిని పెంపొందించుకోవడానికి
* అవసరమైన సహాయం అందించడం ద్వారా సభ్యుల వ్యవసాయ ఉత్పత్తులకు కావలసిన వనరులను సమకూర్చుకోవడం కోసం ప్రయత్నించడం

**3. నష్టాలు తగ్గించుకోవడానికి, లాభాలు సంపాదించడానికి**

* ఉమ్మడి వ్యాపారం (కొనుగోలు, అమ్మకం) చేపట్టి సభ్యుల ఆదాయాభివృద్ధికి తోడ్పడటం
* సుస్థిరమైన వ్యవసాయ, ఉద్యాన, పట్టుసాగు సమగ్ర పద్ధతుల ద్వారా ఉత్పాదకతను పెంచడం

**4. తమ బతుకుతెరువులకు సంబంధించిన సేవలు అందుబాటులోకి తీసుకొనిరావడానికి**

* ప్రభుత్వం చేపట్టే వివిధ పథకాల ద్వారా సంఘ సభ్యులకు సాంకేతిక సలహాలు పొందడానికి
* ఆధునిక వ్యవసాయ పరికరాలు అందించడం
* సభ్యుల వ్యవసాయ ఉత్పత్తులకు బ్రాండింగ్ ద్వారా మార్కెట్ అవకాశాలను విస్తృత పరచడం
* సభ్యులకు ప్రయోజనం కలిగించే ఏ ఇతర కార్యక్రమాలనైనా స్వంతంగా గాని, అనుసంధానంతో గాని, ఇతర సంఘాలతో గాని కలిసి సంస్థను ఏర్పాటు చేసుకోవడం వలన అభివృద్ధి సాధించడం
* రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఇతర సంస్థలతో ముఖ్యంగా స్థానిక, జాతీయ, అంతర్జాతీయ, సహకార సంస్థలతో, సమాఖ్యలతో కలిసి పనిచేస్తుంది. సభ్యులకు మెరుగైన సేవలు అందిస్తూ ఈ కింది ఉద్దేశాలతో పని చేస్తుంది

# రైతుసంఘం అంటే.......

ఎఫ్‌పిఓ/రైతుసంఘం.... అంటే సభ్యులు తమ పొదుపుతో స్వయం సహాయంతో పరస్పర సహకారంతో తమ యాజమాన్యంలో తమ నిర్వహణలో తమ ఆర్థిక, సామాజిక పురోగతి కోసం ఏర్పాటు చేసుకున్న సహకార సంఘాలు. జవాబుదారీ తనంతో పోటీ తత్వంతో స్వంత వనరులపై ఆధారపడి పనిచేసే ఒక వ్యాపార సంస్థ.

* సభ్యుల అర్థిక, సాంఘిక అభివృద్ధే లక్ష్యంగా, ఉమ్మడి అవసరాలను తీర్చుకోవడానికి సభ్యులు పరస్పర, సహాయ సహకారాలు పునాదిగా సహకార సూత్రాలను అనుసరించి సమర్థవంతంగా నడిచే వ్యాపార సంస్థ ఇది.

* * *

# సెషన్ -2

## ఎఫ్‌పిఓ పరిధి, నిర్మాణం, సభ్యత్వం పొందడానికి అర్హతలు

ఉద్దేశం: రైతు ఉత్పత్తిదారుల సంస్థ పరిధిని, సంస్థ ఏర్పడే విధానం/నిర్మాణం తెలియజేయగలుగుతారు. సంఘంలో సభ్యత్వం పొందడానికి కావలసిన అర్హతలు వివరిగలుగుతారు

**విషయాంశాలు:**

1.1 రైతులంటే ఎవరు? రైతుసంఘంలో ఎవరెవరు చేరవచ్చు?

1.2 రైతులంటే ఎవరు? ఎవరెవరు సంఘంలో సభ్యులుగా చేరవచ్చు?

పద్ధతి: ఆట, చర్చ,, ప్రశ్న పత్రం (ఔనో కాదో చెప్పండి)

శిక్షణా పరికరాలు: చార్టులు, బెలూన్లు, దారం, చాక్‌పీసు, పోస్టర్లు

సమయం: 1 గంట.

పద్ధతి వివరణ:

1) ఆట: మొదట చాక్‌పీస్‌తో సర్కిల్ గీయించాలి. సభ్యులందరిని దానిలో వచ్చి నిలబడమని కోరాలి. ఒక్కొక్క సభ్యునికి ఒక బెలూన్, దారం ఇవ్వాలి. ప్రతి ఒక్కరు బెలూన్‌ను గాలితో నింపి దారం కట్టి ఎగరవేసి ఎవరి బెలూన్ వారు సర్కిల్ దాటకుండా అందుకోవాలని చెప్పాలి. ప్రతి ఒక్కరూ సర్కిల్‌లోనే ఉంటూ, తమ బెలూన్‌నే అందుకోవాలి. అలాకాకుండా సర్కిల్ దాటినా, ఇతరుల బెలూన్ అందుకొన్నా వారు ఔట్ అవుతారని తెలిపి ఆటను ప్రారంభించాలి.

అ) ఈ ఆట వల్ల ఏమి తెలుసుకున్నారు?

ఆ) మీకు ఏమి అనిపించింది?

ఫెసిలిటేటరు సభ్యుల నుండి సమాధానాలు రాబట్టిన తరువాత పల్లెజీవం పథకంలో సంస్థ పరిధి, ప్రాంతం వివరించాలి.. ఈ ఆట వల్ల సభ్యులకు రైతు ఉత్పత్తిదారుల సంస్థకు పరిధి ప్రాంతం ఉంటుందని తెలపడం జరుగుతుంది.

2) ఎఫ్‌పిఓ నిర్మాణం గురించి పోస్టరు-1 ద్వారా వివరించాలి.

3) సభ్యత్వం పొందడానికి కావలసిన అర్హతలు వివరించాలి.

**సెషన్ ఫలితం:** ఎఫ్‌పిఓ నిర్మాణం గురించి అభ్యాసకులు పూర్తిగా తెలుసుకొన్నారు.

* * *

## 1.3 రైతులంటే:

వ్యవసాయభూమి ఉన్నవాళ్ళు, పంట పండించేవారు మాత్రమే కాదు. కౌలుదార్లు, పంట పండించడానికి పనిచేసే వ్యవసాయ కూలీలు, పశువులుపెంచేవారు, కొండగుట్టలనుండి ఫలసాయం తెచ్చి బతికేవారు కూడా రైతులే..... సహజవనరులపై ఆధారపడేవారు, ఈ ఉత్పత్తివ్యవస్థలలో దేనితోనైనా సంబంధం ఉన్నవారందరూ రైతులే....

- ★ వ్యవసాయం చేసేవారు
- ★ వ్యవసాయ కూలీలు
- ★ కౌలుదారులు
- ★ గొర్రెలు, మేకలు మేపేవారు

ఇంకా ఎవరు......... వీరందరూ రైతుసంఘంలో చేరవచ్చో లేదో చెప్పండి.....

- ★ ఊళ్ళో భూమి ఉండి పట్టణప్రాంతాల్లో నివసించేవారు...
- ★ కొండగుట్టలనుండి ఫలసాయం తీసుకొని జీవించేవారు
- ★ కట్టెలుకొట్టి జీవించేవారు
- ★ ఇటుకబట్టీలలో పనిచేసే కూలీలు
- ★ ఇటుకబట్టీ యజమానులు
- ★ అదే ఊళ్ళోనే టీకొట్టు పెట్టుకొని బతికేవారు
- ★ కిరాణాకొట్టు పెట్టుకొని బతికేవారు
- ★ బట్టల వ్యాపారులు
- ★ చేనేత కార్మికులు
- ★ దగ్గరలోని ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు
- ★ రాళ్ళు కొట్టుకొని బతికేవారు
- ★ పశువులకు నాడాలు కట్టేవారు
- ★ టైలరు
- ★ పనిముట్లు చేసే వడ్రంగం పనివారు
- ★ పనిముట్లు చేసే కొలిమిపనివారు
- ★ పిండి మిషన్ నడిపేవారు
- ★ పశువులకు చికిత్సచేసేవారు
- ★ ప్రభుత్వ ఉద్యోగులు
- ★ బడిలో పాఠాలు చెప్పే విద్యా వాలంటీరు
- ★ అంగన్‌వాడీ కార్యకర్త
- ★ భూమిలేదు కానీ ట్రాక్టరు ఉన్నవారు
- ★ ఊళ్ళో భూమి ఉంది కానీ వ్యవసాయంకోసం ఉంచిన భూమికాదు.
- ★ ఈ మూడు పంచాయితీలవారు కాకుండా ఇతర పంచాయితీల వారు

# ఎఫ్‌పిఓ పరిధి

* మూడు గ్రామ పంచాయితీలలోని రైతులు, కౌలుదార్లు, వ్యవసాయంపై ఆధారపడే కూలీలు, చిన్న జీవాల పెంపకందార్లు ఏర్పాటు చేసుకున్న సహకార సంస్థ
* మండలంలోని క్లస్టరులోని మూడు గ్రామ పంచాయితీలలో గల గ్రామాల రెవెన్యూ హద్దులు, గ్రామ సభ్యులతో కలసి ఎఫ్‌పిఓ పరిధి ఉంటుంది.

## ఎఫ్‌పిఓ నిర్మాణం, సభ్యత్వం పొందడానికి అర్హతలు

1 స్వచ్ఛంద సభ్యత్వం

2 మూలధనం

3 మూడు గ్రామ పంచాయితీలోని నివాసం కలిగిన రైతులు

* మూడు గ్రామ పంచాయితీల పరిధిలో నివాసం లేని రైతులు సేవలు పొందవచ్చా? ఔను...
* సభ్యులు కానివారికి కూడా సేవలు అందించవచ్చా? సేవారుసుము పొంది ఇవ్వవచ్చు......

## ఎఫ్‌పిఓలో సభ్యునికి కావలసిన అర్హతలు:

* సహకార సంఘ పరిధిలో నివసిస్తూ ఉండాలి
* సంఘ పరిధిలోని గ్రామాల నుండి రైతులు కాని, కౌలుదార్లు, భూమిలేని వ్యవసాయ కూలీలు, కాని గొర్రెలు మేకలు పెంపకందారులు కాని అర్హులు
* 18 సంవత్సరాల వయసు నిండి మానసిక ఆరోగ్యంతో వుండాలి
* సభ్యత్వ బాధ్యతలు అంగీకరించిన వారై వుండాలి
* 1995 సహకార చట్టానికి, సమాఖ్య నిబంధనావళికి, సంఘ, వ్యాపార, పరిపాలన నియమావళి, ప్రవర్తన నియమావళికి బద్ధులై వుండాలి.
* సభ్యత్వము రుసుం రూ100, వాటాధనం రూ.1000, దరఖాస్తు ధర రూ.10 మొత్తం రూ. 1110 గమనిక: సంఘం నడవాలంటే, పటిష్ఠంగా ఉండాలంటే సభ్యుల వాటాధనమే పునాది. కావున, పేదలు, నిరుపేదలు, ఒకేసారి వాటాధనం కట్టలేనివారు కంతులరూపంలో వాటాధనం చెల్లించే వెసులుబాటు సంఘంలో కల్పించాలి.

## ఎఫ్‌పిఓ నిర్మాణం:

* సభ్యులు అనగా సంస్థలో పూర్తిస్థాయి సభ్యత్వ అర్హత కలిగి వున్న మూడు గ్రామపంచాయితీల పరిధిలోని గ్రామాల నుండి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రైతులు, కౌలుదార్లు, భూమిలేని వ్యవసాయ కూలీలు, చిన్న జీవాల పెంపకం దార్లు రైతు ఉత్పత్తిదారుల సంస్థను ఏర్పాటు చేస్తారు.
* స్వచ్ఛందంగా, ఆసక్తితో, వ్యాపార కాంక్షతో సభ్యులుగా చేరాలి.
* ప్రజాస్వామ్య పద్ధతిలో పాలకవర్గం ఎంపిక నిర్ణయాలు తీసుకోవడం, సంఘం నియమనిబంధనలకు అనుగుణంగా నడచుకోవాలి. క్రమపద్ధతిలో సమావేశాలు నిర్వహించాలి.

## పెట్టుబడుల సమీకరణ:

* సంఘం తన వ్యాపార లావాదేవీలను చేయడానికి కావలసిన పెట్టుబడులను వివిధ మార్గాల ద్వారా సమీకరించుకోవాలి.
* సభ్యుల వాటాధనం ద్వారా
* వ్యాపారంచేయడానికి కావలసిన పెట్టుబడులకోసం అదనపు వాటాధనం సమీకరించుకోవడం ద్వారా
* వ్యాపార లావాదేవీల ద్వారా, లాభాలను సంపాదించడం ద్వారా
* సభ్యులకు, సభ్యులు కానివారికి సేవలు అందించడం ద్వారా
* ఋణ సంస్థలు, బ్యాంకుల ద్వారా ఋణాలు పొందడం ద్వారా
* ప్రభుత్వ పథకాలనుండి లబ్ధిపొందడం ద్వారా
* కొత్తవారిని సభ్యులుగా చేర్చుకోవడం ద్వారా
* రైతు సంఘం తన పరిధిని విస్తృతపరుచుకోవడం ద్వారా
* కొత్త వ్యాపారాలు, కొత్త సేవలు అందివ్వడం ద్వారా...
* ఇవి కొన్ని.... ఇంకా ఏయే మార్గాలు ఉన్నాయి......

## మనరైతుసంఘం ఏమేమి చేస్తే బాగుంటుంది?ఎలాచేయాలో చెప్పండి?

1 సమాచారాన్ని ఇవ్వాలి. జ్ఞానాన్ని పెంపొందించాలి. విత్తనాలు, పనిముట్లు అందుబాటులోకి తేవాలి. వ్యాపార లావాదేవీలు చేసి, లాభం అందివ్వాలి. ఇంకా ఏం చేసుకోవచ్చు...

2 మనవిత్తనకేంద్రాల ద్వారా, పనిముట్లకేంద్రం ద్వారా, సేవలు అందించేవారిద్వారా, వాతావరణ సమాచారకేంద్రం ద్వారా,....... ఇంకా ఎలా చేయవచ్చో చెప్పండి.

## రైతుసంఘం పాలకవర్గం కాలపరిమితి:

పాలకవర్గం రాజ్యసభ, శాసనమండలిలాగా శాశ్వత సభ. పాలక వర్గం కాలపరిమితి 3-5 సంవత్సరాలు ఉంచుకోవాలి. రైతుసంఘం నియమనిబంధనలలో ఈ విషయాన్ని పొందుపరచాలి. 3 సంవత్సరాలు ఉండటం మంచి పద్ధతి.

## రైతుసంఘం పాలకవర్గం ఎంపిక:

రైతుసంఘం కొంతమంది ప్రమోటర్ల ద్వారా ఏర్పడి రిజిష్టరు కాబడుతుంది. రిజిష్టరైన 3-6 నెలలలోపు రైతుసంఘం పాలకవర్గ సభ్యులను మహాసభ వార్షిక సమావేశంలో ఎన్నుకోవాలి.

## రైతుసంఘం పాలకవర్గంలో సభ్యుల సంఖ్య:

ప్రతి సంవత్సరం 1/3వ వంతు సభ్యులు తమ భాధ్యతల నుండి దిగిపోతారు కాబట్టి, 9 లేదా 12 లేదా 15 లేదా 18 మంది ఉండేలా ఎన్నుకోవాలి. తొలిసారి ఎన్నుకొన్నవారిలో, మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం దిగిపోయేసభ్యులను లాటరీ పద్ధతి ద్వారా ఎంపికచేయాలి., నిర్ణయాలు తీసుకోవడానికి సభ్యుల సంఖ్య బేసి సంఖ్య ఉంటే బాగుంటుంది.

* * *

# సెషన్ -3

## సహకార సూత్రాలు - విలువలు

ఉద్దేశం: సహకార విలువలు, సూత్రాలను వివరించగలుగుతారు. ఈ విలువలను ఆచరించడం ద్వారా సంస్థ పనితీరు మెరుగుపరచుకుంటారు.

శిక్షణా పరికరాలు: చార్టులు, పెన్నులు, బోర్డు, చిత్రపటాలు, విలువలు, సూత్రాలకు అనుగుణంగా

సమయం: 1 గంట

పద్ధతి: ప్రదర్శన పద్ధతి (చిత్రపటాలు), చార్టులు పొందుపరచిన ఎఫ్‌పిఓ సహకార సూత్రాలు

వివరణ: ఈ సూత్రాలు మన రైతు ఉత్పత్తిదారుల సంఘానికి వర్తింపజేసి వివరించాలి.

## సహకార సూత్రాలు

1. **స్వచ్ఛంద సభ్యత్వం:** సంఘంలో సభ్యత్వం స్వచ్ఛందంగా ఉండాలి. జాతి, మత, లింగ, వివక్షత లేకుండా, సభ్యత్వ బాధ్యతలు నిర్వర్తించడానికి ముందుకు వచ్చే ఎవరైనా సభ్యులుగా చేరవచ్చు.
2. **సభ్యులే యజమానులు:** ఇవి ప్రజల యాజమాన్యంలో నడిచే పజాస్వామ్య సంస్థలు., ఎవరైతే సంఘ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారో, ఎవరైతే సంఘం సేవలను వినియోగించుకొంటారో వారే నిర్ణయాధికారం కలిగి ఉంటారు. సంఘంలో సభ్యులు తప్పనిసరిగా ఆర్థికపరమైన అంశాలలో పాల్గొనాలి, ఫలితాలు పొందాలి
3. **ఆర్థిక లావాదేవీల ద్వారా భాగస్వామ్యం:** సంఘం పెట్టుబడిలో సభ్యులందరికీ సమాన వాటా ఉండాలి. ఈ పెట్టుబడిని, ఆస్తులను వినియోగించుకొనే అధికారం అందరికీ ఉంటుంది. కానీ సంస్థ గడించే లాభాల మీద హక్కు ఎవరి వల్ల ఎంత లాభం వస్తే అంత ఉంటుంది.
4. **స్వయం నిర్ణయాధికారం:** సహకార సంఘాలు సభ్యులచే స్వయం నిర్ణయాధికారం కలిగి ఉంటాయి. ఈ సంఘాలు ఇతరులతో లావాదేవీలు చేయడానికి, ఒప్పందాలు చేసుకోవడానికి హక్కు ఉంటుంది.
5. **సహకార విద్య:** సంఘ సభ్యులకు, పాలకవర్గానికి, సిబ్బందికి సంఘాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి కావలసిన శిక్షణలు ఇవ్వాలి. సామర్థ్యాలను పెంచాలి.
6. **సహకారంతో సహకారం (సమాఖ్యలు కావడం):** సహకార స్ఫూర్తిని పెంచడానికి స్థానిక, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ సంఘాలతో సమాఖ్యలుగా ఏర్పడవచ్చు. కలిసి పని చేయవచ్చు.
7. **సామాజిక స్పృహ:**: సభ్యుల అవసరాలకు, ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా సమాజంలోని ఇతర వర్గాలకు ఉపయోగపడే సామిజికాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి.

* * *

# సెషన్ -4

## సభ్యుల హక్కులు, ఓటువేయడానికి అర్హతలు

ఉద్దేశం: సభ్యులు ఓటు వేయడానికి కావలసిన అర్హతలు చెప్పగలుగుతారు. సభ్యులకు ఉన్న హక్కులు వివరించగలుగుతారు

విషయాంశాలు: ఓటుకు కావలసిన అర్హతలు, సభ్యుల హక్కులు

సమయం: 1 గంట

పద్ధతులు: ఉపన్యాసం, ప్రశ్నలు

శిక్షణా పరికరాలు: చార్టు, బోర్డు, స్కెచ్‌పెన్నులు, చిత్రపటాలు

* పక్క గ్రామంలో వున్న సహకార సంఘంలో జరిగిన విషయాలను సభ్యులకు ఈ విధంగా తెలిపారు.
* గ్రామంలో సహకార సంఘం మహాసభ సమావేశాలు జరుగుతుండగా అందులో ఇద్దరు సభ్యులు వారిలో ఒకరు ఓటుహక్కు కావాలని అడిగారు. అయితే ఆ సభ్యులు వాటాధనం కట్టలేదు. సమావేశాలకు రావడం లేదు. మరొకరు సహకార సంస్థతో కనీస లావాదేవీలు నిర్వహించడం లేదు. దీనిని గురించి ఆలోచించి సమాధానాలు చెప్పాలని అడగాలి.
* ప్రశ్నలు అడిగి సభ్యులకు ఉన్న హక్కులు వివరించాలి. ఔనంటారా, కాదంటారా అని అడిగి చేతులెత్తటం ద్వారా సమాధానాలు రాబట్టాలి. ఆ సమాధానం ఎందుకు సరైందో వివరించాలి.

## ఓటు వేయటానికి కావలసిన అర్హతలు

1 సహకార సంఘంలో సభ్యత్వం వుండాలి

2 సంఘంలో వాటాధనం చెల్లించి వుండాలి

3 సంఘ సమావేశాలకు హాజరు అవుతుండాలి

4 ప్రతి సంవత్సరం సహకార సంఘంలో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తుండాలి

# సభ్యుల హక్కులు

ప్రశ్నలు: (ఔనంటారా, కాదంటారా?)

* సభ్యులకు సంఘంతో చేసిన లావాదేవీలను సరి చూసుకునే హక్కు లేదు
* సభ్యులకు వార్షిక మహాసభకు హాజరై పాల్గొనే హక్కు లేదు
* సభ్యులకు వార్షిక నివేదికను పొందే హక్కు లేదు
* సంఘం పాలకవర్గ తీర్మానాలు, మహాసభ తీర్మానాలు పరిశీలించే హక్కు ఉంది
* ఆడిట్, ప్రత్యేక ఆడిట్ నివేదికలను పరిశీలించే హక్కు ఉంది
* సంఘం ఆడిట్ నివేదికపై పాలకవర్గం తీసుకున్న చర్యల నివేదికను పరిశీలించే హక్కు ఉంది
* సంఘం వ్యవహారాలపై ఏదైనా విచారణ జరిగితే అట్టి విచారణ నివేదికను పొందే హక్కు లేదు
* సంఘంతో తాను జరిపిన లావాదేవీలకు అనుగుణంగా మిగులులో భాగంగా పొందే హక్కు లేదు
* ఓటు వేయడానికి హక్కు ఉంది
* పాలకవర్గానికి పోటీ చేసే హక్కు లేదు

ఫెసిలిటేటరు సభ్యుల ప్రశ్నాపత్రాలతోని సమాధానాలను క్రోడీకరించండి.

ముఖ్యప్రశ్నలు:

1 సంఘ సభ్యులకు గల హక్కులు ఏమిటి?

* సంఘంలో చేసిన లావాదేవీలను సరిచూసుకునే హక్కు
* రైతుసంఘం చెల్లించిన మొత్తాలకు రశీదు/బాండ్లు పొందే హక్కు
* వార్షిక మహాసభకు హాజరై పాల్గొనే హక్కు
* వార్షిక నివేదికను పొందే హక్కు
* సంఘం పాలకవర్గ తీర్మానాలు, మహాసభ తీర్మానాలను పరిశీలించే హక్కు
* ఆడిట్, ప్రత్యేక ఆడిట్ నివేదికలను పరిశీలించే హక్కు
* సంఘం వ్యవహారాలపై ఏదైనా విచారణ జరిగితే అట్టి విచారణ నివేదికను పరిశీలించే హక్కు
* సంఘంలో తాను జరిపిన లావాదేవీలకు అనుగుణంగా మిగులులో భాగం పొందే హక్కు
* ఓటు చేయడానికి హక్కు
* పాలక వర్గానికి పోటీ చేసే హక్కు

ఫలితం: సభ్యులకు సహకార సంఘంలో గల హక్కులపై అవగాహన కలుగుతుంది.

★ ★ ★

# సెషన్ -5

## సభ్యుల తొలగింపు, సభ్యత్వం రద్దు, ఉపసంహరణ

ఉద్దేశం: సభ్యులను సంఘం నుండి ఏయే సందర్భాలలో తొలగించవచ్చో, ఏ సందర్భాలలో సభ్యత్వం రద్దు ఔతుందో చెప్పగలుగుతారు. సభ్యత్వం ఉపసంహరించుకొనే విధానమును వివరించగలుగుతారు

విషయాంశము: సభ్యులను తొలగించు సందర్భములు - సభ్యత్వము ఉపసంహరించుకోవడం

సమయం: 1 గంట

పద్ధతులు: చెరువులు, గట్టు ఆట

చెరువు గట్టు ఆట - నియమ నిబంధనలు.

* 20 మంది కావాలి. 10 మంది కుడివైపు, మిగిలన 10 మందిని ఎడమవైపు ఎదురెదురుగా నిలబెట్టాలి. వీరి మధ్య దూరం 5-6 అడుగులు ఉండాలి.
* కుడివైపు, ఎడమవైపు నిలవబడిన వారికి దగ్గరలో రెండువైపులా రెండు గీతలు గీయాలి
* రెండు వరెసల వారిని గీత లోపల నిలువబెట్టాలి అనగా గట్టు అనుకోవాలి
* గీతదాటి వస్తే అది చెరువు అనుకోవాలి.
* గట్టు అంటే గీతలోపల వుండాలి. చెరువు అంటే గీతను దాటి ముందుకు రావాలి
* ఫెసిలిటేటరు చెరువు అన్నప్పడు గీతలోపల ఉంటే (గట్టుమీద) ఔటు అవుతారు
* ఫెసిలిటేటరు గట్టు అన్నప్పడు చెరువులో వున్నా గీత దాటివచ్చినా, గీత తొక్కిన ఔటు అవుతారు
* కొంతమంది ఆట మధ్యలో విరమించుకొంటారు

ఆటలో మాదిరిగానే సహకార సంఘంలో నియమ నిబంధనలు పాటించకపోతే సభ్యత్వం కోల్పోతారు

సభ్యత్వం కోల్పోయే సందర్భాలు

1 వరుసగా రెండు సంవత్సరాలు మహాసభ సమావేశాలకు హాజరు కానప్పడు
2 వరుసగా రెండు సంవత్సరాలు ఓటు వేయు హక్కును కోల్పోయినప్పడు
3 ప్రతి సంవత్సర సహకార సంఘంలో కనీస వ్యాపార లావాదేవీలు నిర్వహించకపోతే

సభ్యత్వం ఉపసంహరణ

1 సహకార సంఘం సభ్యత్వం నుండి విరమించుకోదలచిన సభ్యులు కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలి.
2 కార్యదర్శిపాలక వర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటారు
3 సభ్యులు ఇంతవరకు సంఘంలో చేసిన వ్యాపారా లావాదేవీలు సరిచూసుకుని విరమించుకోవచ్చు

* * *

# రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం

## రైతుసంఘం-సేవలు

* ప్రాజెక్టు అమలు సంస్థ
* వాతావరణ జీవనోపాధుల కేంద్రం
* వ్యవసాయ వ్యాపారసేవలు

### ఒక రోజు శిక్షణా కార్యక్రమం

అభ్యాసకులు: పాలకవర్గ సభ్యులు

రూపకల్పన: వాసన్

సహకారం: APMAS

# రైతుసంఘం-సేవలు

## * <u>ప్రాజెక్టు అమలు సంస్థ</u>

## * <u>వాతావరణ జీవనోపాధుల కేంద్రం (క్లిక్)</u>

## * <u>వ్యవసాయ వ్యాపారసేవలు</u>

### ఉద్దేశాలు:

శిక్షణా కార్యక్రమం ముగిసేనాటికి పాల్గొన్న సభ్యులు

* రైతుసంఘం ఎలాంటి సేవలు అందించాలో చెప్పగలుగుతారు
* ప్రాజెక్టు అమలుసంస్థగా రైతుసంఘం పాత్ర, భాద్యత చెప్పగలుగుతారు.
* వాతావరణ జీవనోపాధుల కేంద్రం అందించే సేవలు గురించి వివరించగలుగుతారు.
* రైతుసంఘం అందించే వ్యవసాయ వ్యాపార సేవలు వివరించగలుగుతారు

### విషయాలు:

* రైతుసంఘం అందించే సేవలు
* ప్రాజెక్టు అమలుసంస్థగా రైతుసంఘం పాత్ర, భాద్యత.
* వాతావరణ జీవనోపాధుల కేంద్రం (క్లిక్ సెంటర్) అందించే సేవలు
* రైతుసంఘం అందించే వ్యవసాయ వ్యాపార సేవలు

### పద్ధతులు:

* ఉపన్యాస పద్ధతి, పెద్ద గ్రూపు చర్చ, చిన్న గ్రూపు చర్చ, బొమ్మలు/చిత్ర పటాలు

### పరికరాలు:

1 చిత్ర పటాలు

2 కథలు

# సెషన్ -1

# పల్లెజీవం కార్యక్రమ అమలు సంస్థలుగా రైతు సంఘాలు భాద్యత తీసుకోడం

**ఉద్దేశాలు:** పల్లెజీవం కార్యక్రమ అమలు సంస్థలుగా రైతుసంఘాలు ఎలాంటి భాద్యతలు తీసుకోవాలో వివరించగలుగుతారు

**అభ్యాసకులు:** పాలకవర్గ సభ్యులు, సిబ్బంది

**విషయాంశములు:**

1.1 మన ఊరి స్థితిగతులు

1.2 మన ఊరిలోని సమస్యలు

**శిక్షణా పరికరాలు:** కథ

**సమయం:** 1 గంట

పద్దతి: కేస్‌స్టడీ ఈ ఊరు... కష్టమొస్తే విలవిల

పద్ధతి వివరణ:

1) అభ్యాసకులను నాలుగు చిన్న గ్రూపులుగా చేయాలి. మొదటి రెండు గ్రూపులకు ఒకటో కథ, మిగిలిన రెండుగ్రూపులకు రెండో కథ ఇవ్వాలి.
2) చిన్న గ్రూపులు తమకు ఇచ్చిన కథ చదిసి ఆ ఊళ్ళో పరిస్థితి ఎలాఉందో చర్చించాలి.
3) మొదటి కథ చదివినవారు ఆఊరిలో ఎలాంటి సమస్యలు ఉన్నాయో రాయాలి. రెండవ కథ చదివినవారు ఆ ఊరు కష్టమొచ్చినా కళకళలాడాలంటే ఏంచేయాలో రాయాలి.
4) తమతమ గ్రూపులలో వచ్చిన అంశాలను అందరి మధ్య చర్చకు పెట్టాలి. చర్చలో వచ్చిన అంశాలను ఒక్కోదాన్ని ఒక్కో కార్డుమీద రాయాలి. సమస్యలను ఎరుపు రంగు కార్డుపై, కరువు వచ్చినా తట్టుకోగలగడానికి ఉన్న అంశాలు, ఏర్పాట్లు, సౌకర్యాలను పచ్చరంగు కార్డుపై రాయాలి.
5) ఈ చర్చను సమీక్షిస్తూ పల్లెజీవం పుస్తకంలోని 8,9,10 పేజీలను అందరితో చదివించాలి.

**ఫెసిలిటేటర్‌కు సూచనలు:**

1) **చదువురానివారు ఎక్కువ మంది ఉంటే కథ చదివి వినిపించాలి. అభ్యావకులను కథచివరన ఉన్న ప్రశ్నలు అడుగుతూ వాటికి సమాధానాలు రాబట్టాలి.**
2) **ఈ కథ చదివిన తర్వాత, మన రైతుల వెతలు తీరాలంటే ఏంచేయాలో చర్చించాలి.**

* * *



# ఈ ఊరు.... కష్టమొస్తే విలవిల....

ఇక్కడ ఎవరికి వారే యమునా తీరే... రైతులది ఎవరి కష్టం వాళ్ళదే...
కొత్త విషయమేదన్నా తెలుసుకోవాలంటే..... రసాయన మందులు, పంట సరకులమ్మే డీలర్ ఆసామే దిక్కు..
విత్తనం కావాలంటే షావుకారు లేదా డీలర్ పైన ఆధారపడాల్సిందే...
సమయానికి కావలసిన విత్తనం దొరకదు... అందిన విత్తనం మంచిదో కాదో తెలియదు...
పొలం పనులకు అవసరమైన ఎద్దులు, యంత్రాలు, పరికరాలు అందుబాటులో ఉండవు..
ఊళ్ళో పెద్దవాళ్ళ పనులు పూర్తయితే కాని చిన్న రైతుల మొహం చూడరు ట్రాక్టర్ వాళ్ళు...
జీవం లేని నేలలు.... బలం కోసం వేసే బజారు మందులకు ఖర్చు వేలకు వేలు...
ఏ సమయంలో ఏ పురుగు వస్తుందో తెలియదు... చీడ తగిలితే ఏం చేయాలో తెలియదు.
పోటాపోటీగా బోర్ల తవ్వకం.... నీళ్ళు పడితే అదృష్టం... లేకపోతే అప్పుల ఊబి...నియంత్రణ లేని నీటి వినియోగం...
మరోవైపు పంట బతికించుకోవడానికి నానా రకాల తంటాలు... జీవ తడికి నీటి చుక్క లేక కష్టాలు...
ఇంటికి, పంటకు ఆదరువుగా ఉండే పశు జీవాలకు మేత సమస్యలు, రోగాల తిప్పలు...
సమయానికి అందని వాతావరణ సమాచారం... విజ్ఞానం ఎంత పెరిగినా విషయం మాత్రం రైతుకు దూరం...
కరువు, కష్టం వస్తే.... తమ కర్మ అనే భావం.... ఊరు ఊరంతా దేవుడిపైనే భారం...!
పంట బీమా కోసమో, ప్రభుత్వం ప్రకటించే పరిహారం కోసమో ఎడతెగని ఆరాటం...


**.......ఏదీ చేతికి రాక.... నిత్యం ఎదురుచూపుల**

ఎఫ్‌పిఓ మాడ్యూల్ డ్రాఫ్టు - వాసన్

# ఈ ఊరు.... కరువొచ్చినా... కళ కళ

ఈ ఊళ్ళో అందరిదీ కలిసి ఆలోచించి, పనిచేసుకునే తత్వం...
రైతులందరూ కలిసి సంఘం పెట్టుకున్నారు... తమ కష్టాలకు పరిష్కారం ఆలోచించారు...
వానల రాక, పంటకు సోకే పురుగుల బెడద..జీవాల రోగాలు, మార్కెట్లో పంటల ధరలు...
ఇలాంటి సమాచారం ముందే తెలుసుకునే ఒక ఏర్పాటు చేసుకున్నారు...
ఒక్కమాటలో చెప్పాలంటే..ఈ ఊరొక ప్రయోగశాల... ప్రతి రైతూ ఒక శాస్త్రవేత్త....
అనుభవజ్ఞులైన రైతుల ఆసరా, పొలం బడుల ద్వారా తమ పరిజ్ఞానం పెంచుకున్నారు...
నేలకు జీవం తెచ్చారు... కలిపి పంటలేసి రిస్కు తగ్గించుకున్నారు...
పంచాయితీతో కలిసి తమకు పనికొచ్చే విధానాలను రూపొందించుకున్నారు...
చిన్న చిన్న పనులతోనే నేలలో, కుంటల్లో నీటిని నిలుపుకునే పద్ధతులు పాటించారు...
ఉన్న నీటిని పంచుకుని, వాడుకునే నియమాలు పెట్టుకున్నారు...
కరవు కాలం లో పంటను నిలుపుకునే రక్షక తడి పద్ధతులు పాటించారు...
తమను ఆదుకునే పశు జీవాలకు మేత, ఆరోగ్య వసతులు కల్పించుకున్నారు...
ఉమ్మడి వనరులును కాపాడుకుంటూ, బతుకు భద్రత పెంచుకున్నారు...
ఉత్సాహమున్న రైతులే వ్యాపారం చేసారు...తోటి రైతులకు కావాల్సిన సేవలు అందించారు...
ఆదాయం పెంచుకుని సంఘాన్ని నిలుపుకున్నారు.... మార్కెట్ మీద పట్టు పెంచుకున్నారు...
మొత్తంగా తమను తాము నమ్ముకున్నారు... ఏ కష్టమొచ్చినా తట్టుకుని నిలబడేలా మారారు...
కరువొచ్చినా, కష్టమొచ్చినా ... తట్టుకునే రీతిలో సంసిద్ధమయ్యారు...

**పల్లెను పదిలం చేసుకున్నారు... పల్లె నేలల్లో, తమ బతుకుల్లో 'జీవం' నింపుకున్నారు...**



# ఏమిటీ కార్యక్రమం?

## కరువంటే....



- నీళ్ళు తగ్గడం
- పంటలు పోవడం
- ఆస్తులు, పశువులు పోగొట్టుకోవడం

**...ఏ ఆధారం లేక**

**బతుకు నీడ కోల్పోవడం...**

## కరువుకు సంసిద్ధత అంటే...



- అందుబాటులో ఉన్న నీటిని పంటలు, జీవాల కోసం సమర్ధవంతంగా వాడుకోవడం
- ఆస్తులను, పశు జీవాలను కాపాడుకోవడం...
- బతుకుతెరువు నష్టపోకుండా చూసుకోవడం
- వాటికి అవసరమైన సహాయక వ్యవస్థలను, విధి విధానాలను ఏర్పాటు చేసుకోవడం

**...కష్టమొచ్చినప్పుడే స్పందించడం కాకుండా...**

**ఎప్పుడైనా, ఏ కష్టాన్ని అయినా తట్టుకునే ఎదుగుదలను సాధించడం....**

**బతుకు నిలుపుకోవడం.... పల్లెను కాపాడుకోవడం ....**

## రైతులంటే ......



- రైతులంటే కేవలం సాగుభూమి ఉన్న వాళ్ళు మాత్రమే కాదు.... పంట పండించే వాళ్ళు మాత్రమే కాదు....
- సహజ వనరులకు ముడిపడి ఉన్న ఉత్పత్తి వ్యవస్థలలో ఏ రకమైన ఉత్పత్తి ప్రక్రియతో (అంటే పంట పండించడం, పశుజీవాలు పోషించడం, వ్యవసాయానికి సంబంధించిన కూలీ పనులు చేయడం వంటివి) సంబంధం ఉన్నా సరే... వాళ్ళంతా రైతులే...
- రైతులంటే కార్యక్రమ అవగాహన / నిర్వచనం ఇది...

## 'పల్లె జీవం'

### ఆంధ్రప్రదేశ్ కరవు సంసిద్ధతా పథకం





కష్టకాలంలో ఎప్పుడు ఏమొస్తుందా, ఏమిస్తారా అని ఎదురుచూడకుండా, కరువు పల్లెలు తమంతతాముగా తమ సామర్థ్యం పెంచుకుని ఆ కష్టాన్ని తట్టుకుంటూనే... ఎదుగుదలకు అవసరమైన బాటలు వేసుకోవడానికి ఊతమిచ్చే ప్రయత్నం.. ఆంధ్రప్రదేశ్ కరవు సంసిద్ధతా పథకం... అదే... **'పల్లె జీవం' కార్యక్రమం...**

వర్షాధార వ్యవసాయం...,... వాతావరణ మార్పులు.... కరువు ప్రభావాలు... రైతుల సంక్షోభ పరిస్థితులు..... ఇవన్నీ ఇవ్వాల్టి నిజాలు... ముందు ముందు కొనసాగడానికి కూడా అవకాశమున్న చేదు వాస్తవాలు..... వాటికి మనం ఏ రీతిలో, ఎలా సంసిద్ధమవుతున్నామనేదే ఇప్పుడున్న కీలక ప్రశ్న..... దానికి సమాధానమే ఈ 'పల్లె జీవం' కార్యక్రమం...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కరువు సంక్షోభ జిల్లాలలో రైతులను సంసిద్ధపరిచి, వాళ్ళపై కరువు ప్రభావాన్ని తగ్గించడానికి చేస్తున్న ఒక ప్రయత్నం ఇది... అవసరమైన సహాయక వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రైతులకు ఉండే కరువు రిస్కు తగ్గించడం, ఆ కుటుంబాల జీవన భద్రత పెంచడం అనేది ఇందులోని కీలక అంశం.

రైతు సంఘాలు, పంటలు, పశు జీవ వ్యవస్థల బలోపేతం.... భూగర్భ నీరు, ఉమ్మడి వనరుల సమర్ధ యాజమాన్యం... ప్రజల జీవనోపాధులు, సంబంధిత ఉత్పత్తి వ్యవస్థలను వైవిధ్య స్థాయిలో పటిష్టపరచడం, ఆ దిశలో గ్రామ స్థాయిలో అవసరమైన సేవల పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చడం ద్వారా రైతులను కరువు పరిస్థితులను ఎదుర్కొనేలా చేయడం ఈ కార్యక్రమ లక్ష్యం....




## కార్యక్రమం అమలయ్యే ప్రాంత పరిధి

## ఈ కార్యక్రమానికి ఎవరు నేతృత్వం వహిస్తారు?

కార్యక్రమం అమలు కోసం ప్రతి మూడు గ్రామ పంచాయితీలను కలిపి ఒక క్లస్టర్‌గా గుర్తిస్తారు. క్లస్టర్ పరిధిలో ఈ కార్యక్రమాన్ని రైతులు ముందుకు తీసుకుపోవటానికి ఒక సహాయక సంస్థ (ఫెసిలిటేటింగ్ ఏజన్సీ) తోడ్పడుతుంది. ఇలాంటి సహాయక సంస్థలలోని ఒక సంస్థ నిర్దిష్ట ప్రాంత పరిధిలో ప్రధాన సహాయక సంస్థగా పనిచేస్తుంది.

ఈ కార్యక్రమం ప్రతి గ్రామ పంచాయితీ పరిధిలో కనీసం 500 వ్యవసాయ కుటుంబాలు 850 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన ప్రాంతంలో మార్పు తీసుకురావాలి.

కార్యక్రమ అమలులో రైతుల ద్వారా ఏర్పాటైన **రైతు ఉత్పత్తిదారుల సంఘం (రైతు సంఘం–ఎఫ్.పి.ఓ.)**, సంబంధిత **గ్రామ పంచాయితీ** ఈ కార్యక్రమ అమలులో కీలక పాత్ర పోషిస్తాయి. వీటికి సాయం అందించడానికి ఆయా స్థాయిలలో సహాయక సంస్థలు ఉంటాయి.



### రైతు ఉత్పత్తి దారుల సంఘం (ఎఫ్.పి.ఓ. లేదా రైతు సంఘం)

పంటలు, పశు జీవ వ్యవస్థల ఉత్పత్తి వ్యవస్థల బలోపేతం, సంబంధిత సేవల పంపిణీ అంశాలను **రైతు సంఘం** చూస్తుంది. స్థానికంగా ఉన్న ఔత్సాహిక వ్యక్తులను గుర్తించి, వాళ్ళ ద్వారా ఔత్సాహిక వ్యాపారాలకు ప్రోత్సాహం ఇస్తూ సేవలు అందిస్తుంది. ఇందులో కొన్ని ఉచితంగా అందించే సేవలు... మరికొన్ని సేవలకు నిర్దిష్ట రుసుము చెల్లించవలసి ఉంటుంది. సేవలు ఎప్పటికీ కొనసాగడానికి గాను, కొన్ని కీలక సేవలను వ్యాపారాత్మక స్థాయిలో నిర్వహిస్తారు.



### గ్రామ పంచాయితీ

సహజ వనరులు, ముఖ్యంగా నీటి వనరులు, ఉమ్మడి వనరుల యాజమాన్యం, నిర్వహణ అంశాలకు అవసరమైన సామాజిక నియమాలు/కట్టుబాట్లు, విధి విధానాల రూపొందించి, వాటిని అమలు చేసే కీలక బాధ్యత గ్రామ పంచాయితీపైన ఉంటుంది. గ్రామ పంచాయితీ స్థాయిలో ఏర్పడే 'సహజ వనరుల యాజమాన్య (ఎన్.ఆర్.ఎం.) కమిటీ' ఈ బాధ్యతను నిర్వర్తిస్తుంది.

# సెషన్ -2

## పల్లెజీవం కార్యక్రమంలో ముఖ్యాంశాలు

**ఉద్దేశం:** పల్లెజీవం కార్యక్రమం ఉద్దేశాలు సాధించడంలో రైతుసంఘం పాత్ర వివరిగలుగుతారు

**విషయాంశాలు:**

* రైతుసంఘం ఏర్పాటు
* చేసి చూపిద్దాం–అభ్యాస క్షేత్రం
* వాతావరణ జీవనోపాధుల కేంద్రం (క్లిక్) ఏర్పాటు
  - సమాచార సేవలు
  - వ్యవసాయ వ్యాపార సేవలు
  - తగిన రుసుము తీసుకొని అందించే సేవలు
* నేల ఆరోగ్యం, భూమిలో జీవం నింపడం
* ప్రజల నిర్వహణలో విత్తన వ్యవస్థ
* సుస్థిర ప్రకృతి వ్యవసాయపద్దతులకు ప్రోత్సాహం
* పనిముట్లు, యంత్రాల అద్దె కేంద్రం
* వర్షాధార వ్యవసాయంలో రక్షకతడులు/సాగుకు ప్రోత్సాహం
* పశు, జీవ ఉత్పాదక వ్యవస్థలను మెరుగుపరచడం
  - పశుజీవాల, కోళ్ళ ఆరోగ్య సేవలను పటిష్ఠపరచడం
  - సన్న జీవాల (మేకల, గొర్రెల) ఉత్పత్తి వ్యవస్థలను బలోపేతం చేయడం
  - పెరటికోళ్ళ పెంపకాన్ని ప్రోత్సహించడం
* నీటి (భూగర్భజలాల) నిర్వహణ, యాజమాన్యం
  - పంచాయితీ స్థాయిలో సహజవనరుల యాజమాన్య ఉప కమిటీ ఏర్పాటు
  - పంచాయితీ స్థాయిలో నీటి బడ్జెట్
  - భూగర్భజలాల వాడకంపై నియంత్రణ
  - మెరుగైన నీటి వినియోగం
* ఉమ్మడి వనరులను కాపాడుకోవడం, వాటి పునరుజ్జీవంకోసం ప్రయత్నం
* 100 మంది అత్యంత నిరుపేదలు, మహిళల జీవనోపాధులను బలోపేతం చేయడం

**సమయం:** 1 గంట.

**పద్ధతి:** ఆట.

**పద్ధతి వివరణ:**

1) **అభ్యాసకులను ఇద్దరిద్దరిని జంటలు చేయాలి. వీరిలో కనీసం ఒకరికి చదువు వచ్చి ఉండాలి. పై పేర్కొన్న 12 అంశాలలోని కరపత్రాలను ఒక్కొక్క గ్రూపుకు, ఒక అంశం ఇవ్వాలి. ప్రతి గ్రూపు అందులో ఉన్న అంశాలను చదివి, అర్థంచేసుకొని అందరికీ వివరించాలి.**

2) **అన్ని అంశాలను చదివిన తర్వాత ఫెసిలిటేటర్ ఈ అంశాలను చర్చకు పెట్టాలి.**

∗ పైన చెప్పిన 12 అంశాలను సాధించాలంటే రైతు సంఘం ఎలా ఉండాలి?

∗ ఏదో ఒకసారి చేసి వదిలేసే కార్యక్రమంలా కాకుండా, ఈ సేవలు రైతులకు నిరంతరం అందుతూ ఉండాలంటే ఎలాంటి వ్యవస్థలు ఏర్పాటుచేసుకోవాలి?

(చర్చలో ముఖ్యంగా వ్యాపారపరమైన, రుసుము తీసుకొని అందించే సేవలను అందించే విషయం గురించి చాలా వివరంగా చర్చించాలి. తమకుతాముగా, రైతుసంఘాల ద్వారా తమకు కావలసిన సేవలను తక్కువ ఖర్చుతో, ఎక్కువ నాణ్యతతో సమయానికి అందేలా విధానాలను గురించి మాట్లాడాలి.)

∗ సభ్యత్వం

- ఎవరు సభ్యులుగా ఉండాలి? (వ్యవసాయం, పశుజీవాలపై, సహజవనరులపై ఆధారపడి బతుకుదెరువు పొందే వారంతా, కూలీలతో సహా)

- మూడు పంచాయితీలకు విస్తరించాలంటే ఏంచేయాలి?

∗ రైతుసంఘం సొంతంగా పెట్టుబడి ఎంత పెట్టాలి? ఈ పెట్టుబడిని ఎలా సమకూర్చుకొంటారు?

* * *

## 3. రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు



కరువు ప్రాంత వ్యవసాయ అభివృద్ధి కోసం ఆ ప్రాంత రైతులే సంఘటితమై స్వయంగా నిర్వహించుకొనే కార్యక్రమం ఈ 'పల్లె జీవం' (ఆంధ్రప్రదేశ్ కరవు సంసిద్ధతా పథకం).


క్లస్టర్ స్థాయిలో అందుబాటులో ఉన్న ప్రజలు/ రైతుల సంఘటిత శక్తి, సామర్థ్యాల పైనే కార్యక్రమ అమలు తీరు ఆధారపడి ఉంటుంది. ఆ క్రమంలో క్లస్టర్ పరిధిలో రైతు ఉత్పత్తి దారుల సంఘాలు, ప్రతీ గ్రామంలో సహజ వనరుల సంరక్షణ, యాజమాన్య వ్యవస్థల కోసం గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ఏర్పడే సబ్-కమీటీలు కార్యక్రమ అమలు లో ముఖ్య పాత్ర వహిస్తాయి.

**ఫెసిలిటేటింగ్ ఏజన్సీ పాత్ర**

- సంఘాల పనితీరును విశ్లేషించడం
- ఎఫ్.పి.ఓ ఏర్పాటు ప్రక్రియకు సాయం చేయడం
- సంస్థాగత, నాయకత్వ సామర్థ్యాలను పెంచడం
- స్వీయ నిర్వహణకు అవసరమైన రీతిలో మార్గ నిర్దేశనం చేయడం
- నాయకత్వ మార్పిడికి ప్రోత్సాహం,
- ఆర్థిక నిర్వహణ, పారదర్శకత, జవాబుదారీతనం వంటి అంశాల పరంగా సాయం అందించడం

### రైతు ఉత్పత్తి దారుల సంఘం (రైతు సంఘం) ఏర్పాటు

ప్రతి మూడు పంచాయితీలకు కలిపి క్లస్టర్ స్థాయిలో ఒక రైతు ఉత్పత్తిదారుల సంఘం (రైతు సంఘం -ఎఫ్.పి.ఓ.) ఉంటుంది. ఇందులో దాదాపుగా 1500 మంది సభ్యులు ఉంటారు.



రైతు సంఘం ఏర్పాటు కోసం, పంచాయితీ పరిధిలో పనిచేస్తున్న విభిన్న బృందాలు/ సంఘాలను గుర్తించి, అవి అందించే సేవలు, వాటి పనితీరు విశ్లేషించాలి.

అలాంటి పరిస్థితి లేకపోతే, ఆవాస ప్రాంతాలలో పరిపక్వ పనితీరును చూపుతున్న సంఘాలు/ బృందాల ప్రతినిధులతో కొత్తగా ఒక ఎఫ్.పి.ఓ ఏర్పాటు చేయవచ్చు.

తొలుత కనీసం 20 మంది రైతులతో ఒక కొత్త ఎఫ్.పి.ఓ ప్రారంభించవచ్చు. వీళ్ళు నిర్దిష్ట మొత్తంలో తమ వంతు మూల ధనాన్ని (షేర్ కాపిటల్) చెల్లించవలసి ఉంటుంది. క్రమేపీ ఎఫ్.పి.ఓ.లో సభ్యుల సంఖ్యను పెంచుకోవచ్చు. సంఘ సభ్యులు ఒక్కొక్కరికి కనీసం రూ.1000/- మూల ధనం చెల్లిస్తే బాధ్యత ఉంటుంది. దీనిని మ్యుచవల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ (మ్యాక్స్)' చట్టం పరిధిలో రిజిస్టర్ చేయించాలి..

## ఎఫ్.పి.ఓ. ఎంపికలో కీలక ప్రామాణికాలు

- కార్యక్రమ ప్రాంత పరిధిలో పనిచేయడం
- కార్యక్రమంలోని అన్ని పనులను చేయగలిగే ఎజెండా కలిగి ఉండడం
- రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, చిన్న, సన్న కారు రైతుల కోసం పనిచేయడం
- క్రమం తప్పకుండా సమావేశాల నిర్వహణ
- రికార్డుల సమర్ధ నిర్వహణ
- ఎటువంటి అప్పుల భారం/వివాదాలు లేకుండా ఉండడం
- కార్యక్రమం కోసం విడిగా ఖాతా నిర్వహణకు ఆమోదం తెలపడం

రైతుసంఘాన్ని బలోపేతం చేసే క్రమంలోనే స్థానికంగా ఉండే ప్రాథమిక సంఘాలను (అంటే ఎస్.హెచ్.జి.లు, ఉమ్మడి ప్రయోజన బృందాలు వంటివి) బలోపేతం చేయాలి.. వాటిలోని సభ్యులను రైతుసంఘంలో సభ్యులుగా చేరడానికి ప్రోత్సహించాలి.

ఇలా ఏర్పాటై, రిజిస్టర్ అయిన రైతు సంఘం, వాటి ఏర్పాటు ప్రక్రియలో తోడ్పడిన కార్యక్రమ సహాయక సంస్థకు నిర్ధారిత కార్యక్రమాల కోసం నేరుగా ప్రాజెక్టు నిధులు అందుతాయి. రైతు సంఘం, కార్యక్రమ సహాయక సంస్థ కలిసి నిర్వహించే ఉమ్మడి ఖాతాకు ఈ నిధులు అందుతాయి.



## ఎఫ్.పి.ఓ అందించే సేవలు

'క్లిక్' కేంద్రాలు, ఉపకరణాల అద్దె కేంద్రాలు, ఇతర సహాయ వ్యవస్థల ద్వారా ఎఫ్.పి.ఓ. ఈ కింద తెలిపిన సేవలు అందిస్తుంది.


- సమాచార సేవలు (వాతావరణం, పంటలు, తెగుళ్ల సమాచారం, భూ గర్భ నీటి స్థితిగతుల వివరాలు మార్కెట్ ధరలు వంటివి)
- భూసార పరీక్షల సేవలు
- జీవ ఎరువులు, మందుల అమ్మకం
- వ్యవసాయ పనిముట్లు/ పరికరాల అద్దె కేంద్రం నిర్వహణ
- విత్తన పంపిణీ సేవలు
- పశు జీవాలకు టీకాల సేవలు/రోగాలకు మందులు
- జీవాలకు అదనపు దాణా, పోషకాహారం
- రక్షక తడి అందించడానికి అవసరమైన యంత్రాలు/పరికరాలు
- గడ్డి జాతులు, బయోమాస్ మొక్కల విత్తనాలు
- పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ సాయం
- కార్యక్రమలో ఆయా కీలక అంశాలకు సంబంధించిన వివరాలు/ డాటా నమోదు, నిర్వహణ సంబంధిత సేవలు

**కార్యక్రమంలో తమ తమ నిర్దిష్ట బాధ్యతలు, విధులను స్పష్టంగా అర్థం చేసుకుని, వాటిని సమర్థవంతంగా నిర్వహించే రీతిలో సహాయక సంస్థ (ఫెసిలిటేటింగ్ ఏజన్సీ (ఎఫ్.ఏ.) మరియు రైతు ఉత్పత్తిదారుల సంఘం మధ్య ఒక త్రైపాక్షిక ఒప్పందం ఉంటుంది. ఈ ఒప్పందం జరిగిన తఃరువాతనే కార్యక్రమంలో కీలకమైన క్షేత్ర స్థాయి పనులు ప్రారంభమవుతాయి.**

## 1. అభ్యాస క్షేత్రం: చేసి చూద్దాం... తోటివాళ్ళకు చూపిద్దాం..!!

### అనుభవ పూర్వకంగా నేర్చుకునే ప్రయత్నం (100 హెక్టార్లు)

ఎంచుకున్న క్లస్టర్ లో అన్ని గ్రామాలలో వాతావరణ పరిస్థితులకు తట్టుకుని నిలబడగలిగి, సహజ వనరులను మరింత మెరుగు పర్చుతూ, రైతుకు స్థానికంగా నిలకడైన ఆదాయాన్ని అందించే పంటల వ్యవస్థ ఏర్పరుచుకోవటం ఒక ముఖ్య ఉద్దేశం. ఇలాంటి పంటల వ్యవస్థ ని ప్రయోగాత్మకంగా ఒక 250 ఎకరాలలో చేపట్టాలి. ఊరిలో అందరికీ ఆమోదయోగ్యమై, చిన్న రైతులూ, దళిత, ఆదివాసీ రైతులు ఎక్కువగా ఉన్న ప్రాంతాన్ని ముందస్తుగా చేపట్టాలి. దీనిని అభ్యాస క్షేత్రం అందాము.



ఈ అభ్యాస క్షేత్రంలో ఒక సంవత్సరం మొత్తంలో అమలుచేయవలిసిన ముఖ్యమైన 5 అంశాలపై ప్రణాళికలు చేసుకొని అమలు పరచాలి:

**1**

**నేలల్లో సేంద్రియ పదార్థం, భూసారం పెంచడం: తేమ నిలవ ఉంచుకునే పనులకు. బూమికి బలాన్నిచ్చే అంతర పంటలనూ, నవధాన్య పద్ధతులనూ ప్రోత్సహించటంతో పాటు, పంట అవశేషాలను కాల్చకుండా కంపోస్ట్ చేసి వాడుకొనే పనులను చేపట్టాలి. ప్రతి ఎకరానికి కనీసం రెండు టన్నుల సేంద్రియ పదార్థపు ఎరువును అందించడం ఈ ప్రణాళిక ముఖ్య లక్ష్యం గా ఉండాలి.**




**2**

**కరువును తట్టుకొనే, రిస్క్ తగ్గించే పంటల బహు పంట విధానాలు, నవధాన్య పద్దతులు, అంతర పంటలూ, రైతులకు ఉన్న పశువులకు, జీవాలకు,కోళ్ళకు కావలిసిన మేత వచ్చేలా పంటల విధానంలో మార్పులు, వాటికి అనువైన విత్తన వ్యవస్థని ఏర్పాటు చేసుకోవడం వంటి పనులకు ప్రణాళికలో ప్రాధాన్యత ఇవ్వాలి.**

**3**

**స్థానికంగా నీటిని నిల్వ చేసుకుని, వర్షం పడనప్పుడు అవసరానికి రెండు, మూడు తడులు ఇచ్చుకోవటానికి కావాల్సిన నీటి వ్యవస్థ ను ఏర్పరుచుకోవటం. రక్షక తడికి అవసరమైన నీటిని పంట స్థలానికి తరలించడం, వాటికి కావలిసిన నియమాలు, నీటిని ఇవ్వటానికి కావలిసిన పైపులు, పంప్ లు, స్ప్రింక్లర్ లాంటి వ్యవస్థలు చేసుకోవటం, ఆ రక్షక తడి ఆధారంగా పంటను కాపాడుకోవటం, ఉత్పత్తిని పెంచుకునే అంశాలకు కూడా ప్రణాళికలో చోటు కల్పించాలి. భూగర్భ నీటిని పంచుకునే ఏర్పాట్లు, లైనింగ్ చేసిన ఫారంపాండ్స్ వంటివి ఈ ప్రణాళికలో కీలక అంశాలుగా ఉండాలి.**

**4**

**పెట్టుబడులు తగ్గించే ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అంతటా అమలు లోనికి తీసుకురావటంబీ నేల సారం పెంచడం, పురుగులు, తెగుళ్ల పర్యవేక్షణ, నియంత్రణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవడం వంటి అంశాలు ప్రణాళికలో ఉండాలి.**

**5**

**వ్యవసాయ ఉపకరణాలు/యాంత్రీకరణ: విత్తడం నుంచి మొదలుకుని పంట అమ్మకం వరకు అన్ని రకాల వ్యవసాయ పనులకు అవసరమైన ఉ పకరణాలు, యంత్రాలు అందుబాటులో ఉండే ఏర్పాట్లు చేసుకోవడం. పనిముట్లు-ఉపకరణాల అద్దె కేంద్రాల ఏర్పాటు తో వ్యవసాయ కార్మికులకు వీటిని అందుబాటులోనికి తీసుకుని వచ్చి వారి పని సామర్థ్యాన్ని, ఆదాయాన్ని పెంచడం ఇందులో కీలకం. అభ్యాస క్షేత్రం అంతటా సమయానికి విత్తనం వేయటం ముఖ్యం.**

## పొలం బడి కార్యక్రమాలు

- 250 ఎకరాల ప్రాంతాన్ని రెండు భాగాలుగా విభజించి, ప్రతి 175 ఎకరాల ప్రాంతానికి చెందిన షుమారు 30 మంది రైతులతో ఈ పద్ధతులు పాటించే విధంగా ప్రణాళిక తయారుచేస్తారు.
- ప్రతి 15 రోజులకు ఒకసారి రైతులు సమావేశమై, తమ ప్రాంతానికి సంబంధించి, ఎంచుకున్న ప్రణాళికల అమలు తీరు చర్చించుకుంటారు.
- ఆ సీజన్‌కు సంబందించి అవసరాలు గుర్తించి కార్యాచరణ తయారుచేసుకుంటారు
- నిర్ణయించిన కార్యాచరణ/క్యాలెండర్ ఆధారంగా ఏడాది పొడవునా ఈ పొలంబడి కార్యక్రమాలు కొనసాగుతాయి.
- ఎఫ్.పి.ఓ. అందించే సేవల పరంగా ఇతర రైతుల నుంచి డిమాండ్ పెంచడం పొలం బడి ప్రధాన ఉద్దేశం.

**కార్యకమ లక్ష్యాల పరంగా క్లస్టర్ స్థాయిలో ఏర్పాటయ్యే సంస్థలు, సహాయక వ్యవస్థలు అన్నీ కూడా ఈ అనుభవపూర్వక ప్రయత్నానికి సహకారం అందిస్తాయి. ఈ అభ్యాస క్షేత్రం లోని అనుభవం భవిష్యత్ కార్యక్రమానికి పునాది అవుతుంది.**

## 2. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే రీతిలో వ్యవసాయ ఉత్పత్తికి అవసరమైన సహాయ వ్యవస్థలను పటిష్టపరచడం

అభ్యాస క్షేత్రం ఎన్నుకొన్న పంచాయితీలో 250 ఎకరాల విస్తీర్ణమున్న ప్రాంతానికే పరిమితం. అభ్యాస క్షేత్రంలో పనులు చేస్తూనే, సమాంతరంగా క్లస్టర్ లోని అందరు రైతులకూ సంబంధించిన కార్యక్రమాలూ మొదలు పెట్టాలి. రైతులకు అవసరమయ్యే సేవా వ్యవస్థలు ఏర్పరచటం, వివిధ ప్రభుత్వశాఖల / కార్యక్రమాలనుంచి రైతులకు ఎక్కువ అవసరం ఉన్న పనులకు నిధులు సమీకరించుకోవటం (కన్వర్జెన్స్) వంటివి ఇందులో ముఖ్యమైన పనులు.


వ్యవసాయానికి సంబంధించిన కొన్ని పనులు, వనరులు రైతుల నియంత్రణలో ఉంటే, పెట్టుబడి, నీరు, నేల, విత్తనం, ఎరువులు, మందులు, పంట పరిజ్ఞానం, యంత్రాలు, పరికరాలు, కూలీలు ఇలా... పలు అంశాలకు సంబంధించి రైతులు తమకు అందుబాటులో ఉన్న సహాయక వ్యవస్థలపై ఆధారపడతారు. వాతావరణ మార్పుల నేపధ్యంలో సకాలంలో వాతావారణ సమాచారం, దాంతో పాటు పంటకు సోకే పురుగులు, తెగుళ్ల సమాచారం, వాటి నియంత్రణ మార్కెట్ ధరల సమాచారం వంటివి అందడం వ్యవసాయంలో ఒక ముఖ్యమైన అవసరమయ్యింది. వీటిని పురుగుమందుల డీలర్ల దగ్గరనించి కాకుండా, రైతు ఉత్పత్తిదారుల సంఘం నిర్వహణలో ఒక నమ్మకమైన వ్యవస్థ గా తయారు చేసుకోవటం అవసరం.

సేవారుసుము తీసుకొని అందించడం వల్ల రైతు సంఘాలు ఈ సేవలను ఎక్కువ కాలం రైతులకు అందించగలుగుతాయి.

ఈ మేరకు రైతులు తమ రైతు సంఘం ద్వారా ఈ కింద తెలిపిన రీతిలో తమ అవసరాలకు అనువైన సహాయక వ్యవస్థలను ఏర్పరచుకోవాలి.

❖ **వాతావారణ సమాచార, జీవనోపాధుల కేంద్రాల (క్లిక్ సెంటర్లు) ఏర్పాటు**

వ్యవసాయ అంశాలకు, జీవనోపాధులకు సంబంధించి 'క్లిక్' కేంద్రం పేరిట ఒక సమగ్ర సేవల కేంద్రాన్ని రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పరిచి, దానిద్వారా రైతులకు అవసరమైన సేవలను వ్యాపార ధోరణిలో అందిస్తుంది. అనుభవజ్ఞులైన రైతులు, 'రైతు విజ్ఞాన సమితి' పేరిట ఏర్పాటు చేసే ఒక సలహా కమిటీ నేతృత్వంలో 'క్లిక్' కేంద్రం పని చేస్తుంది.



క్లస్టర్ స్థాయిలో 3 పంచాయితీలకు కలిపి ఒక 'క్లిక్' సెంటర్ ఉంటుంది. ఇందులో విద్యుత్, ఇంటర్ నెట్ సౌకర్యంతో ఒక కంప్యూటర్, టీవి ఉంటాయి.. ఒకేసారి దాదాపు 10 మంది రైతులు కూర్చుని దానిని చూసే

ఏర్పాటు ఉంటుంది. గ్రామ పంచాయితీ కార్యాలయంలో కానీ, లేదా అందరికీ అనువైన ప్రదేశంలో ఏదైనా అద్దె కేంద్రంలో ఈ 'క్లిక్' సెంటర్ ఏర్పాటు చేస్తారు.

తొలి రెండేళ్ళు సంబంధిత సహాయక సంస్థ దీని నిర్వహణకు సాయపడుతుంది. తరువాత ఈ కేంద్రం పూర్తిగా రైతు సంఘం నేతృత్వంలో పని చేస్తుంది. కార్యక్రమానికి సంబంధించిన అన్ని వివరాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. అలానే ఈ కేంద్రం వివిధ శాఖలకు సంబంధించిన స్థానిక అధికారులకు కూడా ఈ మూడు పంచాయతీలకు సంబంధించి క్లిక్ ఒక సమన్వయ కేంద్రం గా ఉపయోగపడుతుంది.

## అందించే సేవలు

'క్లిక్' సెంటర్ ప్రధానంగా రెండు విభాగాలుగా సేవలు అందిస్తుంది.




### అ) సమాచార సేవలు (ఉచితం)

ఇందులో స్థానిక వర్షపాత వివరాలు, వాతావరణ సూచనలు, విభిన్న పంటలకు వచ్చే వ్యాధులు/తెగుళ్ల వివరాలు, మార్కెట్ సంబంధిత సమాచారం, భూ గర్భ నీటి స్థితిగతులకు సంబంధించిన వివరాలు వంటివి ఉంటాయి. పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ఎస్.ఎం.ఎస్. ఆధారిత సేవలు కూడా అందుతాయి.

శిక్షణ పొందిన ఒక వ్యక్తి ఈ కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉంటారు. రైతులు తీసుకొని వచ్చే ఏ సమస్యకైనా పరిష్కారాలను, సంబంధిత విజ్ఞానాన్ని కంప్యూటర్ లో వీడియోలు, బొమ్మలు, టెక్స్ట్ రూపంలో ఉన్న సమాచారాన్ని బట్టి రైతులకు వివరిస్తారు. తరచుగా నిర్దిష్ట వ్యవధుల్లో రైతుల సమావేశాలు, వారాంతపు షో లు వంటివి నిర్వహిస్తారు.

### ఆ) ఉత్పత్తులు, చెల్లింపులు ఆధారంగా వ్యాపార సేవలు



సుస్థిర వ్యవసాయానికి అనువైన సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. నిర్దిష్ట రుసుము చెల్లించి రైతులు ఈ సేవలు పొందవచ్చు. ఔత్సాహికులైన వ్యక్తుల ద్వారా ఈ వ్యాపార సేవలు అందుతాయి. పురుగులు, తెగుళ్ళను నియంత్రించే జీవ మందులు, ఫెర్మోన్ ట్రాపులు, పురుగులు అంటుకునే పళ్ళాలు, వ్యవసాయ పనిముట్లు, ఉపకరణాల విడి భాగాలు వంటివి ఇక్కడ దొరుకుతాయి.

రైతు సంఘానికి సెక్రటేరియట్ గా పని చేయడం, ప్రజల నిర్వహణలో విత్తన వ్యవస్థకు అవసరమైన సహాయ సేవలు అందించడం ( విత్తన ఇండెంట్ ల తయారీ, విత్తన పంపిణీ వంటివి), పంటలకు సోకే పురుగులు, తెగుళ్ల పర్యవేక్షణ, వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రం నిర్వహణ, పశు జీవాలకు టీకాల సేవలు, మార్కెటింగ్ సాయం వంటి సేవలతో పాటుగా, స్థానికంగా రైతులకు అవసరమైన విభిన్న సేవలను క్లిక్ కేంద్రం చెల్లింపుల ప్రాతిపదికగా అందిస్తుంది.

### ❖ నేల ఆరోగ్యం- సమగ్ర భూసార యాజమాన్యం పద్ధతులకు ప్రోత్సాహం

నేలలో సారం పెంచడం, తేమను పట్టి ఉంచే సామర్థ్యం పెంచడానికి రకరకాల పద్దతులు ఉన్నాయి. పరిస్థితుల విశ్లేషణలో భాగంగా గుర్తించిన భూ వినియోగ తీరును బట్టి నేల సామర్థ్యం అంచనా వేయవచ్చు. తదనుగుణంగా, భూ సార పరీక్షలు చేసి, వాటి ఆధారంగా 'నేల ఆరోగ్య ప్రణాళిక'లను రూపొందించాలి.

పంట మార్పిడి పద్దతులు, అంతర పంటలు, మల్చింగ్, పచ్చి ఎరువు అందించే పంటలు, కంపోస్ట్ గుంతలు, చెరువు మట్టి చల్లడం, నాడేప్, మసాలా మిట్టి, డ్రం కంపోస్ట్ వంటి రకరకాల కంపోస్టు పద్దతులు, బయో మాస్ మొక్కల పెంపకంతో పాటుగా ఆవు పేడ, మూత్రం ద్రావణం వంటి జీవ ఎరువులు, రోటో వేటర్లు, బయో మాస్ కట్టర్లు వంటి ఉపకరణాల అందుబాటు తదితర అంశాలను చేరుస్తూ 'నేల ఆరోగ్య ప్రణాళిక'లను రూపొందించి, అమలు చేయాలి. భూసార పరీక్షలతో పాటుగా ఆయా అంశాలకు సంబంధించిన సేవలను చెల్లింపుల ప్రాతిపదికపై 'క్లిక్' కేంద్రాలలో రైతులు పొందేలా చూడాలి.



# ప్రజల నిర్వహణలో విత్తన వ్యవస్థ

అదనుకు విత్తడం అనేది వర్షాధార వ్యవసాయంలో కీలకమైన అంశం. రైతులకు సకాలంలో, స్థానిక పరిస్థితులకు అనువైన, నాణ్యమైన విత్తనం అందుబాటులో ఉంటే ప్రతికూల పరిస్థితులను కొంతమట్టుకు తట్టుకుని నిలబడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే గతంలో అమలై, ఫలితాలు సాధించిన 'ప్రజల నిర్వహణలో విత్తన వ్యవస్థ' కార్యక్రమ ప్రక్రియలను ఈ కార్యక్రమంలో చేర్చారు.

అందులో భాగంగా, రైతు సంఘం 'మన విత్తన కేంద్రం'గా పని చేస్తుంది. క్లస్టర్ స్థాయిలో ప్రజా ఆధారిత విత్తన వ్యవస్థ కు ఇది నోడల్ కేంద్రంగా ఉంటుంది. రైతు సంఘం సభ్యుల్లో ఐదుగురిని ఒక సబ్ కమీటీ గా ఎంపిక చేసి, వాళ్ళ అధ్వర్యంలో ఈ అంశానికి సంబంధించిన పనులు జరిగేలా చూడాలి.

కరవు కు తట్టుకొని నిలబడే పంట వ్యవస్థల విశ్లేషణ ఆధారంగా అవసరమైన పంటలు, వాటి మూల విత్తనాన్ని తెచ్చుకుని క్లస్టర్ స్థాయిలో అవసరమైన విత్తనం తయారు చేసుకొని (ధ్రువీకరణ విత్తనంగా మార్చడం) రైతులకు తగిన ధర కి అమ్మటం, జిల్లా, రాష్ట్ర స్థాయి విత్తన పంపిణీ ప్రణాళికలతో అనుసందానపర్చడం వంటివి ఈ వ్యవస్థలో కీలక ప్రక్రియలు. 'ప్రజా ఆధారిత విత్తన వ్యవస్థ' మార్గదర్శకాలు అన్నింటినీ రైతు సంఘం పాటిస్తుంది.




**స్థానికంగా ఉండే 'క్లిక్' కేంద్రం విత్తన అమ్మకాలకు సంబంధించిన లైసెన్సు పొంది స్థానిక రైతులకు విత్తనాలు అమ్ముతుంది. అవసరం మేరకు 'క్లిక్' కేంద్రం ఆయా పరిశోధనా కేంద్రాల నుంచి, రైతుల నుంచి దేశీయ రకాలలో మంచి విత్తనాలు సేకరించి, స్థానిక రైతులకు అమ్మకానికి అందుబాటులో పెడుతుంది.**

## సమగ్ర, సుస్థిర, ప్రకృతి వ్యవసాయ పద్ధతులకు ప్రోత్సాహం

సుస్థిర/ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు దీర్ఘకాలంలో సత్ఫలితాలు ఇస్తాయి. రైతులు సొంతంగా లేక స్థానికంగా తయారయిన ముడి వనరులను ఉపయోగించి చేసే ఈ పద్ధతిలో సహజ స్థాయిలో నేలకు, పంటకు జవసత్వాలు అంది, ఖర్చు తగ్గి రైతులు ప్రతికూల పరిస్థితులను తట్టుకుని నిలబడే అవకాశం ఉంటుంది.

ఇందులో ప్రధానంగా మూడు ఉప ప్రక్రియలు ఉంటాయి.

- *అవి రైతులను సంఘటితపరిచి, సంసిద్ధులను చేయడం*
- *పురుగు మందులు లేకుండా చేసే ప్రకృతి వ్యవసాయం పద్ధతులకు తోడ్పడే జీవ మందుల దుకాణం ఏర్పాటు*
- *అనుభవజ్ఞులైన రైతులతో మిగతా రైతులకు సేవలు అందించడం.*

స్థానిక వాతావరణ సమాచారం, పంటలకు సోకే పురుగులు, తెగుళ్ల స్థానిక పర్యవేక్షణ కోసం రూపొందించిన వ్యవస్థను 'క్లిక్' కేంద్రంతో అప్పటికే అనుసంధానపరచడం కూడా ఈ సుస్థిర పద్ధతులకు ఉపయోగపడుతుంది.

**ఈ సేవలను వీలయిన మేరకు 'క్లిక్' కేంద్రాలతో అనుసంధానం చేయాల్సి ఉంటుంది. విభిన్న రకాల సేంద్రియ/ జీవ/ వృక్ష సంబంధిత ఎరువులు, మందుల తయారీకి గాను ఔత్సాహిక వ్యక్తులను గుర్తించి, వాళ్ళతో వ్యాపార ధోరణిలో 'క్లిక్' కేంద్రాల ద్వారా ఈ సేవలు అందేలా చూడాలి.**




## వ్యవసాయ పరికరాలు, యంత్రాల అద్దె కేంద్రాలు (కస్టం హైరింగ్ సెంటర్లు)

ఇవి కూడా ‘క్లిక్’ కేంద్రాల పరిధిలోనే పని చేస్తాయి. రైతులు సకాలంలో విత్తడం, అంతర్ పంటల సాగు, కోత, నూర్పిడి వంటి వివిధ కీలక పనులకు ఈ అద్దె కేంద్రం ఉపయోగపడుతుంది. కూలీలు. ముఖ్యంగా మహిళా కూలీల శ్రమ భారం తగ్గించడం, ఉత్పాదకత పెంచే పరికరాలను అద్దెకు అందించటం వంటి అంశాలు కూడా ఈ కేంద్రాల పరిధిలో ఉంటాయి. వ్యవసాయ కూలీలు తక్కువ సమయంలో ఎక్కువ పని అందించ కలగటం, ఎక్కువ సంపాదించటానికి తోడ్పడటం, వారి పని భారం తగ్గించటం దీని వల్ల అందరికీ సమకూరే లాభం.

పంటల విశ్లేషణ, వ్యవసాయ కూలీలు, మహిళల పరిస్థితుల విశ్లేషణలో బయటికి వచ్చిన అంశాల ఆధారంగా ఈ కేంద్రాల సేవలను నిర్ణయించవచ్చు.

క్లస్టర్ స్థాయిలో వ్యవసాయ ఉపకరణాలకు సంబంధించి ఏ సాయమైనా ఈ కేంద్రాల నుంచి అందేలా చూడాలి.

**రైతు సంఘం పరిధిలోని ‘క్లిక్’ కేంద్రం వద్ద అందుబాటులో ఉండే వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను గానీ, వ్యక్తిగతంగా సభ్యులకు చెందిన వాటి ద్వారా గానీ ఈ అద్దె కేంద్రాలు తమ సేవలు అందించవచ్చు. సేవలకు అవసరమైన నిర్ణీత ఫీజులను నిర్వహణా కమిటీ ముందుగానే నిర్ణయించి తెలియచేయాలి.**



## రక్షిత సాగుకు ప్రోత్సాహం-మద్దతు

కరువు వంటి ప్రతికూల పరిస్థితులను తట్టుకుని నిలబడే విషయంలో పంటను బతికించుకోవడానికి రక్షక తడి అందించడం ముఖ్యం. సకాలంలో వానలు లేకపోవడం, నీరు తగినంతగా అందుబాటులో లేని పరిస్థితుల్లో, పంట విత్తనం నాటడం మొదలు పంట ఎదిగే కీలక దశలలో ఈ రక్షక తడి చాల ముఖ్యం.


ఇలా పంటలకు అవసరమైన రక్షక తడి అందించడానికి అవసరమైన విధి విధానాలు స్థానికంగా ఏర్పరుచుకోవాలి.

'క్లిక్' కేంద్రానికి చెందిన సలహా కమీటీ తొలుత నిర్దిష్ట ప్రాంత పరిధిలో ఈ సేవలు అందించి, దాని ఆదారంగా సేవల రుసుమును నిర్ణయించవచ్చు.

అవసరమైన వ్యవస్థాగత ఏర్పాట్లు (డీజిల్ ఇంజన్లు, మోటార్ పంపులు, రేయిన్ గన్లు, స్ప్రింక్లర్లు, పైప్ లైన్లు, ట్రాక్టర్ ట్యాంకులు, డ్రిప్ లైన్, పి.టి.ఓ. ఆపరేటేడ్ పంపులు వంటివి) చేయడానికి నిధుల పరమైన వెసులుబాటు ఉంటుంది.

ఈ సేవలు 'క్లిక్' సెంటర్ల పరిధిలో రైతులకు నిర్ణయించిన ధరకు అందుబాటులో ఉంటాయి.

**దగ్గర దగ్గరగా ఉండే పంటలు, దూరంగా నాటే పంటలు- వీటి కోసం ప్రతి గ్రామ పంచాయితీ పరిధిలో, డిమాండ్ ప్రాతిపదికగా, 150 ఎకరాలకు తక్కువ కాకుండా రక్షక తడి సేవలు అందించే ఏర్పాట్లు చేయాలి.**



## పశు జీవ ఉత్పాదక వ్యవస్థలను మెరుగుపర్చడం

సన్న, చిన్న జీవాలు కరవు ప్రాంతాలలో బతకటానికి ఒక ముఖ్య ఆధారం. జబ్బుల బారిన పడటం, సరైన స్థాయిలో మేత అందుబాటులో లేకపోవడం వంటి పరిస్థితులు సాధారణం గా ఉంటున్నాయి.

సరిపడా రీతిలో సరైన మేత/ఆహారం/దాణా, అవసరమైన ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటే జీవాల పునరుత్పత్తి సామర్థ్యం పెరిగి, తక్కువ సమయంలో ఎక్కువ జీవాలు ఉత్పతి అయి వాటిపై ఆధారపడిన కుటుంబాలకు అవి అదనపు ఆదాయం అందిస్తాయి..

అందుకనే ఈ కార్యక్రమంలో పశు జీవాలకు మేత వనరులను పెంపొందించడం, ఆరోగ్య సేవల వ్యవస్థలను మెరుగుపర్చుకోవడం, జీవాల ఉత్పత్తి సామర్థ్యం పెంచడం, పెరటి కోళ్ళ పెంపకానికి అనువైన పరిస్థితులను మరింత మెరుగుపరచుకోవడానికి తగిన ఏర్పాట్లు చేసుకోవడం అనే వాటికి ప్రాధాన్యత ఇచ్చారు.





### ❖ పశు జీవాల ఆరోగ్య సేవలను పటిష్ట పరచడం

సమస్యలు, పరిస్థితుల విశ్లేషణలో భాగంగా జీవాల పెంపకందార్లతో కలసి పశు జీవాల ఉత్పత్తి వ్యవస్థలను విశ్లేషించినప్పుడు వచ్చిన అంశాల ఆధారంగా, ఆయా పశు జీవాలకు టీకాలు, ఇతర ప్రాథమిక ఆరోగ్య సేవల అందుబాటు విషయంలో కీలక లోపాలను గుర్తించాలి.

ఆ సేవలను సమర్ధవంతమైన రీతిలో అందించేందుకు అవకాశాలను గుర్తించి, వాటిని కార్యక్రమంలో చేర్చాలి. ఆ క్రమంలో దగ్గరలో ఉన్న గ్రామీణ పశు వైద్య శాల పనితీరును పటిష్టపర్చడంతో పాటుగా, డిమాండ్ కు అనుగుణంగా ఆయా రకాల సేవలు అందించే 'గ్రామ స్థాయి కార్యకర్త'ల వ్యవస్థను పటిష్టవంతంగా అందుబాటులోకి తీసుకురావడానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

**టీకాలు:** స్థానిక పశు వైద్య శాల సిబ్బందితో కలిసి, క్లస్టర్ పరిధిలో పశు జీవాలకు సకాలంలో, నిర్దిష్ట వ్యవధుల్లో టీకాలు వేసే రీతిలో సీజనల్ టీకా క్యాలెండర్ రూపొందించి, అమలు చేయాలి. ఆ మేరకు టీకాలు పంచాయితీ స్థాయిలో లేదా 'క్లిక్' సెంటర్ వద్ద అందుబాటులో ఉండేలా చూడాలి. ఈ సేవల పంపిణీ తీరును, టీకాల క్యాలెండర్ అమలును పర్యవేక్షించడానికి అవసరమైన వ్యవస్థలను కూడా రూపొందించాలి.







**రోగాల నివారణ/నియంత్రణ:** పశుజీవాలకు వచ్చే వ్యాధులను ముందస్తుగానే గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టడానికి సాయపడే ఒక మొబైల్ అప్లికేషన్ ను కార్యక్రమంలో రూపొందిస్తారు. ఈ అప్లికేషన్ ను 'క్లిక్' సెంటర్లతో అనుసంధాన పరుస్తారు. దీనివల్ల ముందస్తు చర్యలు తీసుకొని రోగాలు వ్యాపించే తీవ్రతను తగ్గించవచ్చు.

**ఆరోగ్య కార్యకర్తలు:** క్లస్టర్ స్థాయిలో 3 పంచాయితీల పరిధిలోని పశు జీవాలకు ఆరోగ్య సేవలు అందించడానికి ఇద్దరు కార్యకర్తలను కార్యక్రమంలో నియమించుకోవచ్చు. రోగాల పర్యవేక్షణ, ప్రాథమిక సేవలు అందించడం వీళ్ళ బాధ్యత. స్థానిక పశు వైద్యాధికారి పర్యవేక్షణలో వీళ్ళు పని చేస్తారు. పశు జీవాలకు టీకాలు వేయడానికి గాను ప్రతి ఆవాస ప్రాంతానికి ఒక 'వ్యాక్సినేటర్' ను గుర్తించి, వాళ్లకు శిక్షణ ఇప్పించాలి.



పశుజీవాల ఆరోగ్య కార్యకర్తలు/వ్యాక్సినేటర్ల సేవలు తీసుకునే వాళ్ళు నిర్దిష్ట మొత్తంలో ఫీజులు చెల్లించవలసి ఉంటుంది. ఈ సేవల నమోదు, సేవలు అందించిన వివరాలు అన్నీ నమోదయ్యే రీతిలో 'క్లిక్' సెంటర్లలో తగిన ఏర్పాట్లు ఉంటాయి. ఈ ఫీజులతోనే కార్యకర్తల మనుగడ ఉంటుంది.



**కోళ్ళ కోసం:** పెంపుడు కోళ్ళకు అవసరమైన టీకాలు. ప్రాథమిక వైద్య సేవలు అందించడానికి ప్రతి ఆవాస ప్రాంతంలో ఒక మహిళను ఎంపిక చేసి, వాళ్లకు అవసరమైన శిక్షణ అందిస్తారు.

అవసరమైన చోట్ల జీవాలకు 'రాత్రి వసతి (నైట్ షెల్టర్)' కేంద్రాల ఏర్పాటుకు పశు జీవ ఉత్పత్తి వ్యవస్థల అభివృద్ధి ప్రణాళికలలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలి.

### ❖ సన్న జీవాలు, గొర్రెల ఉత్పత్తి వ్యవస్థల బలోపేతం

గ్రామ స్థాయిలో జరిగే పరిస్థితుల విశ్లేషణలో ఎన్ని కుటుంబాలు గొర్రెలు, మేకలను కలిగి ఉన్నాయనేది తెలుస్తుంది. వాటి ఉత్పత్తి వ్యవస్థల తీరుతెన్నులు, మేత వనరులు, సీజనల్ గా వచ్చే వ్యాధులు/రోగాలు, యాజమాన్య పద్దతులు వంటి వివరాలు తెలుస్తాయి. ఈ వివరాలకు అనుగుణంగా ఈ చిన్న జీవాల ఉత్పత్తి వ్యవస్థల మెరుగుదలకు తగిన అంశాలను పశు జీవ ప్రణాళికలలో చేర్చాలి.


ఈ జీవాలకు అవసరమైన ఆరోగ్య, వైద్య సేవలపై దృష్టి నిలపాలి. ప్రత్యేకించి ఒక చోటు నుంచి ఇంకో చోటకి తరలిస్తూ ఉండే గొర్రెల మందలకు కూడా సేవలు అందించే రీతిలో 'క్లిక్' సెంటర్ల వద్ద తగిన ఏర్పాట్లు ఉండాలి. ఈ కేంద్రాల వద్ద ఈ జీవాలకు అవసరమైన మందులు తగినన్ని ఎప్పుడూ అందుబాటులో ఉండాలి.




**నైట్ షెల్టర్లు:** ఈ జీవాల ఆరోగ్య భద్రత విషయంలో 'రాత్రి వసతి (నైట్ షెల్టర్)' కేంద్రాలు చాలామట్టుకు ఉపయోగపడతాయి. స్థానిక ప్రజలు, 'క్లిక్' కేంద్రాల సలహా కమీటీ సభ్యులు కలిసి ఈ రాత్రి వసతి కేంద్రాల నమూనాలను అభివృద్ధి చేయవచ్చు. దానికి అనుగుణంగా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆసరాగా ఈ రాత్రి వసతి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చు.

**స్థానిక జాతులకు ప్రాధాన్యం:** స్థానిక పరిస్థితులను తట్టుకుని నిలబడే జాతులకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ క్రమంలో స్థానిక జాతుల అభివృద్ధికి ప్రయత్నాలు చేయాలి. మెరుగైన బ్రీడింగ్ పద్దతులను పాటించడానికి రైతులకు అవసరమైన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. ఇలాంటి కార్యక్రమాల కోసం చేపట్టే 'మేలా'లకు కార్యక్రమం చేయూత ఇస్తుంది. గొర్రెలు, మేకల మందల వివరాలు అన్నీ కూడా 'క్లిక్' సెంటర్లలో నమోదయ్యేలా చూడాలి.

**మేత, తాగు నీరు:** ప్రతికూల పరిస్థితుల్లో ఈ జీవాలకు మేత, తాగు నీరు పరంగా చాలా ఇబ్బంది ఎదురవుతుంది. అది వాటి ఉత్పత్తి వ్యవస్థలపై ప్రభావం చూపుతుంది. అందుకని ఈ సమస్యల పరిష్కారానికి సంబంధిత ప్రణాళికలలో ప్రాధాన్యత ఇవ్వాలి. భూగర్భ నీటి ఆధారంగా అందుబాటులో ఉండే తాగునీటి వసతులు కల్పించాలి. చేతి పంపులు, బోరు పంపుల ద్వారా ఈ తాగునీటి తొట్టెలలో నీరు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు చేయాలి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సాయంతో ఇలాంటి కట్టడాలు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాలి. భూగర్భ నీటి ఆధారంగా వేసే పంపులకు పంచాయితీతో పాటు కార్యక్రమం నుంచి నిధులు అందుకోవచ్చు.






**అదనపు పోషకాహారం:** గర్భం దాల్చిన జీవం, పుట్టిన పిల్లల సంరక్షణకు తగిన ఏర్పాట్లు చేయడం ఒక కీలక అంశం. తల్లి జీవానికి 3 నెలల పాటు అదనపు పోషకాహారం ఇచ్చే వెసులుబాటు ఉంటుంది. ఈ అదనపు పోషకాహారం 'క్లిక్' సెంటర్ వద్ద ఉండే దుకాణంలో అందుబాటులో ఉంటుంది. సబ్సిడీ మీద దీనిని రైతులు పొందవచ్చు.

**మేత వనరుల అభివృద్ధి:** చిన్న, సన్న జీవాలు మేత మేసే ప్రాంతాలు, ఉమ్మడి భూముల్లో గడ్డి పెంపకం వంటి పనులకు ప్రణాళికలలో చోటు కల్పించాలి. స్థానిక గడ్డి జాతులకు ప్రాధాన్యమిస్తూ, అవి సహజ రీతిలో పెరిగేలా పనులు చేపట్టాలి. ప్రధాన పంట కోసిన తరువాత ఆ భూముల్లో స్వల్ప కాల వ్యవధి కలిగిన పప్పు ధాన్య పంటలు వేయడం వాళ్ళ కూడా జీవాలకు మేత అందుబాటులో ఉంటుంది.



ఆయా గడ్డి జాతులకు చెందిన విత్తనాలు 'క్లిక్' సెంటర్ల వద్ద అందుబాటులో ఉండేలా చూడాలి. అజోలా వంటి గడ్డి జాతి పెంపకానికి కూడా ప్రోత్సాహం అందించవచ్చు.

ప్రాజెక్టు మధ్య కాలానికి, అదనపు దాణాకి డిమాండ్ పెరిగితే, స్థానికంగా ఔత్సాహికులకు ప్రోత్సాహం ఇస్తూ, క్లస్టర్ స్థాయిలో పూర్తిస్థాయి ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేయవచ్చు.

**పరిజ్ఞానం, అవగాహన పెంపు:** కార్యక్రమంలో భాగంగా చిన్న జీవాల పెంపకందార్లను ఉమ్మడి ప్రయోజన బృందాలుగా చేసి, వాళ్లకు రైతు సంఘంలో సభ్యత్వం అందేలా చూడాలి. రైతుసంఘం స్థాయిలో వీరితో ఒక సబ్ కమీటీ లాంటిది ఏర్పాటు చేయవచ్చు. ఈ సబ్ కమీటీ సభ్యులు రుణాలతో సహా వాళ్ళకు అవసరమైన ఇతర సేవలను తోటి సభ్యులకు అందించడంపై దృష్టి నిలుపుతారు.

అనుభవజ్ఞులైన వారిని రిసోర్స్ పర్సన్ గా ఎంచుకుని తోటి సభ్యులకు సన్న జీవాల పెంపకానికి సంబంధించిన మెళకువలను అందించడానికి శిక్షణలు నిర్వహించాలి.


## ❖ పెరటి కోళ్ళ పెంపక వ్యవస్థను పటిష్టపరచడం

పెరటికోళ్ళ పెంపకం పేద కుటుంబాలకు ఒక పెద్ద ఆదరువు. కుటుంబ స్థాయిలో అదనపు పోషకాహారం అందించడంతో పాటు మహిళలకు కాసింత అదనపు ఆదాయం అందించే వ్యాపకం ఇది. ఈ కార్యక్రమంలో స్థానిక పరిస్థితులను తట్టుకుని బతికే స్థానిక జాతి కోళ్ళ పెంపకానికే ప్రాధాన్యత ఉంటుంది. చేపట్టిన ప్రతీ ఇంట్లో, తినగా పోను కనీసంగా 5000 నించి 8000 రూ. ఆదాయం వచ్చేటట్లు చూడటం దీని ఉద్దేశం.

పెరటికోళ్ళ పెంపకానికి సంబంధించి కార్యక్రమంలో రెండు ఉప అంశాలు ఉన్నాయి.


**పేద కుటుంబాలలో కోళ్ళ పెంపకం**

**క్లస్టర్ స్థాయిలో ఎంపిక చేసిన 100 పేద కుటుంబాలకు ఒక్కో కుటుంబం కనీసం 5 కోళ్ళు పెంచుకునేందుకు తోడ్పడాలి. దానితో ఆ కుటుంబం ఏడాదికి 7000 నుంచి 10000 రూపాయల అదనపు ఆదాయం అందుకునే అవకాశం ఉంది. వీటికి కావలిసిన షెల్టర్లు, వాక్సినేషన్ సదుపాయం, కోళ్ళు సంఖ్య తగ్గితే వెంటనే ధరకు (దేశి-కోళ్ళ ఫారం నించి) అందించే వ్యవస్థ ఏర్పాటు చేయాలి.**



**దేశీ జాతి కోళ్ళ ఫారం ఏర్పాటుకు ప్రోత్సాహం**

**ఔత్సాహిక వ్యాపారంగా దీనిని ప్రోత్సహిస్తారు. క్లస్టర్ స్థాయిలో ఎంపిక చేసిన పేద కుటుంబాలకు కోడి పిల్లలను నిరాటంకంగా ధరకు అంద చేయడం దీని ఉద్దేశం. ఇలాంటి ఫారం లలో షుమారుగ 50000రూ సంవత్సర ఆదాయం వస్తుందని అనుభవం చెప్తోంది.**



క్లస్టర్ స్థాయిలో ముందుగా ఒక పంచాయితీ పరిధిలోనే పెరటి కోళ్ళ పెంపకం కార్యక్రమాన్ని మొదలుపెట్టాలి. కోళ్ళు పెంచే ఆసక్తి, నిర్ధారిత డబ్బులు చెల్లించి సంబంధిత సేవలు పొందడానికి అంగీకారం, ఒక నిర్దిష్ట స్థాయిలో (10–12 యూనిట్ల వరకు) పెరటి కోళ్ళు పెంచే అనుభవం ఉండి, కోళ్ళ ఫారం ఏర్పాటుకి ఇంటికి దగ్గరలో కనీసం అర ఎకరం స్థలం ఉన్న రైతు అందుబాటులో ఉన్న గ్రామాన్ని ఎంచుకుని అక్కడ ఈ కార్యక్రమం మొదలుపెట్టాలి.



**నైట్ షెల్టర్లు:** కోళ్ళు పెంచుకుంటున్న కుటుంబాలలో వాటిని రాత్రి పూట కాపాడుకోవడానికి 'నైట్ షెల్టర్లు' (రాత్రి అవాసాలు) వంటి ఏర్పాట్లకు కూడా, నిర్దిష్ట షరతులకు లోబడి కార్యక్రమం ద్వారా తగిన సాయం అందించవచ్చు. అదే రీతిలో కోళ్ళ ఫారం ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలకు (ఫెన్సింగ్, ఫీడరర్లు, నీళ్ళు అందించే గిన్నెలు వంటి వాటికి) కూడా కార్యక్రమ సాయం కొంత అందుతుంది.

**కోళ్ళ నిధి:** కోళ్ళను పెంచే కుటుంబాలతో ఒక్క ఉమ్మడి ప్రయోజనాల బృందాన్ని (సి.ఐ.జి.) ఏర్పాటు చేయాలి. ఈ సభ్యులందరూ ఇంటికి 100 రూపాయల లెక్కన వాటా వేసుకుని, ఆ మొత్తాన్ని 'కోళ్ళ నిధి'గా జమ చేయాలి. కోళ్ళ పెంపకంలో అవసరమైన సేవలు అందుకునే నిమిత్తం, ఈ మొత్తాన్ని రైతు సంఘం వద్ద ముందస్తు సేవా చార్జీలుగా డిపాజిట్ చేయాలి. ఈ సేవల కోసం



కార్యక్రమంలో కేటాయించిన మొత్తం కూడా రైతు సంఘం ఖాతాలోనే ఉంటుంది. కోళ్ళ ఫారం ఏర్పాటు చేసే ఔత్సాహిక వ్యాపార రైతు కూడా తన వంతు సభ్యత్వ రుసుంగా 5000 రూపాయలు కోళ్ళ నిధిలో డిపాజిట్ చేయాలి. ఒకవేళ సి.ఐ.జి. గనుక ఈ వ్యాపార రైతును మారిస్తే, తను చెల్లించిన 5000 రూపాయలు వెనక్కి ఇవ్వాలి. ఈ కోళ్ళ నిధి "మొబైల్ టాప్-అప్" లాంటిది.



**టీకాలు, ఆరోగ్య సేవలు:** కోళ్ళకు అవసరమైన టీకాలు, ఇతర ఆరోగ్య సేవలు గ్రామంలోనే అందించే ఏర్పాట్లు చేయాలి. వీలయినంతవరకు ఊళ్ళోని మహిళల్లో ఒకరిని ఎంపిక చేసి, కోళ్ళకు టీకాలు, ఇతర ఆరోగ్య సేవలు అందించడంలో శిక్షణ ఇప్పించి, గ్రామంలో అందుబాటులో ఉంచాలి. ఇలా ఎంపిక చేసిన వాళ్లకు అవసరమైన మౌలిక పరికరాలు, మందులతో కూడిన 'ప్రథమ చికిత్స కిట్' లను అందిస్తారు. కోళ్ళు పెంచుకునే వాళ్ళు నిర్దిష్ట మొత్తంలో సేవా రుసుం చెల్లించి వీళ్ళ నుంచి అవసరమైన సేవలు పొందేలా చూడాలి.

కుటుంబాల పరంగా కోళ్ళకు సంబంధించిన వివరాలు నమోదుకు గాను ప్రతి కుటుంబానికి ఒక 'కలర్ కార్డు' ఇస్తారు. దాంట్లో ఎన్ని కోళ్ళు కొనుగోలు చేశారు, ఎన్ని తిన్నారు, ఎన్ని అమ్మారు, అమ్మకం ధర, చనిపోయిన కోళ్ళ వివరాలు వంటివి నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలు అన్నీ కూడా 'క్లిక్' కేంద్రాలలో ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలి

కోళ్ళు పెంచే కుటుంబాలు, ఫారం నడిపే వ్యక్తి తమ తమ వ్యాపార ప్రణాళికలు రూపొందించుకుని, అవి అమలయ్యేలా చూడాలి.

**'క్లిక్' కేంద్రాల వద్ద కోళ్ళు పెంచే కుటుంబాల జాబితా, టీకాలు, సేవల వివరాలు అన్నీ నమోదు చేయించాలి. అదొక డాటా బేస్ మాదిరిగా ఉంటుంది.**

**కోళ్ళకు టీకాలు, ఇతర ఆరోగ్య సేవల పరంగా అందించిన సేవలకు ఆరోగ్య కార్యకర్త కు 'క్లిక్' కేంద్రం ద్వారా చెల్లింపులు జరుగుతాయి.**

**కోళ్ళ నిధిలో సంబంధిత సభ్యుల వాటా నుంచి ఈ చెల్లింపులు జరుగుతాయి. ఈ చెల్లింపులు జరిపే క్రమంలో సభ్యుల వాటా 25 రూపాయలకు చేరినప్పుడు వాళ్ళకు తిరిగి డబ్బులు జమ చేయాలని కోరుతూ 'క్లిక్' కేంద్రం నుంచి ఎస్.ఎం.ఎస్. వెళుతుంది.**

## 3. సహజ వనరుల నిర్వహణ, యాజమాన్యం ద్వారా కరువు నుంచి భద్రత పొందడం

కరువు అంటేనే పంటకు, తాగునీటికి, పశు జీవాలకు, ఇతర అవసరాల కోసం నీటికి కటకట లాడే పరిస్థితి. దీనికి పరిష్కారంగా నీటి సంరక్షణ, బోరు బావుల రీఛార్జి వంటి కార్యక్రమాలు భూగర్భ జలాలను కొంత మాత్రం గా పెంచాయే కానీ, వాటి వాడకాన్ని నియంత్రించ లేక పోయాయి. ఎండిపోతున్న బోరు బావులు, కొత్త బోర్లలో పెట్టుబడి పెట్టి నష్టపోయిన రైతుల సంఖ్య పెరిగి పోతోంది. భూగర్భ జలాలు రోజు రోజుకీ అడుగంటి పోవడం సాధారణ మైంది.



ఉన్న నీటిని పంచుకోవటం, వర్షాధార పంటలను కాపాడుకోవటానికి వాడటం, వాటి ఉత్పదనా సామర్థ్యాన్ని పెంచటం, కొత్త బోర్లు వేయకుండా నియంత్రించటం పల్లె జీవం కార్యక్రమం లో ఒక ముఖ్య ఉద్దేశం.

ఈ మేరకు గ్రామ పంచాయితీ స్థాయిలో తగిన కట్టుబాట్లు, నియమాలు రూపొందించి, అమలు చేయడం అన్నది ఇందులో కీలకమైన అంశం. భూగర్భ జలాల పరిజ్ఞానాన్ని ప్రజల అవగాహన లోనికి తీసుకు వెళ్ళాలి.

### నీటి నిర్వహణ-యాజమాన్యం

గ్రామ పంచాయితీ ఆసరాగా ప్రజలు కలిసి తమ పంచాయితీ పరిధిలోని భూ గర్భ నీటి వనరుల అందుబాటు, వినియోగాన్ని అంచనా వేసుకోవడం, దానికి అనుగుణంగా ఈ నీటిని మరింత సమర్ధవంతంగా వాడుకునేలా తగిన కట్టుబాట్లు, నియమాలు రూపొందించుకుని అమలు చేయడం ఇక్కడ ప్రధాన అంశం.



వాటర్ షెడ్ స్థాయిలో నీటి రాకడ – పోకడ తెలిపే "నీటి బడ్జెట్" తయారు చేసుకోవటం, నీటి పరిస్థితి పై చర్చ ఈ ఉద్దేశం సాధించటానికి ఒక ముఖ్య సాధనం. ఇది గ్రామ పంచాయతీ ఆధ్వర్యం లో జరగాలి.

నీటి వనరుల విశ్లేషణలో క్లస్టర్ పరిధిలో డ్రైనేజి మ్యాపులు, అక్విఫైర్లు, బావులు, బోర్ల వివరాలు, ఆయా అవసరాలకు వినియోగిస్తున్న నీటి పరిమాణం, కాలానుగుణంగా అందులో వస్తున్న మార్పులు అన్నీ తెలుస్తాయి. ఈ వివరాల ఆధారంగా, ఊరిలో భూగర్భ జలాలు ఏ ప్రాంతం నించి ఏమేరకు రీచార్జీ అవుతాయన్నది తెలుస్తుంది. ఇలా భూగర్భ జలాల రీఛార్జి ప్రాంతం గుర్తించి అక్కడ మాత్రమే నీటి సంరక్షణ పనులను చేపట్టాలి.

### సూచక ('రిఫరెన్స్') బోరుబావులు గుర్తించటం


నీటి బడ్జెట్ తయారీ లో ముఖ్యమైన భాగం, భూగర్భ జలాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవి ఏ స్థాయి లో ఉన్నాయి అని అంచనా వేయటం ఒక ప్రక్రియ. దీని కోసం సూచక బోరుబావులను (షుమారుగా 250 ఎకరాలకు ఒకటిగా) సూచక బోరుబావులను గుర్తించాలి. వీటిలో ప్రతీ 15 రోజులకు ఒకసారి భూగర్భ జలాల స్థాయి ని కొలిచి నమోదు చేయాలి. వీటితో పాటు ప్రతీ పంచాయతీ లో ఒక వర్షపాతాన్ని కొలిచే "రెయిన్ గేజ్" ను ఏర్పరచాలి.

అందుబాటులో ఉన్న భూ గర్భ నీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, దానిని సమర్ధవంతంగా వినియోగించుకునే ఏర్పాటు గ్రామ పంచయతీ చేయాలి. ఉన్న నీటికి అనుగుణంగా పంటలు వేయడం, నీటికి ఎక్కువగా ఇబ్బంది ఉండే పరిస్థితులకు తగిన రీతిలో ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండడం కోసం ఈ పర్యవేక్షణ అవసరం. దీనికోసం క్లస్టర్ పరిధిలోని ప్రతి గ్రామ పంచాయితీ స్థాయిలో ఈ 'రిఫరెన్స్' బోరుబావులను గుర్తించాలి.

### నీటి నియంత్రణకు కొన్ని నియమాలు


- బోరుబావుల నమోదు, కొత్త బావులకు పరిమితులతో అనుమతులు
- నీరు ఎక్కువ వాడే పంటల విస్తీర్ణం తగ్గించడం
- బోర్ బావుల మధ్య దూరం నిర్ణయించడం
- బోర్ల నుంచి నీటి తోడకంపై పరిమితులు
- ట్రాన్స్ ఫార్మర్ల క్రమబద్దీకరణ
- పంటలకు రక్షక తడికి ఏర్పాట్లు
- నీళ్ళు పంచుకునే నియమాలు
- పశు జీవాల కోసం తాగునీటి సౌకర్యాల ఏర్పాటు
- కొత్త బోర్లపై నిషేధం
- ప్రతికూల పరిస్థితుల్లో బోర్ల నీటిని తోడడంపై నియంత్రణ
- నీటి వనరులకు మరమ్మతులు

**ఇలాంటివి ఇంకా.......**



**నీటి బడ్జెట్ కార్యాచరణ ప్రణాళిక:** దీనికోసం ముందుగా గ్రామ పంచాయితీ సభ్యులకు నీటి వనరుల పాలనకు సంబంధించిన అవగాహన సహాయక సంస్థ కల్పించాలి. గ్రామ స్థాయి లో పూర్తీ వివరాలు సేకరణ పూర్తీ అయ్యి, నీటి బడ్జెట్ తయారైన తర్వాత పంచాయితీ సర్పంచ్ గ్రామ స్థాయిలో ఒక మీటింగ్ నిర్వహించి ప్రజల చేత కార్యాచరణ ప్రణాళిక రూపొందేలా చూడాలి. అందుబాటులో ఉన్న భూగర్భ నీరు, దానిని వాడుతున్న తీరును ప్రజలకు వివరించి సప్లయ్– డిమాండ్ మధ్య ఉన్న వ్యత్యాసాలను ఎలా పూరించడం అనే అంశం ఆధారంగా నీటి బడ్జెట్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. ఇందులో పొందుపరిచిన కార్యాచరణ అంశాల అమలుకు గ్రామ పంచాయితీ అవసరమైన తీర్మానాలు చేయాలి.

నీరు ఎక్కువగా అవసరమయ్యే పంటల విస్తీర్ణం తగ్గించడం, నీటి వినియోగ నియంత్రణ కోసం రూపొందించిన 'వాల్టా'చట్టపు అంశాల అమలు వంటి విషయాలతో పాటు, వర్షాధార భూములకు కీలకమైన రక్షక తడి అందించే ఏర్పాట్లు, ఉమ్మడి నీటి వనరులలో నీటి వినియోగ ప్రాధాన్యతలు నిర్ణయించడం, భూ గర్భ నీటిని పంచుకునే ఏర్పాట్లు వంటివి ఈ కార్యాచరణ ప్రణాళికలో ఉండాలి.



ప్రతీ సంవత్సరం మే నెల మొదటి భాగం లో ఖరీఫ్ పంట కోసం, అక్టోబర్ / నవంబెర్ లో రబీ పంట కోసం అప్పటిదాకా పడిన వర్షం ఆధారంగా నీటి బడ్జెట్ తయారు చేసుకోవాలి. నీటి బడ్జెట్ ఆధారంగా ఆయా కాలాల్లో వేసే పంటలను నియంత్రించుకోవటం, ఉన్న నీటిని ఎలా వాడాలి అన్న నిర్ణయాలు చేయటం, వాటిని అమలు చేసే విధానాలు ఏర్పరచటం ముఖ్యం.

పంచాయితీ స్థాయిలో 'సహజ వనరుల యాజమాన్య (ఎన్.ఆర్.ఎం) సబ్ కమీటీ' ఏర్పాటయ్యేలా చూడాలి. ఈ కమీటీలో ఎవరెవరు సభ్యులు గా ఉంటారనేది కూడా పంచాయితీ నిర్ణయించేలా చూడాలి. ఎన్.ఆర్.ఎం. సబ్ కమీటీ సభ్యులకు అవసరమైన శిక్షణలు ఏర్పాటు చేసే బాధ్యత లీడ్ ఫెసిలిటేటింగ్ ఏజన్సీ పైన ఉంటుంది. పంచాయితీ స్థాయిలో నీటి సమర్ధ వినియోగానికి సంబంధించి అవసరమైన నియమ నిబంధనలను ఈ కమీటీ సభ్యులు రూపొందించాలి (పైన పట్టికలో ఒక జాబితా ఉంది). ఈ నిబంధనలకు పంచాయితీ/ గ్రామసభ ఆమోదం పొందాలి. నీటి వనరుల నిర్వహణ ప్రణాళికలలో భాగంగా వీటిని గ్రామ స్థాయిలో అమలు చేయాలి.

## నీటి పర్యవేక్షణలో కీలక అంశాలు

**వాతావరణ పర్యవేక్షణ:** అందుబాటులో అనువైన స్థలాలను గుర్తించి, వర్షపాతం, ఉష్ణోగ్రత వివరాల నమోదుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం. ఆ వివరాలు నిరంతరం నమోదయ్యేలా చూడటం

నీటివనరులలో నీటి లభ్యత పర్యవేక్షణ: పంచాయితీ పరిధిలోని నీటి వనరులలో నీటి లభ్యత తీరు వివరాలను నమోదు చేయడం


**పంట విత్తే సమాచారం నమోదు:** పంచాయితీ పరిధిలో ఆయా పంటలను విత్తే సమాచారం (ఏ పంట, ఏ రకం, ఎప్పుడు విత్తారు వంటి విషయాలు) 'క్లిక్' సెంటర్ల వద్ద ఎప్పటికప్పుడు పొందు పరచాలి. విత్తనాల పంపిణీ, రక్షక తడి, మార్కెట్ లింకేజి వంటి ఇతర ప్రక్రియలకు ఈ సమాచారం ఉపయోగపడుతుంది. మొబైల్ అప్లికేషన్ ద్వారా ఈ వివరాలను క్లిక్' సెంటర్ లో నమోదు చేయవచ్చు.

## నీటి సంరక్షణలో కీలక అంశాలు

నీటి సంరక్షణ పరంగా చెక్ డ్యాం వంటి పెద్ద పెద్ద నీటి నిలవ కట్టడాలకు కార్యక్రమంలో చోటు లేదు. ఇలాంటి వాటిని ఇతర ప్రభుత్వ పథకాల అనుసంధానంతో చేయవచ్చు.నీటి వనరుల ప్రణాళిక లో గుర్తించిన 'రీ చార్జీ' ఏరియాలకు అనుగుణంగా ఫారం పాండ్స్ వంటి అనువైన చిన్న చిన్న నిర్మాణాలకు ప్రాధాన్యతనివ్వాలి.

## ఫారం పాండ్స్

ఇవి భూగర్భ నీటి రీచార్జితో పాటుగా కీలక దశలో పంటకు రక్షక తడి ఇవ్వడానికి కూడా ఉపయోగపడతాయి. రీచార్జీ కోసం తవ్వే ఫారం పాండ్ కి లైనింగ్ అవసరం లేదు. కానీ వర్షాధార భూముల్లో రక్షక తడి అందించడానికి తవ్వే ఫారం పాండ్ కి మాత్రం తప్పనిసరిగా లైనింగ్ ఉండేట్లు చూడాలి. పంటకు ఒకటి లేదా రెండు రక్షక తడులు ఇవ్వాలంటే 200-250 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం ఉన్న ఫారం పాండ్ సరిపోతుంది.



వాటర్ షెడ్ పథకం, జాతీయ గ్రామీణ ఉ పాధి హామీ పథకం వంటి కార్యక్రమాల్లో ఈ ఫారం పాండ్స్ నమూనాలు ప్రామాణీకరించబడ్డాయి. వాటికి అనుగుణంగా, ఆ కార్యక్రమాల్లో భాగంగా ఫారం పాండ్స్ తవ్వుకునేలా చూడాలి.

**భూగర్భ జలాలపై ఎంత మేరకు అవగాహన వచ్చింది?**
**పంచాయితీ స్థాయిలో నీటి వివరాల సేకరణ ఎంత క్రమ బద్ధంగా జరుగుతోంది,**

**భూగర్భ జలాల వాడకం పై నిబంధనలు ఏ మేరకు ఏర్పడ్డాయి, అమలు అవుతున్నాయి అన్నవి ముఖ్య అంశాలు.**

## ఉమ్మడి భూముల పునరుజ్జీవం

గ్రామీణ జీవనోపాధులకు, పశు జీవాల ఆధారిత వర్షాధార వ్యవసాయానికి ఉమ్మడి భూములు బాగా ఉపయోగపడతాయి. ప్రతికూల పరిస్థితుల్లో పేద కుటుంబాలు బతకడానికి ఆధారంగా ఉండే కీలక వనరులు ఇవి.

గ్రామ స్థాయి పరిస్థితుల విశ్లేషణలో భాగంగా ఈ ఉమ్మడి వనరులు ఎక్కడెక్కడ ఉన్నాయి అన్నది మ్యాప్ లో గుర్తించాలి. వీటి ప్రస్తుత వినియోగం ఏమిటి, వీటిపై ఏయే కుటుంబాలు, ఏ విధంగా ఆధారపడుతున్నారు, వాటి ప్రస్తుత స్థితిగతులు ఏమిటి, కాలానుగుణంగా చోటు చేసుకుంటున్న మార్పులు ఏమిటి అనే వివరాలు తెలుసుకోవాలి.. ఈ వివరాల ఆధారంగా పంచాయితీ స్థాయిలో ఉమ్మడి భూముల పునరుజ్జీవ ప్రణాళిక రూపొందించాలి.

పంచాయితీ స్థాయిలోని 'సహజ వనరుల యాజమాన్య (ఎన్.ఆర్.ఎం.) సబ్ కమీటీ నేతృత్వంలో ఈ ప్రక్రియ జరగాలి. ఆయా ఆవాస స్థాయిలలో సబ్ కమీటీలు ఏర్పాటు చేయవచ్చు. ఆవాస స్థాయి సబ్ కమీటీకి సంబంధిత వార్డు సభ్యుడు నాయకత్వం వహించవచ్చు. ఆవాస స్థాయిలో ఉమ్మడి వనరుల అభివృద్ధి, పునరుజ్జీవం పరంగా ప్రణాళికలు చేస్తూ, వాటి ఆధారంగా పంచాయితీ స్థాయిలో ప్రణాళిక రూపొందించడం వల్ల ఆయా ఆవాస ప్రాంతాల మధ్య తలెత్తే వివాదాలు పరిష్కరించవచ్చు.

గుర్తించి, అభివృద్ధి కార్యక్రమం చేపట్టిన ఉమ్మడి భూములను మండల రెవిన్యూ అధికారి సహాయంతో వారి దగ్గర ఉన్న "ప్రోహిబిటరీ ఆర్డర్ పుస్తకం" లో నమోదు చేయించాలి. ఇలా చేయిస్తే అభివృద్ధి చేపట్టిన ప్రాంతాలను వేరే వారికి / వేరే ప్రయోజనాలకోసం ఇవ్వటాన్ని కొంతవరకు ఆప వచ్చు.

ఉమ్మడి భూముల పునరుజ్జీవ ప్రణాళిక రూపొందించే క్రమంలో వాటిపై ఆధారపడిన కుటుంబాల భాగస్వామ్యం తప్పనిసరి. అందరి మధ్య వీటిని కాపాడ టానికి కావలిసిన నిబంధనలు, కట్టుబాట్లు ఏర్పాటు చేసుకోవాలి. ఒకటి, రెండు సంవత్సరాలు కాపాడితే సహజం గానే గడ్డి, స్థానిక మొక్కలు పునరిజ్జీవిస్తాయి.



సహజ జీవ ప్రక్రియల ద్వారా పునరుజ్జీవం పొందే రీతిలో అవసరమైన చర్యలతో పాటుగా, విభిన్న రకాల మొక్కలు, చెట్ల పెంపకానికి వీలు కల్పించే అటవీకరణ పనులకు ప్రణాళికలో చోటు ఉండాలి. అనువైన ప్రదేశాలలో స్థానిక జాతి మొక్కలు, వృక్ష జాతుల అభివృద్ధికి అనువైన పనులు కూడా అందులో ఉండాలి.

చిన్న, సన్న జీవాల మేత వనరుల కోసం తగిన గడ్డి జాతులు, మొక్కల పెంపకంపై కూడా దృష్టి నిలపాలి. ఈ విషయంలో ఆ జీవాల పెంపకం దార్లు సూచించే గడ్డి, మొక్కల జాతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఒక అడుగు ఎత్తులో పెరిగే పచ్చదనం మొదలుకుని కొమ్మలతో కూడిన రకరకాల చెట్లు ఈ ఉమ్మడి భూముల్లో పెంచడానికి ప్రయత్నం చేయాలి. దానివల్ల ఫలసాయ వైవిధ్యతతో పాటుగా వాటిపై ఆధారపడిన కుటుంబాలకు, పశు జీవాలకు ఎన్నో రకాల ప్రయోజనాలు అందుతాయి.



## ప్రత్యేక ప్రాధాన్యతా ప్రణాళికలు

### 100 అతి నిరు పేద కుటుంబాలు, మహిళలపై ప్రత్యేక దృష్టి

పల్లె జీవం కార్యక్రమం లో అన్ని పనులలోనూ పేదల, మహిళల అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ చూపాలనేది ఒక రాజీ లేని సూత్రం. కార్యక్రమంలో అన్ని పనులలో, అన్ని సేవలలో వీరికి ప్రాధాన్యత నివ్వాలి.

గ్రామ స్థాయి పరిస్థితుల విశ్లేషణలో భాగంగా క్లస్టర్ లో ఉన్న 100 అతి నిరుపేద కుటుంబాలని గుర్తించి వారి స్థితిగతులను విశ్లేషించాలి. అలానే ఒంటరి మహిళలు, కుటుంబ బాధ్యతను మోస్తున్న మహిళా కుటుంబాలను గుర్తించాలి. ఈ కుటుంబాల వ్యవసాయంలో ఉన్న ప్రత్యేక సమస్యలను గుర్తించి, వాటిని అధిగమించటానికి కావలిసిన సహాయక వ్యవస్థలను ఏర్పరచాలి. వారి అభివృద్ధి కి కావలిసిన అభివృద్ధికి కావలిసిన వనరులని వివిధ కార్యక్రమాల నించి సమ కూర్చాలి.

కార్యక్రమం మొత్తంలో వీరి వెన్నంటే ఉండి వారి వ్యాపకాలకు, ఉన్న వనరుల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలి. సహాయక సంస్థ కార్యకర్తలలో ఒకరికి ఇలా గుర్తించిన కుటుంబాల అభివృద్ధి కోసం భాద్యుల్ని చేయాలి. జిల్లా స్థాయి లో కూడా ఈ బాధ్యత ఒకరికి అప్పచెప్పాలి.

ఈ బాధ్యత తీసుకున్న కార్యకర్త ప్రతీ సంవత్సరం, గుర్తించిన పేద, మహిళా కుటుంబాల కోసం ఏమి చేసారు, ఏమి సాధించారు అన్న విషయం లో ఒక ప్రత్యేక అనుబంధ రిపోర్ట్ తయారు చేయాలి. ఏమి సాధించారు అన్నది ఆ కార్యకర్త పనితీరుని నిర్ధారిస్తుంది. సహాయక సంస్థ జమ చేసే ప్రతీ ప్రణాళిక, రిపోర్ట్ ల లో ఈ కుటుంబాలకు ఏమి చేస్తారు / చేసారు అన్నది పొందు పరచాలి. ఈ విషయం లో ప్రత్యేక రివ్యూ జరగాలి.

వివిధ కారణాల వాళ్ళ అప్పుల్లో కూరుకు పోయి ఉన్న రైతుల కుటుంబాలమీద రైతు సంఘాలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. పెద్దలతో కూడిన ఒక కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పరిచి వీరి సమస్యలను విని పరిష్కార మార్గాలు చూపాలి. అవసరం మేరకు సంబంధిత అధికారుల సహాయం కూడా తీసుకోవచ్చు.

కష్టాలు, సమస్యలు లేని వ్యవసాయం అభివృద్ధి దిశగా కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్ళే నేతృత్వాన్ని రైతు ఉత్పత్తి దారుల సంఘాలు ఇవ్వాలి.

# సెషన్ -3

# పల్లెజీవం కార్యక్రమ అమలు వ్యవస్థలు

ఉద్దేశం: పల్లెజీవం కార్యక్రమంలోని వివిధ వ్యవస్థలు, సంస్థలు వాటి విధులు, భాధ్యతలు వివరించగలుగుతారు.

శిక్షణా పరికరాలు: చార్టులు, పోస్టరు

**విషయాంశములు::**

1) **పల్లెజీవం కార్యక్రమంలో వివిధ సంస్థలు, సంఘాలు**
2) **కార్యక్రమంలో నిధులు,**
3) **కార్యక్రమంలో అమలు భాధ్యతలు**

సమయం: 1 గంట

పద్ధతి: చార్టుల ప్రదర్శన, (లేదా జంబుల్ గేమ్)

వివరణ: కార్యక్రమం సంస్థాగత ఏర్పాట్లు సూచించే చార్టు, లేదా జంబుల్‌గేమ్. ఒక్కొక్క సంఘాన్ని, సంస్థను ఒక్కో కార్డుపై రాయాలి. అలాగే ఒక్కొక్క భాధ్యతను ఒక్కొక్క కార్డుపై రాయాలి. ఏ భాధ్యత ఏ సంస్థదో జత చేయాలి. ఒక్కో సంఘానికి, సంస్థకు ఉన్న సంబంధం చార్టు లేదా బోర్డుపై రాసి వివరించాలి.

# సంస్థాగత ఏర్పాట్లు

## 1. గ్రామ పంచాయితీ, క్లష్టరు స్థాయిలో

* కరువు ప్రభావం ఎక్కువ ఉన్న మండలాలు, పంచాయితీలను ఎంపిక చేసుకోవాలి.
* ప్రతి మండలంలో, మూడు పంచాయితీలను క్లష్టరుగా చేయాలి.
* ప్రతి క్లష్టరులో రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేయాలి. లేదా ఉన్న రైతు సహకార సంఘాన్ని ఈ కార్యక్రమం కోసం తగిన అర్హతలమేరకు ఎంపికచేసుకోవాలి.
* పై కనపరచిన పనులన్నీ సహాయక సంస్థ (FA)చేస్తుంది. ప్రతి మూడు క్లష్టర్లకు ఒక సహాయక సంస్థ ఉ ంటుంది. (LTA) (SPMU) (DPMU) (FA) (LFA)

## 2. లీడ్ సహాయక సంస్థ:

* ప్రతి 3-5 సహాయకసంస్థలకు వాటిలోనే ఉన్న ఒక సహాయకసంస్థ నేతృత్వం వహిస్తుంది. దీన్ని లీడ్ సహాయకసంస్థ (LFA)అంటారు.
* ఈ నేతృత్వసంస్థ, కార్యక్రమంలో ఉన్న సిబ్బంది, ఇతర ప్రతినిధులందరికీ కావలసిన అన్ని విషయాలమీద తగు శిక్షణలిచ్చి వారి సామర్థ్యాలను పెంపొందించే భాధ్యత వహిస్తుంది.

## 3. జిల్లా ప్రాజెక్టు నిర్వహణ విభాగం

* జిల్లాలోని వ్యవసాయ శాఖలో భాగమైన 'ఆత్మ' సంస్థలో భాగంగా పల్లెజీవం కార్యక్రమ నిర్వహణ విభాగం (DPMU) చేస్తుంది.
* కార్యక్రమంలోని అన్ని అంశాల నిర్వహణను ఈ విభాగం పర్యవేక్షిస్తుంది.
* ఇతర ప్రభుత్వశాఖలతో సమన్యయం, ఇతర కార్యక్రమాలతో అనుసంధానం నిధులు సమకూర్చటం ఈ విభాగం ప్రధాన భాద్యత.
* సహాయకసంస్థల పనితీరును ఈ విభాగం సమీక్షిస్తుంది.

## 4. లీడ్ సాంకేతిక సంస్థ (DPMU)

* రాష్ట్ర స్థాయిలో వాసన్ ఫౌండేషన్ సంస్థ పల్లెజీవం కార్యక్రమ విధి విధానాల రూపకల్పన, శిక్షణాకార్యక్రమాల రూపకల్పన, ఫలితాల విశ్లేషణలో సహాయం అందిస్తుంది.

## 5 రాష్ట్ర స్థాయి ప్రాజెక్టు నిర్వహణా విభాగం (DPMU)

* రాష్ట్రంలో కార్యక్రమం అమలౌతున్న 5 జిల్లాలకు, వ్యవసాయశాఖలో రాష్ట్ర స్థాయి ప్రాజెక్టు నిర్వహణా విభాగాన్ని గుంటూరులో ఏర్పరచారు.
* కార్యక్రమ పూర్తి నిర్వహణ ఈ విభాగానిదే. జిల్లా స్థాయి ప్రాజెక్టు నిర్వహణా విభాగం, లీడ్ సహాయసంస్థలను ఇది పర్యవేక్షిస్తుంది.
* కార్యక్రమానికి కావలసిన నిధులను ఋణంగా ఇచ్చిన 'అంతర్జాతీయ వ్యవసాయ అభివృద్ధి సంస్థ (IFAD)' తో అనుసంధానం, వ్యవసాయశాఖతో అనుసంధానం, ఇతరశాఖలతో సమన్వయంతో ఇది పనిచేస్తుంది.
* రాష్ట్ర వ్యవసాయశాఖ కమీషనర్ దీనికి ప్రాజెక్టు డైరెక్టరుగా ఉంటారు. దైనందిన వ్యవహారాలను ముఖ్య కార్యనిర్వహణాధికారి చూస్తారు.

## పల్లెజీవం కార్యక్రమ అమలు భాధ్యతలు

* క్లస్టర్ స్థాయిలో ఏర్పడిన రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం (క్లుప్తంగా 'రైతుసంఘం') ఈ కార్యక్రమంలో ముఖ్య అమలు భాధ్యత తీసుకొంటుంది. ఈ సంఘం సహాయక సంస్థ తోడ్పాటుతో పనిచేస్తుంది.
* రైతుసంఘం, సహాయకసంస్థ, జిల్లా 'ఆత్మ' సంస్థలు కార్యక్రమ అమలుకోసం రూ 100 ముఖవిలువ కలిగిన జుడిషియల్ స్టాంపు పేపరుపై అంగీకార పత్రం రాసుకొని, ఒప్పందం చేసుకోవాలి.
* ఈ అంగీకార పత్రం మీద సంతకం చేసే ముందే రైతుసంఘానికి తమదైన ఒక బ్యాంకుఖాతా ఉండాలి. దానిలో కనీసం 25 మంది పూర్తిస్థాయిలో వాటాధనం జమచేసి ఉండాలి.
* రైతుసంఘం, సహాయకసంస్థ కలిసి బ్యాంకులో ప్రాజెక్టుఖాతా తెరవాలి. ఈ ఖాతాలో సంఘంనుండి ఇద్దరు (అధ్యక్షులు కాకుండా), సహాయకసంస్థనుండి ఒక్కరు మొత్తం ముగ్గురు సంతకందార్లుగా ఉండాలి.

## రైతుసంఘం, సహాయకసంస్థల భాధ్యతలు

* సహాయకసంస్థ సహకారంతో రైతుసంఘం కార్యక్రమంలో సూచించిన వివిధ రకాల పనులు, జీవనోపాధులపై ఆధారపడినవారి భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందిస్తుంది.
* ఈ ప్రణాళికలను రైతుసంఘం తీర్మానంద్వారా ఆమోదించిన తర్వాతే సహాయకసంస్థ నిధులకోసం ధరఖాస్తు చేస్తుంది.
* మొదటి రెండు సంవత్సరాలదాకా వాతావరణ జీవనోపాధుల కేంద్రం ('క్లిక్') నిర్వహణ భాధ్యతను సహాయకసంస్థ తీసుకొంటుంది. తర్వాత ఈ కేంద్రాన్ని రైతుసంఘమే పూర్తిగా నిర్వహించాలి.
* కార్యక్రమానికి సంబంధించిన అమలు విషయాలు, నివేదికల తయారీ, జిల్లా నిర్వహణా విభాగానికి కావలసిన సమాచారాన్ని అందివ్వటం ... అంతా సహాయకసంస్థ భాధ్యతే....

## నిధుల విడుదల, నిర్వహణ

* పల్లెజీవం కార్యక్రమంలో సూచించిన నిర్ణీత పనులపై రైతుసంఘం భాగస్వామ్య ప్రణాళికలు తయారుచేయాలి. ఈ ప్రణాళికలను లీడ్ సహాయకసంస్థ ద్వారా జిల్లా నిర్వహణా విభాగానికి మంజూరునిమిత్తం పంపాలి.
* జిల్లా/రాష్ట్ర నిర్వహణా విభాగాల ఆమోదం తర్వాత, కావలసిన నిధులను జిల్లా కార్యక్రమ నిర్వహణ విభాగ (ఆత్మ) ఖాతాకు విడుదల చేస్తారు.
* రైతుసంఘం, సహాయకసంస్థ ఈ నిధుల నిర్వహణకు కావలసిన నియమాలు రూపొందించుకొంటాయి.
* ఈ నిధుల సక్రమ వినియోగం, వాటి జమాఖర్చుల వివరాలు పొందుపరచడం, నివేదికలు తయారుచేయడం.... మొదలైనవాటికి సహాయకసంస్థ పూర్తి భాధ్యత వహిస్తుంది.

* * *

# సెషన్ -4

## వాతావరణ జీవనోపాధుల కేంద్రం (క్లిక్ సెంటర్) ఆవశ్యకత

ఉద్దేశం: అభ్యాసకులు క్లిక్ సెంటర్ ఆవశ్యకతను వివరించగలుగుతారు. క్లిక్ సెంటరు అందించే వివిధ సేవలను వివరించగలుగుతారు.

విషయాంశాలు: రైతులకు గ్రామాలలో కావలసిన సేవలు, రైతు సంఘం ఆ సేవలను అందించే విధానం, మార్గం

సమయం: 1 గంట

పద్ధతులు: ఉపన్యాసం, ప్రశ్నలు

శిక్షణా పరికరాలు: చార్టు, బోర్డు, స్కెచ్‌పెన్నులు, చిత్రపటాలు

* ప్రశ్నలతో సెషన్‌ను ప్రారంభించాలి.
* చార్టులు, బొమ్మల సహాయంతో క్లిక్ సెంటరు ఆవశ్యకతను వివరించాలి.
* క్లక్ సెంటరులో ఎలాంటి సేవలు అందుతాయో వివరించాలి.

# గ్రామాల్లో రైతులకు అందుబాటులోకి రావలసిన సేవలు

1 సమాచార సేవలు: వాతావరణ సమాచారం, పురుగులు, తెగుళ్ల యాజమాన్యము, మార్కెట్ సమాచారం

2 వ్యవసాయానికి కావలసిన వస్తువులు: విద్యుత్ మోటారు, ఇతర పరికరాల విడిభాగాలు, వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, కషాయాలు, విత్తనాలు

3 సేవలు: వ్యాధినిరోధకటీకాలు, ఆరోగ్యసేవలు, వ్యవసాయ పరికరాలను అద్దెకు అందుబాటులోకి తేవటం, రక్షిత తడులు, మొదలైనవి.

4 వ్యాపార సేవలు: ముడిసరుకుల సరఫరా, వ్యవసాయ, అనుబంధరంగాల ఉత్పత్తుల కొనుగోలు, అమ్మకం

## సంస్థాగత సేవలు

ఈ కింది సేవలను సంస్థలు, కేంద్రాలు ఏర్పాటుచేయడం ద్వారానే అందివ్వాలి.

* మనవిత్తన కేంద్రాలు
* వ్యవసాయ పనిముట్ల అద్దె కేంద్రం
* పశువులు, కోళ్లలో వ్యాధినిరోధక టీకాలు వేయడం, పశు ఆరోగ్య సేవలు అందించే ఒక వ్యవస్థ
* మార్కెట్ సహాయం

## ఈ సేవలు రైతుసంఘం ఎలా అందిస్తుంది?

* ఇది వాతావరణ, జీవనోపాధుల కేంద్రం
* వ్యవసాయం, పశుపోషణ, కోళ్ల పెంపకం, ఇతర అనుబంధజీవనోపాధులు, సహజవనరుల యాజమాన్యం సంబంధించిన సమాచారాన్ని అందిస్తుంది.
* పైన పేర్కొన్న అన్ని సేవలు ఒకేచోట దొరికేలా చేస్తుంది
* ఇది నిరంతరం పనిచేస్తూ, రైతుసంఘం సభ్యులకు, ఇతరులకు అవసరమైనప్పుడల్లా కావలసిన అన్ని సేవలు (కొన్ని ఉచితం, కొన్ని రుసుము చెల్లించి పొందవచ్చు) అందిస్తుంది.
* ఇది రైతులు తమ అవసరాలు తీరేలా సేవలు పొందే ఒక వేదిక.
* ప్రారంభంలో కొన్ని సేవలతో మొదలుపెట్టి క్రమానుగుణంగా తమకు కావలసిన సేవలను విస్తృతపరుచుకోవచ్చు.
* ఇది రైతుసంఘం యాజమాన్యంలో నడుస్తుంది.

# క్లిక్ సెంటరు ఏర్పాటు, నిధులు, నిర్వహణ

* రైతుసంఘం, తమ సభ్యుల వాటాధనంనుండి కొంత పెట్టుబడిగా పెట్టాలి. కొంత పల్లెజీవం కార్యక్రమం నుండి గ్రాంటురూపంలో నిధులు అందుతాయి. ఈ సెంటరు నిర్వహణకు కావలసిన సిబ్బందిని రైతుసంఘమే నియమించుకోవాలి.
* దీని నిర్వహణకు ఒక రైతు విజ్ఞానసమితిని ఏర్పాటుచేయాలి.
  - అన్ని రంగాలలో అనుభవం, పరిజ్ఞానం ఉన్న వ్యక్తులను సభ్యులుగా ఎంపికచేసుకోవాలి. రైతులు, మహిళాకూలీలు, కోళ్ళపెంపకందార్లు, సన్నజీవాలపెంపకందార్లు, పాడిరైతులు, కొండగుట్టల ఫలసాయంపై ఆధారపడి బతికేవారు, మొదలైనవారు
  - అన్ని పంచాయితీలలోని, అన్ని ఆవాసాలనుండి ప్రాతినిధ్యం ఉండేలా సభ్యులను ఎంపికచేసుకోవాలి.
  - రైతు సంఘం నుండి ఇద్దరిని (అధ్యక్షులు కాకుండా) నామినేట్ చేయాలి.
  - క్లిక్ సెంటరు నిర్వహణకు ఈ రైతు విజ్ఞానసమితి దిశానిర్దేశం చేయాలి.
  - రైతుసంఘం ప్రతినిధులు, క్లిక్ సెంటరు నిర్వహణలో భాగంగా ఎదురైన సవాళ్ళు, అనుభవాలను
  - రైతుసంఘంలో చర్చకు వచ్చేలా చూడాలి. సంబంధిత అంశాలపై కార్యాచరణ ఉండేలా చూడాలి.
* ఈ క్లిక్ సెంటరును రైతుసంఘం సభ్యులందరికీ అందుబాటులో ఉండే చోట ఏర్పాటుచేయాలి. వీలైనంతగా మార్కెట్‌కు దగ్గరలో, రోడ్డుసదుపాయం, బస్సు సదుపాయం ఉన్న చోట ఉంటే మెరుగైన సేవలు అందించవచ్చు.
* అన్ని సదుపాయాలతో కూడిన ఒక భవనంలో ఏర్పాటు చేయాలి. ఈ భవనంలోనే ఈ కింది సేవలు అందుబాటులో ఉంటాయి.
  - కంప్యూటర్, ఇంటర్‌నెట్‌తో కూడిన సమాచార కేంద్రం,
  - మన విత్తన కేంద్రం
  - కషాయాల అమ్మకం కేంద్రం
  - వ్యవసాయపనిముట్ల అద్దె కేంద్రం
  - పశు వైద్యసేవలు అందించే కేంద్రం
  - వ్యవసాయ, వ్యవసాయ అనుబంధరంగాల ఉత్పత్తులు, వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, వాటి విడిభాగాల కొనుగోలు, అమ్మకం కేంద్రం
* ఏరైతు ఎలాంటి సమస్యతో వచ్చినా కావలసిన సేవలు, సమాచారం దొరకాలి. సేవలు, వస్తువులు దొరకాలి లేదా అవి ఎక్కడ దొరుకుతాయో తెలియాలి.
* ప్రతిరైతును సెల్‌ఫోన్ నెంబరు ద్వారా క్లిక్ సెంటరుకు అనుసంధానించి అన్ని రకాల సేవలు, సమాచారం అందించే ఏర్పాటు చేయడం రైతుసంఘం భవిష్యత్తు ప్రణాళికలలో ఒకటి.

* * *

# ఉత్తమ రైతు ఉత్పత్తిదారుల సంఘం

# ఉత్తమ రైతు ఉత్పత్తిదారుల సంఘం

ఉద్దేశం: సభ్యత్వము, ప్రయోజనకరమైన సేవలు, పాలకవర్గం, సిబ్బంది యొక్క జవాబుదారీ తనం, పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణ, సభ్యులకు అందించే సేవా రుసుంపై ఆధారపడటం వంటి లక్షణాలను ఉత్తమ రైతు ఉత్పత్తిదారుల సంఘం కలిగి వుండాలని పాలకవర్గ సభ్యులు తెలుసుకుని, తమ సంస్థలో వున్న లోపాలను గుర్తించగలరు.

పద్ధతి: రోల్ ప్లే/ చిన్నగ్రూపు చర్చ

సామాగ్రి: కరపత్రాలు, చార్టులు, మార్కర్లు

ఆశిస్తున్న ఫలితాలు:

ఉత్తమ సంఘం అంటే

అర్హత గల సభ్యులు సభ్యత్వం కలిగి, సభ్యులకు ప్రయోజనకరమైన సేవలను అందిస్తూ బాధ్యతగల సభ్యులు నిర్ణయించిన పద్ధతిలో పాలకవర్గం, సిబ్బంది, సభ్యులకు, జవాబుదారీగా పనిచేస్తూ, ఆర్థిక క్రమశిక్షణను కలిగి, సభ్యులకు అందించే సేవలపై ఆధారపడిన సంస్థ అని సభ్యులు అవగాహన కలిగి వుంటారు.

**ఉత్తమ రైతు ఉత్పత్తిదారుల సంఘం లక్షణాలు:**

పద్ధతి: సంవాదం (డిబేట్)/ చిన్న గ్రూపు చర్చ / రోల్ప్లే

సమయం: 2 గంటలు

విధానం:

సభ్యులను రెండు బృందాలుగా చేసి కింది ఆదర్శ, ప్రతిభగ్రామ సంఘాల వివరాల ప్రతులను సభ్యులకు శిక్షకులు అందించాలి.

శిక్షకులు సభ్యులకు కింది వివరణ ఇవ్వాలి.

"ఒక ప్రభుత్వ సంస్థ రైతు ఉత్పత్తిదారుల సంఘాలలో ఒకటిని ఉత్తమ సంస్థగా గుర్తించి దానికి పురస్కారం ఇవ్వటానికి ప్రకటన చేసింది. పురస్కారం పొందటానికి ఆ ప్రాంతంలో అన్ని సంఘాల పద్ధతులను, పరిస్థితులను పరిశీలించిన తరువాత, చివరికి రెండు సంఘాలు బాగా పనిచేస్తున్నట్లు సంస్థ వారు గమనించారు. ఆ రెండు గ్రామ సంఘాలలో ఒక దానిని ఉత్తమ సంస్థగా ఎంపిక చేయవలసి వుంది."

తరువాత శిక్షకులు ఆదర్శ, ప్రతిభ రైతు ఉత్పత్తిదారుల సంఘాల గురించి సభ్యులకు కింది విధంగా వివరించాలి. కరపత్రాలు పంచాలి.

**ఆదర్శ రైతు ఉత్పత్తిదారుల సంఘం**

మొత్తం సభ్యత్వం : 380 మంది సన్న, చిన్నకారు రైతులు, కుల వృత్తులవారు సభ్యత్వం పొందారు

పాలకవర్గం : ప్రోత్సాహక సంస్థచే ప్రతిపాదించబడిన వారు 12 మంది



సంఘం అందించే సేవలు : వ్యాపార సేవలు, పొదుపు సేవలు, సాంకేతిక సేవలు

లెక్కలను రాస్తున్నవారు : ప్రోత్సాహక సంస్థ సిబ్బంది

సంఘం సభ్యుల నుండి వసూలు

చెయ్యవలసిన వాటాధనం మొత్తం : రూ. 4,00,000/-

సభ్యుల నుండి వసూలైన వాటాధనం: రూ. 2,80,000/-

బ్యాంకు ఖాతాలో నగదు : రూ. 20,000/---------

సంఘం నిర్వహణా వ్యయం : ఆదాయంలో 45 శాతం

సభ్యుల వాటాధనంపై వడ్డీ : సంవత్సరానికి 15 శాతం

వార్షిక మిగులు : రూ. 15,000/-

లాభాల పంపిణీ ధరల స్థిరీకరణ : 20 శాతం

రాని బాకీ భర్తీ నిధి : 5 శాతం

భవన నిధి : 20 శాతం

సహకార విద్య నిధి : 20 శాతం

బోనస్ : 20 శాతం

సిబ్బంది సంక్షేమ నిధి : 15 శాతం

లెక్కల తనిఖీ (ఆడిట్) : ప్రతి సంవత్సరం జరుగుతుంది

వార్షిక మహాసభ : మొత్తం 380 మంది సభ్యులలో 50 మంది ఈ సంవత్సరం అర్హత కలిగిన సభ్యులుగా గుర్తించారు. 350 మంది అర్హతగల సభ్యులలో 280 మంది అర్హతగల సభ్యులు, 40 మంది అర్హతలేని సభ్యులతో కలిపి, మొత్తం 320 మంది సభ్యులు, వార్షిక మహాసభకు హాజరు కావటం జరిగింది. వార్షిక మహాసభలో లెక్కల తనిఖీ నివేదిక, వార్షిక లెక్కలను, పాలకవర్గం మహాసభకు సమర్పించడం జరిగింది.

నమోదు (రిజిస్ట్రేషన్) : కలిగి వుంది

**ప్రతిభ రైతు ఉత్పత్తిదారుల సంఘం**

మొత్తం సభ్యత్వం : 450 మంది సన్న, చిన్నకారు రైతులు, భూమిలేని వారు కులవృత్తుల వారు సభ్యత్వం పొందారు

పాలకవర్గం : మహాసభలో ఎన్నుకోబడిన వారు 12 మంది

సంఘం అందించే సేవలు : పొదుపులు, అప్పులు, వృద్ధాప్యం ఫించను, వ్యాపార అభివృద్ధి కార్యక్రమాలు, సాంకేతిక సేవలు

లెక్కలను రాస్తున్నవారు : సంఘం నియమించుకున్న గుమస్తా

సంఘం సభ్యుల నుండి వసూలు చెయ్యవలసిన వాటాధనం : రూ. 5,00,000/-

సభ్యుల నుండి వాటాధనం : రూ. 4,25,000/-

బ్యాంకు ఖాతాలో నగదు నిల్వ: రూ. 75,000/-

సంఘం నిర్వహణ వ్యయం : ఆదాయంలో 60 శాతం

సభ్యుల వాటాధనంపై వడ్డీ : సం॥రానికి నూటికి 15 శాతం

వార్షిక మిగులు : రూ. 40,000/-

లాభాల పంపిణీ :

రాని బాకీ నిధి : 5 శాతం

ఆస్తుల ఏర్పాటు నిధి : 25 శాతం

బోనసు : 25 శాతం

వృద్ధుల సంక్షేమ నిధి : 25 శాతం

గ్రామ అభివృద్ధి నిధి : 20 శాతం

లెక్కల తనిఖీ (ఆడిట్) : ప్రతి సంవత్సరం జరుగుతున్నది.

**వార్షిక మహాసభ** **:** మొత్తం 450 మంది సభ్యులలో 380 మంది ఈ సంవత్సరం అర్హత కలిగిన సభ్యులుగా గుర్తించారు. 380 మంది అర్హతగల సభ్యులలో 250 మంది అర్హతగల సభ్యులు, 100 మంది అర్హతలేని సభ్యులతో కలిపి మొత్తం 350 మంది సభ్యులు, వార్షిక మహాసభకు హాజరు కావటం జరిగింది. వార్షిక మహాసభలో తనిఖీ చేయని లెక్కలను పాలకవర్గం సమర్పించడం జరిగింది.

సమాఖ్యలో సభ్యత్వం : పొందినది

నమోదు (రిజిస్ట్రేషన్) : కలిగి వుంది

ఫెసిలిటేటరు పై సందర్భమును వివరించిన తరువాత సభ్యులను కింది ప్రశ్న వేయాలి.

**కీలక ప్రశ్న:**

1 సంస్థ తరుపున రెండు సంస్థలలో ఒక దానిని ఎంపికచేసే బాధ్యతను మీకు ఇస్తే ఏ గ్రామ సంఘాన్ని మీరు ఉత్తమ సంస్థగా ఎంపిక చేస్తారు? ఎందుకు?

తరువాత సభ్యులకు కింది సూచనలను శిక్షకులు ఇవ్వాలి.

**శిక్షకులకు సూచనలు:**

1. ఆదర్శ, ప్రతిభ సంఘాలపై కరపత్రాలను రెండు గ్రూపులకు అందించాలి
2. ఆదర్శ, ప్రతిభ గ్రామ సంఘాలలో ప్రతి గ్రూపునకు ఒక సంఘాన్ని కేటాయించాలి
3. కరపత్రంలోని ఆదర్శ, ప్రతిభ సంఘాల వివరాలను చిన్న గ్రూపులో పూర్తిగా అర్థం చేసుకోవాలి
4. ప్రతి గ్రూపు తమకే పురస్కారం ఎందుకు రావాలి? వేరే గ్రూపు వారికి ఎందుకు రాకూడదో వాదాన్ని వినిపించటానికి చిన్న గ్రూపులో చర్చించుకోవాలి
5. ప్రతి గ్రూపు నుండి గ్రూపు తరపున వాదనలను వినిపించటానికి ఇద్దరిని ఎంపిక చేసుకోవాలి
6. ఎదుటి గ్రూపుతో తమకు ఇచ్చిన సంఘమే ఉత్తమ సంఘమని, దానికి తగిన కారణాలను తెలుపుతూ తమ వాదం వినిపించాలి.

చివరగా వాద సంవాదంలో జరిగిన చర్చలను కలుపుకుంటూ శిక్షకులు కింది వివరణ ఇవ్వాలి.

**ఏది ఉత్తమ రైతు ఉత్పత్తిదారుల సంఘం?**

| వివరాలు | ఆదర్శ రైతు ఉత్పత్తిదారుల సంఘం | ప్రతి రైతు ఉత్పత్తిదారుల సంఘం |
|---|---|---|
| మొత్తం సభ్యత్వం | 95 శాతం సభ్యత్వాలను చేర్చుకోగలగారు | 90 శాతం సభ్యులను చేర్చుకోగలిగారు. అన్ని వర్గాల వారికి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. |
| పాలకవర్గం | ప్రోత్సాహక సంస్థ ప్రతిపాదించిన పాలకవర్గం ఉండటం వలన సభ్యులు నిర్ణయించిన పద్ధతిలో సభ్యులకు జవాబుదారిగా పనిచేసే అవకాశం తక్కువ. అంతేకాక సభ్యుల సమస్యల పట్ల ఆసక్తి కన్న, ప్రోత్సాహకం, సంస్థ ఆశయాలు, ఆలోచనలను అమలు జరిపే అవకాశం ఎక్కువ | సాధారణంగా ఎన్నిక కాబడిన వారు, ఎన్నుకున్న వారికి జవాబుదారిగా వుంటారు. సభ్యులు ఎన్నుకున్న పాలకవర్గం కనుక సభ్యులు నిర్ణయించిన పద్ధతిలో సభ్యులకు జవాబుదారిగా పనిచేస్తారు. పాలకవర్గ సభ్యులు సంస్థ పట్ల ఆసక్తి కలిగి నిర్ణయాలను తీసుకునే అవకాశం వుంది. |
| సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాలు | సభ్యుల ప్రయోజనాల కోసం కార్యక్రమాలు నిర్వహిస్తుంది. సభ్యులు, సంఘం మధ్య పరస్పరం సహాయం వుంది | సభ్యుల కోసం సంఘం అనేక ఆర్థిక, సామాజిక కార్యక్రమాలను చేపట్టవచ్చు. ఈ కార్యక్రమాల ద్వారా కొన్నిసార్లు లాభం లేదా నష్టం రావచ్చు. లాభం వస్తే ప్రతి సభ్యులు లావాదేవీల నిష్పత్తి ప్రకారం బోనసు పొందుతారు. కాని నష్టం వస్తే ఏ సభ్యులైతే ఆ కార్యక్రమాలు ఉపయోగించుకోవటం లేదో వారినుండి తాము నష్టం ఎందుకు భరించాలని వ్యతిరేకత వస్తుంది. కనుక సంఘం సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ప్రత్యేక నిధులు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. |
| లెక్కల నిర్వహణ | ప్రోత్సాహక సంస్థ సిబ్బంది కనుక వీరు పాలకవర్గానికి జవాబుదారిగా వుండేకన్నా, పాలకవర్గంపై అజమాయిషీ చేసే అవకాశం ఎక్కువ ఉంటుంది. అంతేకాక సంఘం ప్రోత్సాహక సంస్థపై ఆధారపడటం జరుగుతుంది | సంఘం స్వయంగా నియమించుకున్న గుమస్తా కనుక పాలకవర్గానికి జవాబుదారీగా ఉంటారు. సంఘం తన లెక్కలను తమ సిబ్బంది చేత రాయించు కోగలుగుతారు. |
| సభ్యుల నుండి వసూలు కావలసిన వాటాధనం | మొత్తం నిధిలో 30 శాతం | మొత్తం నిధిలో 15 శాతం |
| బ్యాంకు ఖాతాలో నగదు నిల్వ | సంఘం మొత్తం నిధిలో సుమారు 5 శాతం | సంఘం మొత్తం నిధిలో 15 శాతం |
| నిర్వహణా వ్యయం | ఆదాయం 45 శాతం | ఆదాయంలో 60 శాతం |
| లాభాల పంపిణీ | ఆర్థిక ఫలితాలు సభ్యులకే చెందే విధానంలో పంపిణీ చేసారు. లాభాలను సంఘం కార్యక్రమాల అభివృద్ధి ఉమ్మడి సేవలకు, | సభ్యులతో పాటు ఇతరులు కూడా సంఘం సహాయం పొందటం జరుగుతుంది. సభ్యుల లావాదేవీలతో వచ్చిన లాభాన్ని, తిరిగి |

| | | |
|---|---|---|
| | సభ్యులు సంఘంతో జరిపిన లావాదేవీల నిష్పత్తికి పంపిణీ చేయటం జరిగింది. | సభ్యులు పొందలేక పోవటంతో సభ్యులలో నిరుత్సాహం కలిగే అవకాశం ఎక్కువ. |
| వార్షిక మహాసభలో అర్హత గల సభ్యుల హాజరు, నివేదికల సమర్పణ | 1. అర్హత గల సభ్యుల శాతం = అర్హత గల సభ్యులు/మొత్తం సభ్యులు×100<br>2. మహాజనసభలో హాజరు శాతం= హాజరైన సభ్యులు/మొత్తం అర్హతగల సభ్యులు ×100<br>అర్హత గల సభ్యుల శాతం = 280/350×100=80 శాతం<br>3. తనిఖీ చేసిన లెక్కలు సమర్పించుటం వలన సభ్యులకు, ఖచ్చితమైన సమాచారం బోర్డు అందించటం జరిగింది. | 1. అర్హత గల సభ్యుల శాతం= అర్హత గల సభ్యులు/మొత్తం సభ్యత్వం×100<br>2. మహాజనసభలో = హాజరైన సభ్యులు/ మొత్తం సభ్యులు × 100<br>అర్హత గల సభ్యులు=250/380×100= 65 శాతం<br>3. తనిఖీ చెయ్యని లెక్కలు సమర్పించటం వలన సభ్యులకు, సరైన సమాచారం బోర్డు అందించలేదు. గ్రామ సంఘం కార్యక్రమాలకు పారదర్శకత లేదని తెలుస్తుంది. |

**సూచన:** పైన తెలిపిన అంశం అన్నింటిపై శిక్షకులు వివరణ ఇవ్వవలసిన అవసరం లేదు. డైరెక్టర్ల స్థాయి, సంవాదంలో చర్చించిన అంశాలను బట్టి, ఏ ఏయే అంశాలపై వివరణ ఇవ్వాలి శిక్షకులు నిర్ణయించుకోవాలి.

**ఫెసిలిటేటరుకు సూచన:**

సభ్యుల సంఖ్య, సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, సంఘం సభ్యులకు అందించిన సేవలను చూసి సభ్యులు ప్రతిభ గ్రామ సంఘాన్ని ఎంపిక చేసే అవకాశం వుంది. సభ్యులకు పై పట్టికలో సూచించిన విధంగా వివరించి, ఏవి నిజమైన పెద్ద మొత్తములు, వేటిలో సభ్యులకు లాభం వుంది శిక్షకులు వివరించాలి. సభ్యులతో, శిక్షకులు ఎట్టి పరిస్థితులలోను వాదనకు దిగరాదు.

ఆర్థిక, ఆర్థికేతర సంస్థలకు వుండాల్సిన అంశాలలో వాటాధనం వసూలు, స్వయంగా గుమస్తాను నియమించుకోవటం, బోనసు, రాని బాకీ మొదలైన అంశాలలో ప్రతిభ గ్రామ సంఘం బాగుంది శిక్షకులు వివరించాలి. అదేవిధంగా ఆదర్శ సంఘంలో కూడా ప్రోత్సాహక సంస్థ సిబ్బంది పుస్తకాలను రాయటం అనే లోపాలు వున్నాయని శిక్షకులు వివరించాలి.

ఈ అభ్యాసన నుండి ఉత్తమ సంఘాలు అనుకున్న వాటిలో కూడా పెంపొందించుకోవాల్సిన అంశాలు వుంటాయి. అదేవిధంగా వెనుకబడి వున్న సంఘంలో కూడా ఉత్తమ సంఘాల కన్న మంచి విధానాలు వుంటాయని సభ్యులు గమనించే విధంగా శిక్షకులు వివరణ ఇవ్వాలి. తరువాత శిక్షకులు సభ్యులను అడుగుతూ వారు ఇచ్చిన సమాధానాలు కలుపుకుంటూ ఉత్తమ సంఘం లక్షణాలను సభ్యులకు కింది విధంగా వివరించాలి.

**ఉత్తమ సంఘు లక్షణాలు:**

1. సభ్యత్వం:

ఆ ప్రాంతంలో వున్న అర్హతగల వారందరూ సభ్యత్వం పొందటం అన్నది సంఘంపై సభ్యుల విశ్వాసంను తెలుపుతుంది.

2. బాధ్యత, జవాబుదారీతనం ఉన్న నాయకత్వంను సంఘం కలిగి ఉండాలి.

**వివరణ:** సాధారణంగా ఎవరు ఎన్నుకుంటే వారికి ఎన్నుకోబడిన వారు జవాబుదారిగా ఉంటారు. మన సంఘంలో కూడా సభ్యులు నిర్ణయించిన పద్ధతిలో సభ్యులచే ఎన్నుకోబడిన వారు, సభ్యులకు జవాబుదారీగా పనిచేయాలి. అందుకు పాలకవర్గం (బోర్డు)ను సభ్యులు ఎన్నుకున్నట్లయితే వారు సభ్యులపట్ల ఆసక్తి కలిగి, సభ్యులకు జవాబుదారీగా వుంటారు. ప్రతి సంవత్సరం సంఘం లెక్కలను పాలకవర్గం తనిఖీ (ఆడిట్) చేయించాలి. పాలకవర్గం తనిఖీ చేసిన లెక్కలను,

కార్యక్రమాల వివరాలు, తనిఖీ నివేదికలను ముద్రించి మహాసభకు నివేదించాలి.

3. గ్రామ సంఘం అందించే సేవలు అందరూ సభ్యులు ప్రయోజనం పొందే విధంగా వుండాలి. సభ్యులను నష్టపరిచే విధంగా సంఘ కార్యక్రమాలు వుండకూడదు.

**వివరణ:** సభ్యుల కోసం గ్రామ సంఘం అనేక ఆర్థిక, సామాజిక కార్యక్రమాలను చేపట్టవచ్చు. ఈ కార్యక్రమాల వలన కొన్నిసార్లు లాభం లేదా నష్టం రావచ్చు.

సంఘానికి లాభం వస్తే సంఘంతో చేసిన లావాదేవీల నిష్పత్తి ప్రకారం లాభాన్ని బోనస్ రూపంలో సభ్యులు పొందుతారు. అదే సంఘానికి నష్టం వస్తే, ఏ సభ్యులైతే ఆ కార్యక్రమాలు ఉపయోగించుకోవడం లేదో వారినుండి తాము నష్టం ఎందుకు భరించాలని వ్యతిరేకత వస్తుంది. అందుకు సభ్యులందరి నుండి సమీకరించిన నిధులను ఏ కొద్దిమందికో ఉపయోగపడే కార్యక్రమానికి సంఘం పెట్టుబడి పెట్టకూడదు.

సంఘం అందించే సేవలకు పెట్టుబడి అవసరం. అయితే సంఘం సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టటానికి ప్రత్యేక నిధులు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

4. సిబ్బంది, ముఖ్య కార్యకర్త (కార్యదర్శి) సభ్యులై వుండాలి. సిబ్బంది నియామకం చేసి వారి జీతభత్యాలను పాలకవర్గం నిర్ణయించి చెల్లించాలి.

**వివరణ:** పాలకవర్గంచే నియమించబడిన సిబ్బంది, సభ్యులకు జవాబుదారిగా, సభ్యులు నిర్ణయించిన పద్ధతిలో పనిచేయాలి. సిబ్బంది పనిని పర్యవేక్షించడం, వారితో పని తీసుకోవడం, అవసరమైతే సిబ్బందిని ప్రశ్నించడం సంఘం చేయాలి. అందుకు సభ్యులనుండే సిబ్బందిని నియామకం చేస్తే మంచిది.

5. సంఘం నిధుల ఉపయోగంపై నియమాలను ఏర్పరచుకొని ఆర్థిక క్రమశిక్షణ కలిగి వుండాలి.

**వివరణ:** సంఘం తన నిధులను సక్రమంగా ఉపయోగించుకోనట్లయితే నిధులు నిరుపయోగంగా అయిపోయి ఆదాయం తగ్గిపోతుంది. నిధులు నిరుపయోగం కాకుండా ఉండటానికి ముందస్తు ప్రణాళిక చాలా ఉపయోగపడతాయి.

సంఘం ప్రణాళిక ప్రకారం సమీకరించిన నిధులు, వాటిని ఉపయోగించే విధానంపై నియమాలను రూపొందించుకోవాలి. దానివల్ల నిధుల నిర్వహణలో అవకతవకలు జరగవు. నిధులను సక్రమంగా ఉపయోగించినప్పుడే సంఘం సభ్యులకు ప్రయోజనం చేకూర్చగలుగుతుంది. అదేవిధంగా బాధ్యతగల సభ్యులకు చర్చల్లో పాల్గొనటానికి, నిర్ణయాలు చేయటానికి అర్హత ఉండేటట్లు చూసుకోవాలి. అందువల్ల సంఘ శ్రేయస్సును, సభ్యుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు చేయటం జరుగుతుంది.

**సంఘం రూపొందించుకోవాల్సిన ఆర్థిక నియమాలు:**

1. నిధుల సమీకరణ
2. నిధుల వినియోగం
3. నిధుల రక్షణ
4. బ్యాంకు ఖాతా నిర్వహణ
5. లెక్కల నిర్వహణ
6. ఆడిట్
7. మిగుల కేటాయింపు
8. లోటు నిర్వహణ

6. చురుకుగా, బాధ్యతాయుతంగా వ్యవహరించు సభ్యులు మాత్రమే సంఘంలో నిర్ణయాధికారం కలిగి నిర్ణయాలలో, ఓటింగులలో పాల్గొనాలి.

**వివరణ:** సభ్యుల శ్రేయస్సుకు, సంఘం శ్రేయస్సు కోసం మహాసభలో నిర్ణయాలు చేయాలి. కావున బాధ్యతగల సభ్యులకే చర్చలలో పాల్గొనటానికి, నిర్ణయాలు చేయటానికి అర్హత వుంటుంది.

సంఘ సేవలను సక్రమంగా వినియోగించుకుని సభ్యుల సమావేశపు చర్చలలో పాల్గొనుట వల్ల, మిగిలిన సభ్యులపై వారి ప్రభావం వుండవచ్చు. బాధ్యతారహితమైన చర్చలు, నిర్ణయాలు చేయటానికి అవకాశం వుంటుంది. అలాంటి వారు తాము చేసిన తప్పులను సమర్ధించుకునే ప్రయత్నం కూడా చేస్తారు. ఫలితంగా సంఘం నిలిచిపోయే ప్రమాదం వుంది. కావున అటువంటి సభ్యులకు మహాసభ సమావేశంలో హాజరైననూ నిర్ణయాలలో, ఓటింగులో పాల్గొనే హక్కు వుండకూడదు.

7. సంఘం మనుగడ సభ్యులకు అందించే సేవలపై ఆధారపడి ఉండాలి. సంఘం అందించే సేవల ప్రయోజనాలను గుర్తించి సేవలకు ప్రతి మూల్యం చెల్లించేటట్లు ఉండాలి.

**వివరణ:** సంఘం నిర్వహణ కోసం/ విరాళాలపై (గ్రాంట్లు) పూర్తిగా ఆధారపడితే సభ్యులకు, సేవలు అందించటం పట్ల సంఘానికి అంత ఆసక్తి ఉండకపోవచ్చు. కనుక సభ్యులు చెల్లించు సేవారుసుంపైనే సంఘం ఆధారపడాలి. అప్పుడే సంఘం, సభ్యులకు జవాబుదారీగా వుంటూ అవసరమైన సేవలను నాణ్యతతో అందించగలుగుతుంది.

చివరగా సభ్యుల అవగాహనను అంచనా వేయటానికి శిక్షకులు కింది వ్యాఖ్యలపై ఏది తప్పో, ఏది సరైనదో గుర్తించమని సభ్యులను అడగాలి.

1. సంఘం అర్హత కలిగిన సభ్యుల అందరినీ చేర్చుకోవాలి
2. సభ్యులు నిర్ణయించిన పద్ధతిలో సభ్యులకు జవాబుదారీగా పాలకవర్గం పనిచేయాలి
3. సంఘం ఏ కార్యక్రమమైనా చేపట్టవచ్చు
4. సంఘంలో ఎవరైనా సిబ్బంది వుండవచ్చు
5. సంఘం బ్యాంకు నిల్వలను ఎక్కువ కలిగి వుండాలి
6. సంఘంలో ఏ సభ్యులకైనా ఓటింగు, నిర్ణయాలలో పాల్గొనే హక్కు ఉంది
7. సంఘం మనుగడ సభ్యులు చెల్లించే మూల్యంపై రుసుములపై ఆధారపడి వుండాలి

* * *

# శిక్షణాంశము -3

**కరువు సంసిద్ధతా (పల్లె జీవం) పథకం అమలు - రైతు ఉత్పత్తిదారుల సంస్థ**

**ఉద్దేశాలు: ఈ శిక్షణా కార్యక్రమం ముగిసేసరికి పాల్గొన్న సభ్యులు (బోర్డు ఆఫ్ డైరెక్టర్స్)**

* ఎపిడిఎంపి ప్రాజెక్టు అమలు పరచటానికి ఎఫ్‌పిఓ - ఎపిడిఎంపి తయారు చేసుకున్న ఒప్పంద పత్రంలోని కీలక అంశాలు వివరిస్తారు.
* గ్రామస్థాయిలో ప్రాజెక్టు కార్యక్రమాలు అమలు పరచడంలో ఎఫ్‌పిఓ పాత్ర గురించి వివరిస్తారు.
* ఎపిడిఎంపి ప్రాజెక్టు కార్యక్రమాల ప్రగతిపై సమీక్షించుకుంటారు

**విషయాంశాలు:**

* ఎఫ్‌పిఓ-డిపిఎంయు/ఆత్మ (ఎటిఎంఎ)ల మధ్య అంగీకార పత్రం
* ఎపిడిఎంపి ప్రాజెక్టు అమలు చేసే ప్రక్రియలో ఎఫ్‌పిఓల ప్రాత
* ఎఫ్‌పిఓ - ఎపిడిఎంపి ప్రాజెక్టులోని కార్యక్రమాల అమలు వాటి ప్రగతిపై సమీక్ష చేయడం

**సమయం:** 4 గంటలు

**కావలసిన మెటీరియల్:** చార్టులు, మార్కర్లు, రోల్‌ప్లే, చిత్రపటాలు, ప్రగతి నివేదిక (పట్టిక) ఫ్లిఫ్ చార్టులు, (అనుబంధం -1ని చూడండి)

**అంశం: ఒప్పంద పత్రం ముఖ్యాంశాలు**

**ఉద్దేశం:** ఎఫ్‌పిఓ-ఎపిడిఎంపిల మధ్య చేసుకున్న ఒప్పంద పత్రం గురించి అవగాహన పెంపొందించుకుంటారు. అందులో కీలకాంశాలు గురించి చెబుతారు.

**పద్ధతి:** ఉపన్యాస పద్ధతి

**సమయం:** 1 గంట

ఎపిడిఎంపి ప్రాజెక్టు గురించి చర్చించుకుందామని శిక్షకులు సభ్యులకు సూచించాలి. సభ్యులను ఉద్దేశించి శిక్షకులు ఈ కింది ప్రశ్నలు అడగాలి.

1. ప్రాజెక్టు గురించి మీకు ఏమి తెలుసు?
2. ప్రాజెక్టులో ఏ ఏయే కార్యక్రమాలు ఉన్నాయి?
3. ప్రాజెక్టు అమలు విధానం ఏవిధంగా వుంది?

సభ్యులు చెప్పిన సమాధానాలు క్రోడీకరించి శిక్షకులు కింద తెలిపిన అంశాలను/ విషయాలను సభ్యులతో చర్చిస్తూ అంశాలను పంచుకోవాలి. ప్రాజెక్టు అమలుకు ఆత్మ ప్రాజెక్టు, సమన్వయ సంస్థ (స్వచ్ఛంద సంస్థ), రైతు ఉత్పత్తిదారుల సంస్థ కలిసి ఒక ఒప్పందం ఏర్పాటు చేసుకోవాలి. ఇప్పుడు ఒప్పందంలో వున్న ముఖ్య అంశాలను తెలుసుకుందాం అని శిక్షకులు కింది ఒప్పందం వివరించాలి.

## ఒప్పందం:

**మొదటి పార్టీ - ఆత్మ-ఎపిడిఎంపి ప్రాజెక్టు**

**రెండవ పార్టీ - రైతు ఉత్పత్తిదారుల సంస్థ**

**మూడవ పార్టీ - సమన్వయ సంస్థ (స్వచ్ఛంద సంస్థ)**

1. ఆత్మ–ఎపిడిఎంపి ప్రాజెక్టు అమలు కోసం రెండవ పార్టీ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసి మొదటి పార్టీకి సమర్పించడం
2. తయారు చేసిన ప్రణాళికల అమలు పరచడానికి ఎఫ్ఏ సహకారం తీసుకోవాలి. ప్రణాళిక తయారీలో కూడా ఎఫ్ఏ పాత్ర / సహకారం చాలా అవసరం.
3. ఆత్మ నుండి నిధులు స్వీకరించడానికి ఎఫ్ఏతో కలిసి ఎఫ్పిఓ ఉమ్మడి ఖాతాను తెరవాలి.
4. చెక్‌బుక్, బ్యాంకు పాసు పుస్తకం, ప్రాజెక్టు యొక్క అన్ని రికార్డులను సంరక్షకులుగా వుంటారు. బాధ్యతతో మెలగుతారు. ఆర్థిక పరమైన విషయాలన్నింటిని పారదర్శకంగా జవాబుదారీతనంగా ఉంటారు.
5. ప్రతి నెల ప్రాజెక్టు కార్యక్రమాల అమలు, ప్రగతిని రికార్డు చేయాలి. రికార్డు చేసిన ప్రగతిని నివేదికలు తయారు చేయాలి. తయారు చేసిన నివేదికలను ఎప్పటికప్పుడు మూడవ పార్టీ సహాయంతో ఆత్మ, లీడ్ ఫెసిలిటేటింగ్ ఏజెన్సీకి సమర్పించాలి.
6. ఆత్మ, ఎఫ్ఏ, లీడ్ ఫెసిలిటేటింగ్ ఏజెన్సీ వారు ఏర్పాటు చేయబోయే శిక్షణలు, విజ్ఞానయాత్రలు, సమావేశాలకు హాజరు అవ్వాలి.
7. సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలు, సమాచారాన్ని ఎఫ్పిఓ తన సభ్యులు అందరికీ తెలియ చేయాలి. తద్వారా ప్రాజెక్టు కార్యక్రమాలను వారి ఆదేశాలు/సలహాలు సూచనల ఆధారంగా క్షేత్రస్థాయిలో అమలు జరిగేటట్లు చూడాలి.

### అనుబంధం -1

**కావలసిన మెటీరియల్:**

1 కరపత్రాలు: (సెషన్ 1లో ఉపయోగించాల్సిన కరపత్రాలు)

2 ఎపిడిఎంపి ప్రాజెక్టు అమలు చేసే ఎఫ్పిఓలకు ఆత్మ/డివిఎంయుల మధ్య ఒడంబడిక/ ఒప్పందం పత్రం.

**చిత్ర పటాలు:**

ఎపిడిఎంపి ప్రాజెక్టు కార్యక్రమాల గురించిన 1. కరువు ప్రభావం దాని ఫలితం, 2. కరువు నివారణ కార్యక్రమాల చిత్రాలు ప్రతి కార్యక్రమం బొమ్మల రూపంలో ఉండాలి (ఫ్లిప్ చార్టులు) ఉదా:

1. భూమి అభివృద్ధి పనులు
2. మన విత్తన కేంద్రాలు
3. వ్యవసాయ పనిముట్ల అద్దె కేంద్రాలు

* * *

# అంశం -1: వ్యాపార సేవలు

**ఉద్దేశం:** ఈ తరగతిలో పాల్గొన్న సభ్యులందరు ఎఫ్‌పిఓ నుండి సభ్యులకు అందించగలిగే వ్యాపార సేవలు ఏమిటో గుర్తించగలరు.

**సమయం:** 75 ని.

**పద్ధతి:** ఉపన్యాసం

**కావలసిన మెటీరియల్: బోర్డు, మార్కర్లు, లేదా చార్టులు, మార్కర్లు**

**విధానం:**

శిక్షకులు సభ్యులను కింది ప్రశ్నలు అడిగి చర్చ ప్రారంభించాలి.

1 ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలలో ఎదురవుతున్న సమస్యలు ఏమిటి?

2 ఎరువులు క్రిమి సంహారక మందులు, విత్తనాలు కొనుగోలులో ఎలాంటి సమస్యలు ఎదురు అవుతున్నాయి?

సభ్యుల నుండి వచ్చిన సమాధానాలను బోర్డు పైన రాయాలి. బోర్డుపైన అమ్మకాల సమస్యలు ఒకవైపు, కొనుగోలు సమస్యలు మరొకవైపు రాసి కింది పట్టిక పోస్టరు ద్వారా వివరణ ఇవ్వాలి.

| అమ్మకాలలో ఎదురయ్యే సమస్యలు | కొనుగోలులో ఎదురయ్యే సమస్యలు |
|---|---|
| గిట్టుబాటు ధర లేకపోవడం | విత్తనం ధర ఎక్కువగా వుండటం |
| తూకాలలో మోసం | నాణ్యమైన విత్తన రకాలు అందుబాటులో లేకపోవడం |
| మధ్యవర్తులతో మోసం | కల్తీ, నాసిరకం విత్తనాలు |
| కమీషన్లు | నాణ్యతలేని పురుగు మందులు |
| గ్రేడింగ్ చేసే అనుభవం లేకపోవడం | సమయానికి అందుబాటులో లేని ఎరువులు |
| నిల్వ గోదాముల సదుపాయం లేకపోవడం | వ్యాపారస్తుల నుండి మోసాలు |
| మార్కెటింగ్ ప్రదేశాలు దూరంగా వుండటం | దుకాణాలు దూర ప్రాంతాలలో వుండటం |
| కోల్డు స్టోరేజీలు లేకపోవడం | వివిధ రకాల ఫౌండేషన్ విత్తనాలు అందకపోవడం |
| సరైన రవాణా సౌకర్యం లేకపోవడం | సమయానికి పెట్టుబడులు లేక వ్యాపారస్తులపై ఆధారపడి మోసపోవడం |
| ఇతర అంశాలు | ఇతర అంశాలు |

మన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవటానికి అందరం కలిసి ఎఫ్‌పిఓను ఏర్పాటు చేసుకున్నాం. కనుక మన ఎఫ్‌పిఓ కింది సేవలు అందించవచ్చును అని చెపుతూ శిక్షకులు కింది సేవలను వివరించాలి:

**వ్యాపార సేవలు:**

* ఎరువులు, జీవ ఎరువులు, క్రిమి సంహారక మందులు
* నాణ్యమైన విత్తనాలు సమయానికి అందించడం
* రోజువారీ వ్యవసాయ ఉత్పత్తి అమ్మకం ధరలను అందుబాటులో వుంచడం

* ఉత్పత్తి కొనుగోలుదారుల సమన్వయ సమాచారాలు అందుబాటులో వుంచడం
* ఖచ్చితమైన తూకాలు, తేమ శాతం చూడటంలో సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలను అందించడం
* పండిన ఉత్పత్తులను నిల్వ చేసుకునే గోదాములను, కోల్డు స్టోరేజీలు ఏర్పాటు చేయడం, వున్న వసతుల సంస్థలతో అనుసంధానం చేయడం
* ఉమ్మడి పంట ఉత్పత్తులను సేకరించి ప్రభుత్వంతో గిట్టుబాటు ధర వచ్చేలా చూడటం
* ప్రభుత్వ పథకాల నుండి వచ్చే సబ్సిడీలను సభ్యులకు అందేలా చూడటం

చివరగా శిక్షకులు కింది వివరణను ఇస్తూ ఎఫ్‌పిఓల సేవల ప్రాముఖ్యతను వివరించాలి. ప్రపంచస్థాయిలో, భారతదేశంలోని వివిధ రైతు సహకార సంస్థలకు అధ్యయనం చేసి చూసినచో రెండు విషయాలు మనం సునిశితంగా తెలుస్తున్నవి.

1 మొదటి అంశం ఏమనగా ప్రతి సంవత్సరం సుస్థిరమైన లాభాలను సభ్యులకు అందించగలిగిన రైతు సంస్థలు మాత్రమే సుదీర్ఘకాలం వరకు విజయాల బాటలో నడవగలుగుతున్నాయి.

2 రెండవ అంశం ఏమనగా రైతులే యజమానులుగా వ్యవహరిస్తూ, నిర్దిష్టమైన పాలన, వ్యాపారాల వ్యవహారాలను అవలంభించే రైతు సంఘాలు మాత్రమే అభివృద్ధి చెందుతున్నాయి. కనుక సభ్యుల లాభం, సభ్యుల యాజమాన్యంపై దృష్టిపెట్టి మన సంస్థను నడుపుకోవాలి.

3 చివరగా వ్యాపార సేవలను అందించటానికి ఎఫ్‌పిఓలకు వివిధ లైసెన్సులు అవసరం వుంటాయని సభ్యులకు చెప్పాలి. తరువాత సభ్యులను వారి ఎఫ్‌పిఓకు వున్న లైసెన్సుల గురించి అడగాలి. సభ్యుల నుండి సమాధానం వచ్చిన తరువాత కింది ప్రశ్నలు అడగాలి.

4 మీలో ఎవరికైనా డ్రైవింగ్ లైసెన్సు వున్నాదా? దానివలన ఉపయోగం ఏమిటి? లైసెన్సు లేకపోతే నష్ట ఏమిటి? శిక్షకులు లైసెన్సులు యొక్క ప్రాముఖ్యతను అర్థం అయ్యేలా తెలిపాలి?

**వ్యాపారం చేయడానికి వివిధ రకాల ప్రభుత్వ అనుమతులు కింది విధంగా వివరించాలి.**

* విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, గిడ్డంగులకు సంబంధించిన లైసెన్సులు పొందడానికి మండల వ్యవసాయ అధికారిని సంప్రదించి ఈ లైసెన్సులు పొందాలి.
* జిఎస్‌టి, జిఎస్‌టి కార్యాలయాల ద్వారా లేదా రిజిస్ట్రరు సిఎ ద్వారా పొందాలి.
* పాన్‌కార్డు

వివిధ లైసెన్సులు పొందడానికి కావలసిన అర్హతలు, విధి విధానాలు, రుసుములు సమాచారంను ఆయా కార్యాలయములలో కాని, వెబ్‌సైట్ నుండి కాని పొందవచ్చునని సభ్యులకు తెలియచేస్తూ శిక్షణను ముగించాలి.

**మూల్యాంకనం:**

1 సభ్యుల అవగాహనను అంచనా వేయటానికి కింది ప్రశ్నలను సభ్యులు అడగాలి.

2 ఎఫ్‌పిఓ సభ్యులకు అందించవలసిన సేవలను ఏవిధంగా గుర్తించాలి?

3 ఎఫ్‌పిఓ సేవలు వలన సాధించవలసినది ఏమిటి?

4 సేవలు అందించటానికి లైసెన్సులు అవసరమా? ఏ సేవలకు, ఏ లైసెన్సులు అవసరం?

* * *

# అంశం -2: ఎఫ్‌పిఓల పాత్ర

ఉద్దేశం: గ్రామస్థాయిలో ప్రాజెక్టు కార్యక్రమాలు అమలు పరచటంలో ఎఫ్‌పిఓల పాత్ర గురించి వివరిస్తారు

విషయం: ఎపిడిఎంపి ప్రాజెక్టు అమలులో ఎఫ్‌పిఓల పాత్ర

పద్ధతి: ఉపన్యాస పద్ధతి, ఐఎల్‌ఎం, బొమ్మలు, చార్టులు, మార్కర్లు

సమయం: 90 ని.

**పద్ధతి:**

శిక్షకులు సభ్యులతో చర్చను ప్రోత్సహిస్తూ ప్రాజెక్టు కార్యక్రమాల గురించి కింది తెలిపిన ప్రశ్నల ద్వారా చర్చించాలి.

**ప్రశ్నలు:**

* ప్రస్తుతం మీరు చేస్తున్న వ్యవసాయంలో ఎదుర్కొంటున్న సమస్యలు/ ఇబ్బందులు ఏమిటి? సభ్యులు చెప్పిన సమాధానాలను క్రోడీకరించి అందులో వచ్చిన అంశాలు/ విషయాలను ప్రాజెక్టు కార్యక్రమాలను అన్వయించి వివరించాలి
* కరువు ప్రభావం ఉపశమన చర్యల గురించి చిత్ర పటాలను ప్రదర్శించాలి. ప్రదర్శించిన చిత్రపటాలపై శిక్షకులు సభ్యులను చర్చ ద్వారా కొన్ని ప్రశ్నలు అడగాలి.

1. చిత్ర పటంలో బొమ్మలను చూచిన తరువాత మీకు ఏమి అర్థమైంది.
2. కరువు రావడానికి గలకారణాలు ఏమిటి?
3. ప్రస్తుతం కరువు నివారణకు గ్రామాలలో అవలంభిస్తున్న పద్ధతులు/మార్గాలు ఏమిటి?

శిక్షకులు సభ్యులు చెప్పిన సమాధానాలను క్రోడీకరించి కింది తెలిపిన ప్రాజెక్టు కార్యక్రమాల అమలు చేయడంలో ఎఫ్‌పిఓల పాత్ర గురించి సభ్యులతో కింది వివరాలు పంచుకోవాలి.

**ఎఫ్‌పిఓల పాత్ర:**

1 ఎఫ్‌పిఓ మూడు గ్రామ పంచాయితీల పరిధిలోని చిన్న సన్న కారు రైతులు, మహిళలు, భూమిలేని నిరుపేదలు, ఒంటరి స్త్రీలు, చిన్న, పెద్ద జీవాలతో జీవనోపాధిని కొనసాగిస్తున్న వారిని రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులుగా చేర్చుకోవాలి.

2 రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను సకాలంలో అందేటట్లు సమకూర్చాలి.

3 ఫెసిలిటేటింగ్ ఏజెన్సీ సహకారంతో సహజ వనరుల యాజమాన్యం (ఎస్‌ఆర్‌ఎం), బడ్జెట్ తయారు చేసి ప్రాజెక్టు అధికారులకు మంజూరు కోసం పంపించాలి.

4 క్లిక్, క్లస్టర్ హైరింగ్ సెంటర్ సేవలను నిర్వహిస్తూ రైతులకు మెరుగైన సేవలను అందించాలి.

5 భూగర్భ జల స్థితిగతుల వివరాలను రైతులకు తెలియజేయాలి. వాటి అభివృద్ధి కోసం ప్రణాళికలను తయారు చేసుకోవాలి.

6 గ్రామస్థాయిలో వున్న చిన్న, సన్న జీవాలకు టీకాల సేవలు, రోగాలకు మందులు, అదనపు దాణా, పోషక ఆహార సేవలు రైతులకు అందే విధంగా చూడాలి.

7 రక్షక తడులు అందించడానికి అవసరమైన యంత్రాలు, పరికరాలు సమకూర్చుకొని వర్షాభావ పరిస్థితులలో రక్షక తడులు అందేవిధంగా చూడాలి.

8 పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలి.

9 ఎఫ్‌పిఓ ద్వారా కరువు నివారణ చేపట్టే చర్యలలో భాగంగా ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలలో ఉన్న పథకాలను ఉపయోగించి రైతులకు ఉపయోగపడేటట్లు చూడాలి.

10 ఎఫ్‌పిఓ సభ్యులకు వ్యవసాయ ఉత్పత్తి పెంపొందించటంలో తగిన శాస్త్రీయ/సాంకేతిక పరమైన పరిజ్ఞానాన్ని పెంపొందించటంలో శిక్షణలు, క్షేత్ర సందర్శనలు ఏర్పాటు చేయాలి.

11 ఆఫీసు నిర్వహణ, సిబ్బంది ఎంపిక, సిబ్బందికి కావలసిన శిక్షణలు, వారి నుంచి సేవలు తీసుకోవడం

12 ప్రాజెక్టు కార్యక్రమాలు అమలు పరచటంలో సిఆర్‌పి, లీడ్ ఫార్మర్స్‌ను ఎంపిక చేసి వారి సేవలను ఉపయోగించుకోవాలి.

13 వార్షిక నివేదిక, ఆడిట్ తప్పనిసరిగా చేసుకోవాలి.

14 అభ్యాస క్షేత్రంలో చేపట్టిన ప్రయోగాత్మక కార్యక్రమాల ప్రగతిని క్లస్టర్ పరిధిలోని మిగతా రైతులతో పంచుకోవాలి.

15 రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించుట కోసం మార్కెట్ సదుపాయాలు కల్పించాలి

16 మార్కెట్ లింకేజీ కోసం ఇతర సంస్థలతో అనుసంధానం చేసుకోవాలి

ఆ తరువాత ఫెసిలిటేటరు ఎఫ్‌పిఓ, ఎఫ్ఎల బాధ్యతలపై చర్చిస్తూ ఏ బాధ్యతలు ఎవరివో చర్చిస్తూ సభ్యులకు అవగాహన కలిగించాలి. కింది తెలిపిన పట్టికలో తెలిపిన ప్రశ్నలను ఒక్కొక్క ప్రశ్నను ఒక్కొక్క ఫ్లాష్ కార్డులో రాసి వాటిని ఒక కుప్పలాగా పోయాలి. సభ్యులను ఒక కార్డు తీసుకుని ఆ అంశం/ బాధ్యత ఎవరిదో ప్రశ్నించండి. అలా చర్చను ప్రోత్సహిస్తూ అన్ని ఫ్లిప్‌కార్డులను ఎఫ్, ఎఫ్‌పిఓల వారీగా విడదీయాలి. అలా చేసిన తరువాత వారి వారి బాధ్యతలను చెప్పి చర్చ క్రోడీకరించి ముగించాలి.

**బాధ్యతలు**

| క్ర.సం. | బాధ్యతలు | ఎవరు బాధ్యత వహిస్తారు |
|---|---|---|
| 1 | సభ్యత్వం నమోదు | ఎఫ్‌పిఓ |
| 2 | మూలధనం చెల్లింపు/సేకరణ | ఎఫ్‌పిఓ |
| 3 | ఎన్ఆర్ఎం ప్రణాళిక తయారు చేయడం/రూపొందించడం | ఎఫ్ఎ |
| 4 | ఎన్ఆర్ఎం ప్రణాళికకు బడ్జెట్స్ తయారు చేయడం | ఎఫ్ఎ |
| 5 | ఎన్ఆర్ఎం ప్రణాళిక తయారీలో భాగంగా సాంకేతిక పరమైన సలహాలు | |
| | సూచనలతో ప్రోత్సహించడం | ఎఫ్ఎ |
| 6 | బ్యాంకు ఖాతాలను నిర్వహించడం | ఎఫ్‌పిఓ |
| 7 | వార్షిక ప్రణాళిక, ఆడిట్ తయారు చేయడం | ఎఫ్‌పిఓ |
| 8 | జిల్లా స్థాయిలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం | ఎల్ఎఫ్ఎ |
| 9 | ఎన్ఆర్ఎం ప్రణాళికను మంజూరు కోసం జిల్లాస్థాయి (ఆత్మ)<br>అధికారులకు సమర్పించడం | ఎఫ్‌పిఓ |
| 10 | మన విత్తన కేంద్రం కోసం లైసెన్సు మంజూరు చేయడం | మార్కెఫెడ్ |
| 11 | ఎఫ్‌పిఓ బ్యాంకు పుస్తకాలు ఎవరి దగ్గర వుంటాయి | ఎఫ్‌పిఓ |
| 12 | పంటలు ఎండిపోకుండా రక్షక తడులు ఎవరు ఏర్పాటు చేస్తారు | ఎఫ్‌పిఓ |
| 13 | వ్యవసాయ పనిముట్లు అద్దె కేంద్రంలోని పనిముట్లకు జవాబుదారీ ఎవరు? | ఎఫ్‌పిఓ |
| 14 | క్లిక్ సెంటర్‌లో కంప్యూటర్ పనిచేయకపోతే బాధ్యత ఎవరిది? | ఎఫ్ఎ |

**మూల్యాంకనం:**

ఫెసిలిటేటరు సభ్యులను కింది ప్రశ్నలు అడగాలి.

1. ఒప్పందం ఎవరి మధ్య జరుగుతుంది?
2. ఆత్మ ప్రాజెక్టు, స్వచ్ఛంద సంస్థ పాత్ర ఏమిటి?
3. రైతు ఉత్పత్తి దారుల సంస్థ పాత్ర ఏమిటి?

* * *

## అంశం -3: ప్రాజెక్టు కార్యక్రమాల అమలు, ప్రగతి సమీక్ష, ప్రణాళికల తయారీ

ఉద్దేశం: ఎపిడిఎంపి ప్రాజెక్టు కార్యక్రమాల ప్రగతిపై సమీక్ష ప్రణాళికల తయారీని తెలుసుకుంటారు

పద్ధతి: రోల్ ప్లే

సమయం: 90 ని.

**ఎపిడిఎంపి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సాధించిన ప్రగతిని సమీక్షించడానికి తగిన నమూనా పట్టికను శిక్షకులు ప్రదర్శించాలి.**

| క్ర.సం. | కార్యక్రమాలు | సాధించవలసిన ప్రగతి | సాధించిన ప్రగతి | ప్రగతిని సాధించలేక పోవడానికి కారణాలు | సాధించాల్సిన ప్రగతికి ఎవరు బాధ్యత |
|---|---|---|---|---|---|
| 1. | ఎన్ఆర్ఎం | | | | |
| 2 | మన విత్తనాలు | | | | |
| 3 | అద్దె కేంద్రాలు | | | | |
| 4 | పశు సంరక్షణ | | | | |
| 5 | | | | | |

పైన తెలిపిన పట్టికను రోల్ ప్లే ద్వారా సభ్యులతో ప్రతి అంశాన్ని చర్చిస్తూ ప్రగతి నివేదికను తయారు చేయాలి. ఆ తర్వాత చేయాల్సిన కార్యక్రమాలకు తగిన ప్రణాళిక తయారు చేయించాలి. ఆ ప్రణాళికను అమలు చేసే బాధ్యతను సంబంధించిన వ్యక్తులు ఎవరు గుర్తించమనాలి.

**సెషన్ ముల్యాంకనం:**

శిక్షకులు సభ్యులను కింది ప్రశ్నలు అడగాలి.

1. ఇప్పటివరకు మనం ఏమి మాట్లాడుకున్నాం?
2. ఏ ఏయే విషయాలు నేర్చుకున్నాము?

చివరగా శిక్షకులు కింద వివరణ ఇస్తూ చర్చను ముగించాలి.

సమావేశాలు ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్వహించాలి. గత సమావేశపు నిర్ణయాలపై సమీక్ష చేయాలి. కార్యాచరణ ప్రణాళికను తయారు చేయాలి.

ఎఫ్‌పిఓ సిబ్బంది పనితీరును, ప్రగతిని బోర్డు ఆఫ్ డైరెక్టర్లు సభ్యులు సమీక్ష చేయాలి. వారి సేవల సంస్థ పురోగతికి తోడ్పడేలా చూసుకోవాలి.

**ఎఫ్‌పిఓ సిబ్బంది:**

1 క్లిక్ సెంటర్ ఆపరేటరు

2 వ్యవసాయ పనిముట్లు అద్దె కేంద్రం నిర్వాహకుడు

3 అకౌంటెంట్

4 ఎఫ్‌పిఓ మేనేజరు

5 ఎఫ్‌పిఓ కోసం పనిచేసే కన్సల్టెంట్లు:

6 ఎఫ్ఎలె/ఎఫ్ఎస్ఎస్ నిర్వహించే లీడ్ ఫార్మర్లు

7 పారా వెట్

8 జీవాలకు వ్యాక్సినేషన్ వేసే సర్వీస్ ప్రొవైడర్స్

9 మన విత్తన కేంద్రాలలో పనిచేసే విత్తన మిత్రులు

10 శిక్షణలు ఇచ్చేవారు (సిఆర్‌పిలు)

* * *

# రైతు సహాయ సహకార సంఘం ఉపవిధులు, చట్టపరమైన బాధ్యతలు

## ఒక రోజు శిక్షణా కార్యక్రమం

**అభ్యాసకులు: రైతు ఉత్పత్తిదారులు సంస్థ పాలకవర్గం, పదాధికారులు**

**రూపకల్పన: వాసన్**

**సహకారం:** APMAS

# అంశం-1: కట్టుబాట్లు ఆవశ్యకత

**ఉద్దేశం:** అభ్యాసకులు కట్టుబాట్ల ఆవశ్యకతను వివరించగలుగుతారు

**సమయం:** 1.30 ని.

**పద్ధతి:** ఆట,

**(శిక్షణా కార్యక్రమంలో కూడా కొన్ని కట్టుబాట్లు పెట్టండి. కట్టుబాట్లు పెట్టకముందు, పెట్టిన తర్వాత కూడా హాలులో క్రమశిక్షణను గమనించి అర్థం చేయించండి.)**

**విధానం:**

★ రెండు గ్రూపులుగా చేసి బోర్డు దగ్గరకు వెళ్ళి వారి పేరు, ఊరు చెబుతూ సభ్యులచే చుక్కలు పెట్టకుండా ఏదైనా ఒక ఆకారం (తోచినట్టు) బోర్డుపై గీయమనాలి. మొదటి వ్యక్తి వదిలిన కొన నుంచి మరొక వ్యక్తి దాన్ని కలుపుతూ గీయాలి.

★ మరొక చార్డుపై ముగ్గులు పెట్టి ఒక ఆకారాన్ని గురించి ముందుగానే వారికి వివరణ ఇచ్చి ఒక మంచి ముగ్గు వచ్చేలా చుక్కలు పెట్టి దాన్ని సభ్యులను కలపమని చెప్పాలి. వచ్చిన ఆకారాలలో ఏది బాగుంది? ఎందుకు? అని ప్రశ్నించి....జవాబు రాబట్టాలి.

| చుక్కలు లేని ఆకారం | చుక్కలు ఉన్న ఆకారం |
|---|---|
| ★ ముందుగా ఏం గీయాలో అర్థం కాకపోవడం<br>★ మొదటి వ్యక్తి ఆలోచన రెండవ వ్యక్తికి తెలియకపోవడం<br>★ కొత్తగా వచ్చిన వారు తమ స్వంత తెలివి ఉపయోగించి ఆకారం వారికి అనుగుణంగా గీయడం<br>★ చివరికి ఏ ఆకారం రాకపోవడం | ★ ముందుగా తెలపటం<br>★ చుక్కలు ఉండటం<br>★ ఏ ఆకారంలో రావాలో ముందుగానే తెలుసుకోవడం కొత్త వ్యక్తి వచ్చినప్పటికీ, దాని ఆకారం చుక్కలను బట్టి పూర్తి రావడానికి ప్రయత్నించడం |

## ఫెసిలిటేటర్‌కు సూచనలు:

★ దీనిని బట్టి అర్థమైంది ఏమంటే ఒక లక్ష్యాన్ని చేరడానికి కొన్ని మార్గాలు, కొన్ని విధానాలు, పద్ధతులు ఏర్పాటు చేసి ఉండాలి. కొన్ని సందర్భాలలో పొరపాట్లు జరిగినప్పటికీ సరిచేసుకుని ముందుకు నడిచి పోవటానికి అవకాశం ఉంటుంది.

★ ముందుగా ఆడించిన ఆటను ఒకసారి గుర్తు చేస్తూ ముందుగా చుక్కలు పెట్టి ఆకారం గురించి అవగాహన ఉన్నందువల్ల గీయడం సులువైంది. కొన్నిసార్లు కొంతమంది బయటివ్యక్తులు అనగా సంఘంలో సభ్యత్వం లేని వారు జోక్యం చేసుకొన్నప్పుడుకానీ, సభ్యులే నియమాలు పాటించనప్పుడుకానీ ఎలా ఉంటుంది అంటూ ట్రాఫిక్ రూల్సు బొమ్మతో వివరించాలి.

★ **ట్రాఫిక్ రూల్సు లేనిచోట ఎలాఉంటుంది?, సిగ్నల్స్ ఉన్నచోట, ఒక క్రమపద్ధతిలో వాహనాలు వెళుతున్న చోట ఎలా ఉంటుందో బొమ్మల చార్టు ద్వారా పరిశీలించి వివరించాలి.....**

★ రెండు రకాల విధానాలను చూసినప్పుడు సభ్యులు గమనించిన అంశాలు రెండు భాగాలుగా రాయాలి.

| క్రమంగా వున్న చోట | అతిక్రమించిన చోట |
| --- | --- |
| * హెల్మెట్ పెట్టుకున్నారు | * హెల్మెట్ పెట్టుకోలేదు |
| * రోడ్డు క్లియర్/ బాగున్నాయి | * రోడ్లు బాగా లేవు |
| * ట్రాఫిక్ పోలీసు ఉన్నాడు | * ట్రాఫిక్ పోలీసు లేడు, వున్నా సక్రమంగా డ్యూటీ చేయడం లేదు |
| * పద్ధతి తప్పిన వారిని శిక్షించడం, జరిమానా వేయడం | * అడ్డంగా జనాలు, బండ్లకు ఎదురుగా వెళ్తున్నారు |
| * రోడ్లపై సిగ్నల్ సిస్టం వుంది | * సిగ్నల్ సిస్టం లేదు |
| * ఒక బండిపై ఒకరు లేదా ఇద్దరు ఉన్నారు | * ఇద్దరి కంటే ఎక్కువ మంది బండిపై వెళ్తున్నారు |
| * దారి పొడవునా భద్రతకు సంబంధించి సూత్రాలున్నాయి | * ఎలాంటి భద్రత లేదు |

* తరువాత ట్రాఫిక్ నిబంధనల గురించి శిక్షకులు వివరించాలి.
* ఒక నిమిషం ముందుగా వెళ్ళాలన్న ఆత్రంతో నిబంధనలను అతిక్రమించి ప్రాణాల మీదికి తెచ్చుకోవడంవల్ల, వారితోపాటు అవతలి వ్యక్తి కూడా నష్టపోతాడు.
* నిబంధనలు అనుసరించేటప్పుడు మొదట కొద్దిగా ఇబ్బంది అనిపించినప్పటికి శాశ్వతమైన లాభాలు ఉంటాయి. మరి మన సంస్థలో కూడా ఇలాంటి నిబంధనలు ఉన్నాయా? అంటూ రెండు సెషన్‌లోకి వారిని లింక్ చేయాలి.
* చట్టం అనేది దేశంలో, రాష్ట్రంలో, సంఘంలోని సభ్యులకు ఎలాంటి సమస్యలు రాకుండా, సంస్థలు అటు చట్టానికి ఇటు సభ్యులకు సకారిగా, పారదర్శకతను కలిగి ఉండేలా చూస్తుందని వివరించాలి.

**ఫెసిలిటేటర్: సెషన్ 2లోకి వెళ్ళేముందు తమ సంస్థలో కూడా ఇలా జరిగిన సంధర్భాలు ఉన్నాయా? మన సంస్థలో సమావేశాలతీరుగానీ, నియమనిబంధనలుగానీ ఎలాఉన్నాయో ఒకసారి మననం చేసుకోమని చెప్పండి.**

* * *

# సెషన్-2 : ఉప విధులలో ముఖ్యాంశాలు

**ఉద్దేశం:** శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు మాక్స్ చట్టంలోని ముఖ్యమైన విషయాలు అర్థం చేసుకుంటారు. వారి ఉపవిధులను అర్థం చేసుకుంటారు.

**విధానం:** రోల్‌ప్లే: కూరగాయల ఉత్పత్తి రైతులతో సంఘం విధానంపై పాల ఉత్పత్తిదారుల చర్చ

**సమయం:** 2 గంటలు

**పద్ధతి:** రోల్‌ప్లే

**కావాల్సిన సామాగ్రి:** బోర్డు, మార్కర్లు

**ఫెసిలిటేటరుకి సూచన:**

★ వచ్చిన సభ్యులతో 6మందిని శిక్షణ హాలు నుండి బయటకు తీసుకువెళ్ళాలి.

★ ఇద్దరిని ఎఫ్‌పిఓ ప్రారంభమై బాగా నడుస్తున్న సభ్యులుగా, మరొక ముగ్గురు లేదా నలుగురిని కొత్తగా ఎఫ్‌పిఓ ఏర్పాటుచేయాలనుకొంటున్న వ్యక్తులుగా విభజించి, వారితో ఈ కింది అంశాలను చేయించాలి.

★ మామూలుగా గ్రామంలో ఎలా పలకరింపుతో చర్చలు ప్రారంభిస్తారో అలానే మాట్లాడాలని సూచించండి.

★ శిక్షణలో ఇద్దరు ఫెసిలిటేటర్లు వున్నట్లయితే ఒకరు రోల్‌ప్లేలో భాగస్తులవ్వాలి.

★ రోల్‌ప్లేలో లేనివారు తాము గమనించిన అంశాలను తెలియ చేయాలని చెప్పాలి.

## రోల్‌ప్లే

హిందూపురం ప్రాంతానికి చెందిన పాల ఉత్పత్తిదారులు 25 మంది కలిసి ఒక వ్యాపారికి పాలు అమ్ముతారు. ఆ వ్యాపారి వీళ్ళు అమ్మిన పాలను వినియోగదారులకు లీటరుపై 20రూ. లాభంతో అమ్మేవాడు. ఇది గమనించిన పాల ఉత్పత్తిదారులు తామే ఒక కేంద్రాన్ని స్వంతంగా ఏర్పరచుకొని, ఉమ్మడిగా నడిపించుకోవాలని తీర్మానించుకొన్నారు. అందుకు కావల్సిన సమచారానికై ఏదైనా ఒక రైతుసంఘంను చూసి, విషయాలను తెలుసుకొందామని అనుకొన్నారు. ప్రక్కన ఉన్న లేపాక్షిలో కొంతమంది కూరగాయలు పండించే రైతులు ఒక సంఘాన్ని ఏర్పరచుకొన్నారని తెలుసుకొన్నారు. కూరగాయల ఉత్పత్తిదారుల సంఘమైన అన్నపూర్ణ ఎఫ్‌పిఓ పాలక వర్గాన్ని కలిసి విషయం వెళ్ళడించారు. అన్నపూర్ణసంస్థ అధ్యక్షులు నరసన్నకు, పాల ఉత్పత్తిదారులకు జరిగిన సంభాషణ ఇలా ఉంది.

**అన్నపూర్ణ సంస్థ:** మా గ్రామంలో 15 మంది, పక్క గ్రామంలో 25 మంది కూరగాయలు పండించే రైతులు అంతా కలిసి సంఘంఏర్పాటు చేసుకున్నాము. మా సంఘం సభ్యులు పండించిన కూరగాయలను మొత్తం బెంగుళూరు మార్కెటుకు పంపిస్తాము. దీనివల్ల మా సంఘానికి పేరు, ప్రఖ్యాతులు రావడంతోపాటు ఖర్చు తగ్గింది. వచ్చిన రాబడిలో కొంత అనగా 5 శాతం సంస్థలో ఉంచి, మిగిలినది ఒక్కోరైతు ఎన్ని కిలోలు వేసాడో ఆదామాషాలో అతనికి లాభం ఇస్తున్నాము. మొదట మేముకూడా ఇతరులలాగే దళారులపై ఆధారపడి నష్టపోయేవాళ్ళం. ఇప్పుడు మంచి లాభాలు వస్తున్నాయి, మిగులు ఉంది. మా సంస్థలో రైతులు, రైతు కూలీలు, మహిళా రైతులుకూడా సభ్యత్వం పొందారు

**పాల ఉత్పత్తిదారులు:** కూరగాయలు కావాలంటే వ్యాపారస్తులు ఎవరైనా మీకు ఫోన్ చేస్తారా? మీలో ఎవరికి చేస్తారు?

**అన్నపూర్ణ సంస్థ:** ఔను ఫోను చేస్తారు. మాలో ఎవరో ఒకరికి కాదు. మా సంస్థకు ఒక పేరు పెట్టుకున్నాం. మా సంస్థ చట్టం ప్రకారం రిజిస్టర్ అయ్యింది. మాక్స్ యాక్టు –1995 చట్టం కింద రిజిష్టరు చేసుకొన్నాం. మాకు ఒక ఆఫీసు కూడా ఉంది. మా సంస్థ 40 మందితో ప్రారంభమై ఇప్పుడు రెండు గ్రామాల నుండి 450 మంది సభ్యులు ఉన్నాము. కొంతమంది వ్యాపారులతో మాకు నిరంతర సంబంధాలు ఉన్నాయి. కొత్త వ్యాపారులు కూడా మా సంస్థ కార్యాలయానికి ఫోను చేసి వివరాలు చెప్తారు. మా మానేజరు ఆ విషయాలు ఎప్పటికప్పుడు మా అందరికి అందిస్తుంటారు.

**పాలఉత్పత్తిదారులు:** మీ మధ్య ఎప్పుడు కొట్లాటలు రాలేదా?

**అన్నపూర్ణ సంస్థ:** మొదట్లో వచ్చాయి కాని మేము మా సభ్యులందరం కలిసి కొన్ని విధులు, విధానాలు ఏర్పాటు చేసుకొని చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించి ఆ యొక్క విధులు అందరూ అవలంభించాల్సిందే. ఎవరైనా దానికి వ్యతిరేకంగా పని చేసినట్లు అయితే వారి సభ్యత్వం రద్దు అవుతుంది.

**పాల ఉత్పత్తిదారులు: ఆ విధుల్లో ఇంకేముంటాయి?**

**అన్నపూర్ణ సంస్థ:** మన సంస్థలో సభ్యులు ఎవరు ఉంటారు, ఎలాంటి సేవలు అందించాలి. సంస్థను నడిపించే పాలక వర్గం ఎవరు ఎన్నుకుంటారు, ఎలా, పదవీ కాలం ఎంత ఉండాలి, సభ్యులు కాని, పాలక వర్గం కాని తప్పిదాలు చేస్తే తీసుకోవాల్సిన చర్యలు చట్టానికి మనం సమర్పించే వివరాలు, రిపోర్టులు మొదలైన వుంటాయి. ప్రతి నెల సమావేశాలు పెట్టుకుంటాము.

**పాల ఉత్పత్తిదారులు:** సంస్థ లీడర్లు ఎవరు ఉంటారు, ఎప్పుడు ఎన్నుకుంటారు?

**అన్నపూర్ణ సంస్థ:** ప్రతి సంవత్సరం జూన్ నెలలో మేము వార్షిక సమావేశం పెట్టుకుంటాం. అప్పుడే లీడర్లు మార్పుగాని కొత్త లీడర్ల ఎన్నిక కాని జరుగుతుంది. సంస్థ లావాదేవీలకు సంబంధించిన లెక్కలు చెప్పడం, సంస్థ లాభనష్టాల వివరాలు చెప్పడం, ఏమైనా మార్పులు చేయాలనుకున్న, వచ్చే సంవత్సరానికి కొత్త ప్రణాళికలు వంటివి అక్కడే జరుగుతాయి.

ఎప్పటికప్పుడు లెక్కడు తెలపడం జరగడం వల్ల సభ్యుల్లో కూడా నమ్మకం పెరిగింది. ఈ సంవత్సరం ఇంకా 500 మంది రైతులు సభ్యత్వం తీసుకుంటామని అంటున్నట్లు తెలియ చేశారు.

**అన్నపూర్ణ సంస్థ:** మాక్స్ చట్టంలో నమోదు అయిన సంస్థలు కింది సూత్రాలకు అనుగుణంగా వుండాలి. ఆస్తులను ఏర్పాటు చేసుకోవచ్చు. కుదవ పెట్టవచ్చు, అమ్మవచ్చు, తరతరాలు పని చేయవచ్చు.

1. సంస్థ సేవలను వినియోగించుకుని, సభ్యత్వ బాధ్యతలను పాటించడానికి ఇష్టపడేవారు ఎవరైనా సభ్యత్వం పొందవచ్చు
2. ఒక సభ్యులకు ఒకటే ఓటు వుంటుంది
3. వాటా ధనంపై బ్యాంకులు వచ్చే వడ్డీకి సమానంగా లేదా తక్కువగా వడ్డీ ఇవ్వాలి
4. సభ్యులు ఎన్నుకున్న ప్రతినిధులు సభ్యులకు జవాబుదారీగా వుంటారు
5. సంస్థకు వచ్చిన లాభాలను వ్యాపార అభివృద్ధికి, సభ్యుల లావాదేవీలని నిష్పత్తితో బోనస్‌గా పంచాలి. ఉమ్మడి సేవలు ఏర్పాటు చేయాలి.
6. మన సంస్థలోని వారికి, సంస్థతో కలిసి పనిచేస్తున్న వారికి, అందరికీ సంస్థ గురించి తెలియచేయాలి
7. సభ్యుల అవసరాల కోసం ఇతర సంస్థలతో కలిసి వివిధ స్థాయిలలో పనిచేయవచ్చు.

తమ ఎఫ్‌పిఓకు సంబంధించిన ఉపవిధులు వుంటే వాటిని చదివించి అందరూ తెలుసుకునే విధంగా ప్రోత్సహించాలి.

**పాల ఉత్పత్తిదారులు:** చాలా బాగుంది. ఇలా చేసుకుంటే ఎవ్వరికీ సమస్య ఉండదు. ఎవరు ఎవరినీ నిందించాల్సిన పనిలేదు కాబట్టి మా రైతులతో మాట్లాడి, మేము కూడా రైతుసంఘంగా ఏర్పడే విషయం ఆలోచిస్తాము. అని చెప్పి వెళ్ళిపోయారు.

**పాల రైతులలలో ఒకరు:** రిజిస్ట్రేషన్ అయితే సంస్థకు ఏం లాభం?

**ఫెసిలిటేటరు:**

అనంతరం శిక్షకులు రోల్‌ప్లే చేసిన వారికి ధన్యవాదాలు తెలియచేసి, వారి స్థానంలో కూర్చోమని చెప్పాలి. ఇంతవరకూ జరిగిన రోల్‌ప్లేలో గమనించిన అంశాలు అడుగుతూ సభ్యుల నుండి వచ్చిన సమాధానాలను బోర్డుపై రాయాలి.

1 సంస్థ పేరు, సభ్యులు ఎవరు?
2 సంస్థ పరిధి ఎంత?
3 సంస్థను ఎవరు నడిపిస్తారు?
4 పాలకవర్గంలో ఎంత మంది వున్నారు?
5 లెక్కలు రాస్తున్నారా?
6 సమావేశాలు?
7 ఎవరికి ఓటు హక్కు వుంది?
8 మీ సంస్థ రిజిస్ట్రేషన్ జరిగింది ఏ చట్టంలో?

పై అంశాలు తమ ఎఫ్‌పివో లో ఏవిధంగా ఉన్నాయో అడిగి వివరాలు తెలుసుకోవడటానికి సభ్యులను ప్రోత్సహించాలి.

ఫెసిలిటేటరు: **రోల్ ప్లే చేసిన దానిలో కూరగాయల ఉత్పత్తిదారులు మాట్లాడిన చర్చను గుర్తుచేస్తూ మహాసభలో అవసరాన్ని బట్టి విధులను మార్చుకుంటాం అన్న అంశాన్ని సభ్యులకు గుర్తుచేస్తూ దీనికి సంబంధించిన కేస్‌స్టడీని వివరించండి.**

* * *

# సెషన్ -3 : ఉపవిధుల సవరణ

**ఉద్దేశం: సభ్యులు ఉప విధుల సవరణను గురించి తెలుసుకుంటారు.**

**సమయం: 90 నిమిషాలు**

**పద్ధతి: కేస్‌స్టడీ**

**కావల్సిన సామాగ్రి: తెల్లబోర్డు, మార్కర్లు, కేస్‌స్టడీ పేపర్లు**

**విధానం: గుడిబండ ఎఫ్‌పిఓ కేస్‌స్టడీ**

## గుడిబండ కేస్‌స్టడీ

గుడిబండ గ్రామానికి చెందిన అన్నదాత రైతు సహాయ సహకార సంఘం ఏర్పడి మూడు సంవత్సరాలు అయింది. మొదట 500 మంది రైతులతో ఉన్న సంస్థలో గుడిబండ గ్రామ రైతులే ఉండేవారు. తర్వాత జమ్మలబండ గ్రామ రైతులు సభ్యులు కూడా సభ్యులుగా చేరారు. ప్రస్తుతం గుడిబండ గ్రామంనుండి దాదాపు 600 మంది, జమ్మలబండ నుండి 850 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. కానీ, గుడిబండ రైతులే పాలకవర్గంలో ఉన్నారు. అందుకని జమ్మలబండ గ్రామస్తులను కూడా తమ సంస్థలో చేర్చుకుంటూ వారికి కార్యవర్గంలో చోటు ఉంటే బాగుంటుందని మహాసభ సమావేశంలో తీర్మానించుకున్నారు. సంస్థ పరిధి కూడా పెరిగినందువల్ల సభ్యులు చర్చించి, ప్రస్తుతం 7 మందితో ఉన్న పాలకవర్గ కమిటీని 9 మందిగా చేస్తూ, మహాసభలో తీర్మానం చేశారు. ఈ మార్పును రిజిస్ట్రారు అనుమతి పొంది, రిజిస్ట్రేషన్‌లో మార్పు చేయాలని కార్యదర్శి చెప్పగా మహాసభ ఆమోదం అయ్యాక ఎందుకు మళ్ళీ రిజిస్ట్రార్ అనుమతి అని ప్రశ్నించారు?

ఈ కేస్‌స్టడీ ద్వారా ఉప విధుల సవరణలో ఏయే వాటికి రిజిస్ట్రార్ అనుమతి ముఖ్యమో అభ్యాసకులకు వివరించాలి.

**ఉప విధుల సవరణలు:**

- ★ సంఘ సభ్యత్వం ఎక్కువగా ఉన్నప్పుడు సంఘం గురించి బాగా ఆలోచించగలిగిన సభ్యులతో ఒక సలహా కమిటీ ఏర్పాటుచేయాలి. ఈ సలహా కమిటీతో పాలక వర్గం చర్చించి పాలక సంఘ ఉపవిధుల సవరణలకు అవసరమైన ప్రతిపాదనలు పాలకవర్గం తయారు చేయాలి.
- ★ సాధారణంగా వార్షిక మహాసభ సమావేశానికి 7 రోజుల ముందు నోటీసు ఇవ్వవచ్చు అయితే ఉపవిధులలో మార్పులు అవసరమైనప్పుడు సభ్యులందరికీ తెలియచేయడానికి వీలుగా ఈ ప్రతిపాదిత సవరణతోపాటు మహాసభ సమావేశంలో నోటీసు సభ్యులకు 20 రోజుల ముందు అందచేయాలి (నమూనా నోటీసు జత పరచడమైంది). మహాసభ ఆమోదించిన సవరణలు రిజిస్ట్రారుకు 30 రోజులలోపు పంపించాలి అని చట్టం చెపుతుంది.
- ★ ఉప విధులలో మార్పును రిజిస్ట్రారుకు పంపినప్పటికి రిజిస్ట్రారు ఆమోదం కోసం వేచి చూడనవసరం లేని సవరణలు కొన్ని ఉన్నవి. అవి: సభ్యులు ఓటుహక్కు వినియోగానికి అర్హతలు, బోర్డు సమావేశాలు, పాలకవర్గ అర్హతలు, లీగల్ డాక్యుమెంట్స్ పై సంతకాలు చేసే అధికారం, పై స్థాయి సంస్థలలో ప్రతినిధుల ప్రతిపాదన, నిధుల వినియోగం, రక్షణ, సమీకరణ, ఆడిటర్ల నియామకానికి సంబంధించిన సమాచారం మొదలైనవి. ఈ సవరణలను ఆమోదించిన తేది నుండి 30 రోజులలోపు తీర్మాన ప్రతిని, మెజార్టీ సభ్యుల సంఖ్య హాజరైన సభ్యుల సంఖ్య తదితర వివరాలతోపాటు రిజిస్ట్రారుకు పంపాలి. రిజిస్ట్రారు ఈ విషయాలను రికార్డులో పొందుపరుస్తారు.

**అత్యవసరంగా రిజిస్ట్రారు ఆమోదం పొంది రిజిస్ట్రేషన్‌లో రిజిస్టర్ చేయబడే ప్రధాన అంశాలు, ఉపవిధుల సవరణలు**

**9వ సబ్ సెక్షన్‌లోని క్లాజ్**

1. సహకార సంఘం పేరు, చిరునామా
2. సభ్యుల ఉమ్మడి కీలక అవసరంగా దేన్ని స్పష్టంగా పేర్కొన్నారో, దేన్ని సాధించాలని సహకార సంఘం భావిస్తున్నదో ఆ లక్ష్యం
3. సభ్యుల హక్కులు
4. ఒప్పందంలో పేర్కొన్న విధంగా సంఘం అప్పుల విషయంలో సభ్యుల జవాబుదారీతనం ఏ మేరకు ఎలా ఉంటుంది.
5. ఉప విధులను రూపొందించే, సవరించే పద్ధతి
6. సర్వసభ్య సమావేశం జరిగే పద్ధతి, ఎన్నిసార్లు జరుగుతుంది, కావలసిన కోరం ఎంత అనే విషయాలు
7. ఎన్నికలు నిర్వహించే తీరు, అప్పటికప్పుడు ఏర్పడే ఖాళీలను భర్తీచేసే విధానం
8. డైరెక్టర్లు, బోర్డులో డైరెక్టర్ల సంఖ్య, ఆ బోర్డులో ఎవరెవరు వుంటారు అనే వివరాలు
9. డైరెక్టర్ల పదవీకాలం
10. డైరెక్టర్లను తొలగించే పద్ధతి
11. బోర్డు అధికారాలు బాధ్యతలు
12. సహకార సంఘం అప్పుల విషయంలో ఒప్పందం ప్రకారం పదాధికారులు, డైరెక్టర్లు ఏ విధంగా, ఏ మేరకు జవాబుదారులవుతారనేది
13. పై స్థాయిలోని సహకార సమాఖ్యలకు ప్రతినిధులను ఎంపిక చేసే విధానం
14. సహకార సంఘం ప్రయోజనాలకు భిన్నంగా ప్రవర్తిస్తే, బాధ్యతలను నెరవేర్చకపోతే సభ్యులకు, పదాధికారులకు, డైరెక్టర్లకు, సిబ్బందికి విధించే జరిమానాలు
15. సంఘం మూసివేసే విధానం

పైన పొందుపరచిన అంశాలకు సంబంధించిన ఉపవిధులను సవరించాలంటే ముందుగా సవరణ తీర్మానం చేయాలి. తీర్మానం చేసిన 30 రోజులలోగా ఆ సవరణల నమోదు కోసం దరఖాస్తును రిజిస్ట్రార్‌కు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపాలి. రిజిస్ట్రార్‌కు పంపే ప్రతి దరఖాస్తు పైన ప్రతిపాదించిన తేది, చైర్‌పర్సన్ సంతకం, సవరణ ఆమోదించిన తీర్మానం ప్రతిని దానికి జత చేయాలి. సవరణకి సమావేశానికి హాజరైన సభ్యుల సంఖ్య, తీర్మానానికి ఓటువేసిన సభ్యుల సంఖ్య, ఓటు అర్హత కలిగిన వారి సంఖ్య జత చేయాలి.

ఆ సవరణలు చట్టమునకు భిన్నంగా ఉన్న ఎడల మన సంస్థపై రిజిస్ట్రారు చర్యలు తీసుకునే అవకాశం వుంది.

**ఉపవిధుల సవరణల అమలు:**

1 ప్రతిపాదించిన సవరణ, చట్టం నిబంధనలకు అనుగుణంగా ఉంటే, రిజిస్ట్రార్‌కు దరఖాస్తు అందిన 60 రోజులలోగా ఆ సవరణను రికార్డులలో నమోదు చేస్తారు.

2 సవరణ నమోదు చేసిన 15 రోజులలోగా సవరణ ప్రతిని తన సంతకం, అధికార ముద్ర కలిగిన ధృవీకరణ పత్రాన్ని రిజిస్టర్ పోస్టు ద్వారా ఆ సహకార సంఘానికి పంపుతారు.

3 రిజిస్టర్ అయినట్లుగా రిజిస్ట్రారు ఇచ్చే ధృవీకరణ ప్రతియే అంతిమ సాక్ష్యం.

4 ప్రతిపాదించిన సవరణ నిబంధనలకు అనుగుణంగా లేకపోతే సవరణ కోసం పంపిన ప్రతిని రిజిస్ట్రారు 60 రోజులలోగా తిరస్కరించవలసి ఉంటుంది. కాని సహకార సంఘం అభిప్రాయం తెలుసుకోకుండా, అవకాశం ఇవ్వకుండా సవరణ తిరస్కరించే ఎలాంటి ఉత్తర్వు జారీ చేయడానికి వీలులేదు.

5 తిరస్కరించిన ప్రతిని 15 రోజులలోగా సంఘానికి రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపాలి.

6 దరఖాస్తు పంపిన 75రోజులలోగా సబ్ సెక్షన్ (7)ప్రకారం తిరస్కరణ ప్రతి అందకపోతే గడువు చివరిరోజు అనగా 75వ రోజు రిజిస్టర్ అయినట్లు భావిస్తాం.

**మూల్యాంకనం:**

చివరగా శిక్షకులు కింది ప్రశ్నలు వేసి సభ్యుల ఉపవిధుల గురించి అభ్యాసకులు ఎంత అర్థం చేసుకున్నారో, ఏయే అంశాలను అర్థంచేసుకొన్నారో అంచనా వేయాలి.

1. ఉపవిధులు ఒకసారి తయారు చేస్తే సవరణ చేయటానికి వీలు లేదు
2. ఉప విధుల సవరణకు మహాసభ సమావేశం ఏర్పాటుచేస్తే సరిపోతుంది
3. కొన్ని ఉపవిధుల సవరణకు, వాటిని రిజిస్ట్రారుకు పంపవలసిన అవసరం లేదు
4. ఉప విధుల సవరణ ప్రతిని రిజిస్ట్రారుకు పంపి అన్ని సవరణలకు ఆమోద ముద్ర పొందేవరకు ఎదురు చూడాలి

## ఉపవిధుల సవరణలకు నమూనా నోటీసు:

**గౌరవనీయులైన సభ్యులకు,**

**నమస్కారములు,**

అన్నపూర్ణ రైతు సహాయ సహకార సంఘం, హిందూపురం యొక్క ప్రత్యేక మహాసభ జిల్లా పరిషత్ స్కూలు ఆవరణలో 17.7.2018 నాడు ఉదయం 10 గంటలకు జరుగును కావున సభ్యులందరు హాజరు కాగలరని కోరుతున్నాం. చర్చనీయాంశము నిబంధనావళికి సవరణ చేయుట.

### నిబంధన - 21 కార్యనిర్వహక కమిటీ మార్పు

| ప్రస్తుత నిబంధన | ప్రతిపాదిత సవరణ |
|---|---|
| 21.1 రైతు సహాయ సహకార సంఘం తన మహాసభ సమావేశంలో ప్రతి సంవత్సరం 1/5వ వంతు మంది కార్యనిర్వాహక కమిటీ సభ్యులను ఓటు చేయడానికి అర్హత గల సభ్య సంఘాల ప్రతినిధుల నుండి మూడు సంవత్సరాల పదవీకాలానికి ఎన్నుకుంటారు. | 21.1 సమాఖ్య తన మహాసభ సమావేశాల్లో ప్రతి సంవత్సరం 1/3వ కార్యనిర్వాహక కమిటీ సభ్యులను ఖాళీ అయిన సంఘాల నుండి మూడు సంవత్సరాల పదవీ కాలానికి ఎన్నుకుంటారు. |

**మార్పుకి కారణాలు:** సంఘ పరిపాలన అవసరాలరీత్యా, నాయకత్వంను పెంపొందించటానికి, కార్యనిర్వాహక కమిటీలో అన్ని సంఘాల ప్రాతినిధ్యం కొనసాగడానికి కార్యనిర్వాహక కమిటీ సభ్యుల అనుమతి.

శారద
కార్యదర్శి.

తేదీ: 7.7.2018
స్థలం:

* * *

# సెషన్-4: పాలకవర్గ సభ్యుల చట్ట పరమైన బాధ్యతలు

**ఉద్దేశం:** ఎఫ్‌పిఓ సభ్యులకు, పాలకవర్గ సభ్యులకు "సహాయ సహకార చట్టం" ద్వారా ఉన్న చట్టపరమైన బాధ్యతలు. వాటి ఆవశ్యకత, విధులు, బాధ్యతలు తెలుసుకుంటారు.

**పద్ధతి:** కేస్‌స్టడీ

**సమయం:** 1.30 ని.

**కావల్సిన వస్తువులు:** తెల్ల బోర్డు, మార్కర్లు

## కేస్‌స్టడీ

గత 4 సంవత్సరాల క్రితం ఏర్పాటైన ఒక రైతు సహాయ సహకార సంస్థ మాక్స్ చట్టంలో రిజిస్టర్ చేయబడింది. అవసరమైన సేవలు అనగా రుణ సదుపాయం, వ్యాపారం, ధాన్యం, విత్తనాలు అందిస్తుంది. సభ్యులు కూడా సంస్థ సేవలను పొందుతున్నారు. సంస్థని వారు చట్ట ప్రకారం, ప్రతి సంవత్సరం సంస్థలో నిర్వహిస్తున్న కార్యక్రమాల నివేదికను, ఆడిట్ నివేదికను, సభ్యుల వివరాలు, తీసుకుంటున్న నిర్ణయాలు, సవరణలు గురించి కొత్తగా ఎన్నుకోబడిన పాలకవర్గ సభ్యుల వివరాలు, వార్షిక నివేదిక. గత 4 సంవత్సరాలుగా రిటర్న్స్ ద్వారా దాఖలు చేయలేదు. కాబట్టి సంస్థ నడవడం లేదని భావిస్తున్నాము దీనికి వారం రోజులలో వివరణ ఇవ్వాలని లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాము అని రిజిస్టరు నోటీసు జారీ చేయడం జరిగింది.

**ఫెసిలిటేటరుకి సూచనలు:**

1 సభ్యులు చట్టానికి రిటర్న్స్ దాఖలు చేయకపోవటం వలన నోటీసు వస్తుందని తెలియజేయాలి.

2 రిటర్నులు దాఖలు చేయకపోవటం వలన చట్టం ఏమి భావిస్తుందో సభ్యులను అడగాలి. సభ్యులకు కింది వివరణ ఇవ్వాలి.

"సంస్థ సభ్యుల ప్రయోజనము కోసం, శ్రేయస్సు కోసం పని చేయాలి. అదేవిధంగా సరిగా పనిచేస్తున్నదని నిరూపించుకోవడానికిగానీ, చట్టం ప్రకారం ఉన్న తన గుర్తింపును కొనసాగించడానికి రిటర్న్‌లు దాఖలు చేయాలి. లేకపోతే సంస్థ సభ్యులు ప్రభుత్వాన్ని కూడా మోసం చేస్తున్నారని భావిస్తుంది. అందుకే చట్టానికి లోబడి సంస్థ ఎప్పటికప్పుడు చట్టపరమైన బాధ్యతలు చేయాలి.

**సహకార సంఘం నిర్దిష్టంగా అనుసరించాల్సిన బాధ్యతలు:**

- ప్రతి సంవత్సరం మార్చినెల ముగిసిన తరువాత లెక్కలను సంస్థ ఆడిటింగ్ చేయించి, వాటి నివేదికలు తయారు చేయాలి
- సంస్థ పాలకవర్గంలో ఏర్పడిన ఖాళీలను పూరించుటకు ఎన్నికలు జరపాలి
- సంస్థ మహాసభను నిర్వహించాలి. ఆడిట్ నివేదిక, వార్షిక ప్రణాళికలు, వార్షిక నివేదికలను చర్చించాలి
- రిటర్నులు సంవత్సర కాలంలో జరిగిన కార్యక్రమాలు, లావాదేవీలు రిజిస్ట్రారుకు సమర్పించాలి
- సంస్థ వ్యాపారాలకు సంబంధించి తగిన లైసెన్స్ తీసుకోవాలి.
- సంస్థ చెల్లించాల్సిన పన్నులు సకాలంలో చెల్లించాలి
- మహాసభ నియమించిన ఆడిటర్ చేత వార్షిక సంవత్సరం ముగిసిన వెంటనే లెక్కలు తనిఖీ ఆనగా ఆడిట్ చేయించాలి.

అడిట్ చేయబడిన ఆర్థిక పట్టికలు, ఆడిట్ నివేదికలను ఒక్కొక్క అంశాన్ని అభ్యాసకులకు వివరించాలి.

**ఎన్నికల నిర్వహణ:**

1 కనీసం ఒక సంవత్సరం పాటు సభ్యులుగా ఉన్న వారు మాత్రమే ఓటుహక్కు వినియోగించుకోవడానికి అర్హులు. కానీ సహకార సంఘం రిజిస్టరు అయిన మొదటి సంవత్సరం ఈ నిబంధన వర్తించదు.

2 సెక్షన్ 21(4) ప్రకారం కమిటీకి ఎంపిక అయ్యే అర్హత కోల్పోతారు

3 బైలాలో తగిన ఏర్పాటు ఉంటే తప్ప డైరెక్టర్లకు మళ్ళీ ఎన్నికయ్యే అర్హత లేదు

**పాలక వర్గం ఎన్నిక:**

సంస్థ రిజిస్ట్రేషన్ అయిన 60 రోజులలోపు పాలక వర్గం ఎన్నిక జరపాలి. ప్రతి సంవత్సరం పాలకవర్గం నుండి 1/3 వంతుమంది పాలకవర్గ సభ్యులు దిగిపోతారు. పాలకవర్గంలో ఖాళీలు ఏర్పడితే, వారి స్థానంలో కొత్త వారిని ఎంపిక చేయాలి. పాలక వర్గం ఎన్నిక మాక్స్ యాక్టు ప్రకారం చేయాలి. ఎంపిక కాబడిన పాలకవర్గ సభ్యుల వివరాలను రిజిస్ట్రారుకు పాలకవర్గం, ఇతర డాక్యుమెంట్లతో కలిసి దాఖలు చేయాలి.

**రిటర్న్‌లు:**

ప్రతి ఏటా వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించి 30 రోజులలో రిటర్న్ దాఖలు చేయాలి.

మాక్స్ యాక్టు సెక్షన్ 34 (1) ప్రకారం కింద వివరించిన రిటర్న్‌లు రిజిస్ట్రారుకు సమర్పించారు.

అ) వార్షిక కార్యక్రమాల నివేదిక

ఆ) ఆడిట్ రిపోర్టుతో సహా ఆడిట్ చేసిన వార్షిక అకౌంట్స్ స్టేట్‌మెంట్

ఇ) ఆర్థిక సంవత్సరం ముగిసేటప్పటికి ఉన్న సభ్యుల జాబితా, ప్రతి సభ్యునికి అందించిన సేవల వివరాలు

ఈ) మిగులు సొమ్ము పంపిణీ చేసిన తీరు, లేదా లోటు కేటాయించిన తీరును తెలిపే స్టేట్‌మెంట్

ఉ) పాలకవర్గ సభ్యుల జాబితా: పేర్లు, చిరునామాలు, పదవీ కాలం

ఊ) ఆడిట్ నివేదికపైన, ప్రత్యేక ఆడిట్, దర్యాప్తు నివేదికలు ఏవైనా చర్యలు తీసుకొని ఉంటే ఆ చర్యల నివేదిక, చలాను

**అనుమతులు:**

ఒక వ్యాపారం చేయాలంటే ఎలాంటి అనుమతులు పొందాలో సభ్యులను అడగండి. ఉదాహరణకు హోల్‌సేల్ అంగడి, బట్టల వ్యాపారస్తులు మొదలైనవాటిని ఉదహరిస్తూ సభ్యులచే సమాధానం రాబట్టాలి. అదేవిధంగా మన వద్ద ఎలాంటి డాక్యుమెంట్లు ఉండాలో వివరించాలి. అభ్యాసకులు చెప్పిన అంశాలకు మిగిలిన అంశాలు వివరించాలి.

వ్యాపార పరంగా చేసే ప్రక్రియలకు సంబంధించిన లైసెన్సులు, అనుమతులు సంబంధిత అధికారులనుండి పొందాలి, వివిధ సంస్థలతో లావాదేవీలు చేయాలంటే తప్పనిసరిగా రాతపూర్వక ఒప్పందాలు కుదుర్చుకోవాలి.

ఉదా:

| క్ర.సం. | వివరాలు | అనుమతి ఇచ్చే అధికారి |
|---|---|---|
| 1 | సిఎంఎస్ఎస్ | ఎఓ అగ్రికల్చర్ |
| 2 | మార్కెటింగ్ | సేల్స్ ట్రైనర్ |
| 3 | పంచాయితీ | పంచాయితీ |
| 4 | పాన్ కార్డు | ఆదాయపుపన్ను శాఖ |

**పన్నులు:**

ఎఫ్‌పిఓ చేసే వ్యాపారాలపై పన్నులు చెల్లించాలి. ఎఫ్‌పిఓ నిర్వహించే వ్యాపారాలను బట్టి వివిధ పన్నుల శాఖ నుండి అనుమతి పొందాలి. ఉదా: జిఎస్‌టి.

**శిక్షకులకు సూచనలు:**

పై అంశాలను బట్టి సభ్యులకు తమది ఒక వ్యాపార ఉద్దేశం కలిగిన సంస్థ. ఇది చట్టం కింద రిజిస్టరు అయిన ఒక సంస్థ అని అందులో తమందరు హక్కులు, బాధ్యతలు కలిగి ఉంటారని; వారు పెట్టుకున్న, చట్టం ద్వారా నిర్దేశించబడిన విధానాలను అతిక్రమించరాదని తెలియచేస్తూ సెషన్ ముగించాలి. సంస్థ అభివృద్ధి పథంలో నడుచుటకు సభ్యులే ముఖ్యులు అని వివరించాలి. వారు తమ బాధ్యతను భుజాలపై మోయాలి. అలాగే సభ్యులే సంస్థ యజమానులని గుర్తు చేస్తూ ముగించాలి.

**ముల్యాంకనం:**

కింది ప్రశ్నలతో సభ్యులఅవగాహనను అంచనా వేయాలి.

1. చట్టపరమైన బాధ్యతలకు సంస్థ పరంగా ఎవరు బాధ్యులు?
2. పాలకవర్గం చట్టపరమైన బాధ్యతలు ఏమిటి?
3. చట్టపరమైన బాధ్యతలను పాలకవర్గం ఎప్పుడు నిర్వహించాలి?

* * *

# రైతు ఉత్పత్తిదారుల సంస్థ పరిపాలన శిక్షణా మాడ్యూల్

# శిక్షణ అంశం: రైతు ఉత్పత్తిదారుల సంస్థ 'పాలకవర్గం' ఎన్నిక విధానం

శిక్షణ ఉద్దేశం: అభ్యాసకులు రైతు ఉత్పత్తిదారుల సంస్థ పాలకవర్గం ఎన్నిక విధానం వివరించగలుగుతారు.

పద్ధతి: ప్రదర్శన, ఐఎల్ఎం, చార్టు (ఐఇసి మెటీరియల్)

కావలసిన పరికరాలు: చార్టులు (బ్రౌన్‌షీట్స్), మార్కర్ పెన్నులు, ఐఇసి మెటీరియల్ చార్టు

సమయం: 120 నిమిషాలు.

విషయం:

* శిక్షకుడు అభ్యాసకులను కింది ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకోవాలి
* పాలకవర్గంని ఎవరు ఎన్నుకుంటారు?
* పాలక వర్గం పదవీ కాలం ఎంత?

రాబోవు సమాధానాలు:

- మహాసభ సభ్యులందరూ కలిసి పాలకవర్గంను ఎన్నుకుంటారు
- మూడు సంవత్సరాలు
- అభ్యాసకుల నుండి వచ్చిన సమాధానాలని శిక్షకుడు వాటిని క్రోడీకరించాలి.
- సంస్థ కార్యక్రమాలు నిర్వహించటానికి 'మహాసభ'చే ఎన్నుకోబడిన సభ్యులను పాలకవర్గం అంటారు. వీరినే డైరెక్టర్ల బోర్డు అని కూడా అంటారు.

## పాలకవర్గ సభ్యుల ఎన్నిక:

సంస్థలో ఎన్నికలు క్రమం తప్పకుండా జరగాలి. అందువలన పాలకవర్గంలో వున్నటువంటి సమర్ధవంతమైన సభ్యులను తిరిగి ఎన్నుకోవటానికి, సరిగా పనిచేయని వారిని మార్చుటకు వీలుంటుంది. కావున మన సంస్థలో ఎన్నికలను సక్రమంగా నిర్వహించుకోవాలని అభ్యాసకులకు శిక్షకుడు వివరించాలి.

1 ప్రశ్న సమాధానాల పద్ధతిలో అభ్యాసకులకు ఒక్కొక్క ప్రశ్న వేస్తూ వారు చెప్పిన సమాధానాలను క్రోడీకరిస్తూ విషయాన్ని వివరించాలి.

2 పాలకవర్గం సభ్యులు ఎంత మంది వుండాలి?

పాలకవర్గం సభ్యుల సంఖ్యపై చట్టంలో స్పష్టమైన నిబంధన వుంది. పాలకవర్గం సభ్యులసంఖ్య వారి పదవీ కాలానికి గుణిజంగా వుండాలి. పాలకవర్గం సభ్యులు ఎంతమంది వుండాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ/అధికారం 'మహాసభ'కు వుంటుంది. ఉదా: 3 సంవత్సరాల పదవీ కాలం అయితే పాలకవర్గం సభ్యులు 9 నుంచి 15మంది సభ్యులు దాకా వుండవచ్చు. ఉదా: సంవత్సరానికి 3×3=9 మంది వుండాలి, లేదా 3×5= 15 మంది వుండాలి లేదా 4×3=12 మంది వుండాలి.

## పదవీ కాలం:

* పాలకవర్గం సభ్యుల పదవీకాలం 3 సంవత్సరాల నుండి 5 సంవత్సరాల వరకు వుండవచ్చును. అయితే పదవీకాలం 5సంవత్సరాలకు మించి వుండరాదని చట్టం పేర్కొన్నది. ఇంతకు ముందు చర్చించుకున్నట్లు పాలకవర్గ సభ్యుల సంఖ్య వారి పదవీకాలానికి గుణిజంగా వుండాలి. పాలకవర్గ సభ్యుల పదవీకాలం 3 సంవత్సరాలు వుంటే మంచిది.
* సంస్థ రాసుకున్న ఉప విధులలో (బైలాస్) పాలకవర్గ సభ్యుల పదవీ కాలం విషయం స్పష్టంగా వుంటుంది.

* మన సంస్థ పాలకవర్గ సభ్యుల పదవీకాలం ఎంత/ ఎన్ని సంవత్సరాలు వుందో మీకు తెలుసా? అని శిక్షకుడు అభ్యాసకులకు వివరించాలి.
* అభ్యాసకులు తమ ఉప విధుల కాపీని ఒకసారి చదువుకుని వారి సంస్థ పాలకవర్గ సభ్యుల పదవీకాలం స్పష్టంగా తెలుసుకుంటారు.

### నిరంతర బోర్డు:

మన సంస్థ ఒక వ్యాపార సంస్థ అని చెప్పుకున్నాము కదా! సంస్థ పాలకవర్గం సభ్యులందరి పదవీకాలం ఒకేసారి ముగిస్తే వారి స్థానంలో ఎన్నికైన వారు తమ బాధ్యతలను అర్థం చేసుకోవడానికి ఎక్కువ సమయం తీసుకుంటారు. తప్పుడు నిర్ణయాలు తీసుకునే అవకాశం వుంటుంది. వ్యాపారం కూడా దెబ్బతింటుంది. అందువలన ఒకేసారి అందరి పదవీకాలం ముగిసేటట్లు కాకుండా నిరంతరంగా కొనసాగే పాలకవర్గం వుండాలి. సంగానికంటే తక్కువ మంది పాలకవర్గంలో సభ్యుల మార్పు వల్ల పాతవారితో కొత్తవారు కలిసి నేర్చుకోవడానికి వీలు కలుగుతుంది.

### ఎన్నిక ప్రక్రియ పద్ధతి:

సంస్థ బైలాను అనుసరించి పాలకవర్గం పదవీకాలము 3 సంవత్సరాలు అనుకుంటే 9 నుంచి 15మందిని ఎన్నుకుంటారు. ప్రతి పంచాయితీ నుండి పాలకవర్గమునకు సమాన సంఖ్యలో ఎంపిక అయ్యే విధంగా చూసుకోవాలి. సంస్థ ప్రారంభించిన సంవత్సరములో మాత్రమే పాలకవర్గ సభ్యులను అందరిని ఒకేసారి ఎన్నుకోవటం జరుగుతుంది. మొదటిగా ఎన్నుకోబడిన పాలకవర్గం 15 మందిలో 5గురిని 1 సం॥ పదవీ కాలం, మరో 5 గురికి 2 సం॥ పదవీకాలం, మరో 5గురికి 3 సం॥రాల పదవీ కాలం లాటరీ/చీటీ ద్వారా ఎంపిక చేస్తారు. ప్రతి సంవత్సరం పదవీకాలం ముగిసిన స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి వుంటుంది. ఈ విధంగా ఎన్నికయిన కొత్తవారిని 3 సం॥రాల పదవీ కాలానికి ఎన్నుకుంటారు. అదేవిధంగా 2వ సం॥ ఎన్నుకున్న కొత్త సభ్యులకు 3 సం॥రాల పదవీ కాలం వుంటుంది.

ఈ ప్రక్రియ సంస్థ యొక్క ఉపవిధులకు లోబడి వుండాలి. ఎన్నికలలో తగాదాలు రాకుండా వుండటానికి కింది పద్ధతులు అమలు పరచుకోవాలని సూచించవచ్చు.

* మూడు పంచాయితీలకు సమాన ప్రాతినిధ్యం వచ్చేలా చూసుకోవాలి
* ప్రతి పంచాయితీ నుండి 5గురు ప్రాతినిధ్యం వహిస్తారు
* ప్రతి సంవత్సరం పదవీ కాలం ముగిసిన 5గురు ఒకే పంచాయితీకి ప్రాతినిధ్యంచే వహించే వారు కాకుండా జాగ్రత్త తీసుకోవాలి
* మహాసభ సమావేశంలో ప్రతి ప్రాంతం నుండి వచ్చిన సభ్యులు ప్రాంతాల వారిగా కూర్చొని తమ నుండి పాలకవర్గ సభ్యులను ఎన్నుకోవాలి.

### ఎన్నికల విధానం:

శిక్షకులు సభ్యుల నుండి 10 మంది వాలంటీర్లను పిలిచి అర్ధచంద్రాకారంలో కూర్చోబెట్టాలి. తరువాత కింది వివరణ ఇస్తూ ప్రదర్శనను చెయ్యాలి.

ఎన్నికలలో చేతులు ఎత్తే పద్ధతి ద్వారా జరుపుకోవచ్చు. అయితే ఎన్నికలలో పోటీ చేసినవారు ఎవరెవరు తనకు ఓటు వేయలేదో తెలిసిపోవడం వల్ల ఎన్నికలలో పోటీ చేసినవారు, వారిని క్షమించకపోవచ్చు. అందుకే సభ్యులందరు అంకెలు గుర్తించగలిగినట్లయితే పోటీ చేస్తున్నవారికి ఒక్కక్కరికి ఒక అంకె/ సంఖ్యను కేటాయించాలి. పోటీ చేసే అభ్యర్థులందరూ అర్ధచంద్రాకారంలో తమకు కేటాయించిన నంబరును ముందర పెట్టుకుని కూర్చోవాలి.

ప్రతి సభ్యునికి ఒక్క చిన్న పేపరు ఇచ్చి అందులో పోటీ చేసేవారిలో ఎవరిని సంస్థకు మొదటి ప్రతినిధిగా ఉ

ండాలనుకుంటుందో ఆ సభ్యుని సంఖ్యను ఆ చిన్న పేపరుతో రాయమనాలి. సభ్యులు తమను తాము ప్రతినిధిగా అర్హత కలిగినవారిగా భావిస్తే, తన నంబరును కూడా రాసుకోవచ్చని చెప్పాలి. అయితే ఆ పేపరు మీద తన పేరు కాని, సంతకం కాని చేయకూడదు.

ఒకసారి అందరు చీటీలపై రాసిన తర్వాత వాటిని సేకరించాలి. వారు రాసిన ప్రతి నంబరును బిగ్గరగా చదవాలి. వాటిని ఆ నంబరు గల వ్యక్తి ముందున్న పేపరుపై వుంచాలి. వారిలో ఎవరికైతే సగాని కంటే ఎక్కువ ఓట్లు (చీటీ పేపర్లు) వస్తాయో వారిని మొదటి ప్రతినిధిగా ఎన్నికైనట్లు ప్రకటించాలి.

అయితే మొదటి రౌండులో ఏ వ్యక్తికి కూడా సగానికంటే ఎక్కువ ఓట్లు సాధించలేదో వారిలో నుండి మొదటి మూడు స్థానాలలో నిలిచిన వారిని తదుపరి రౌండుకు అర్హులుగా ప్రకటించాలి. ఉదాహరణకు ఒక సభ్యురాలు 3 ఓట్లు, మరో ఇద్దరు 2 ఓట్లు, మిగతా వారు 1 లేదా 0 ఓట్లు వచ్చాయనుకుందాం. అందులో నుండి 33333, 2 ఓట్లు వచ్చిన వారిని రెండవ రౌంటుకు అర్హత ఉన్నట్లు ప్రకటించాలి.

మొదటి ప్రతినిధులుగా ఎన్నుకోవటానికి అర్హత పొందిన 8, 4, 3 నంబర్లు గల పై ముగ్గురికి అవే నంబర్లు ఇచ్చి సభ్యులను పై నంబర్లలో ఒక నెంబరు మాత్రమే వారికిచ్చిన పేపరులలో రాయమనాలి. ఇప్పుడు వారికి వచ్చిన ఓట్లలో ఎవరికైతే సగానికంటే ఎక్కువ వచ్చాయో వారిని మొదట ప్రతినిధిగా ఎన్నికైనట్లు ప్రకటించాలి. ఇప్పుడు కూడా ఎవరికి మెజారిటీ రాకుండా, ఇద్దరి మధ్య ఫలితం తేలనప్పుడు మూడవ రౌండుకు వెళ్ళాలి. ఈ విధంగా సగానికంటే ఎక్కువ ఓట్లు పోటీలో వున్నవారు సాధించేవరకు తదుపరి రౌండు ఎన్నికలు జరుపుతూ పోవాలి.

ఎప్పుడైతే ఒక వ్యక్తికి సగానికంటే ఎక్కువ ఓట్లు వచ్చాయంటే ఆ వ్యక్తిని మెజారిటీ సభ్యులు తమ మొదటి ప్రతినిధిగా గుర్తించారని అర్థం. అందువల్లనే ఆ వ్యక్తిని మొదటి ప్రతినిధిగా ఎన్నికైనట్లు ప్రకటించాలి.

ఇదేవిధంగా మన రెండవ ప్రతినిధిని ఎన్నుకోవటానికి పై పద్ధతిని అనుసరించాలి. ఎన్నికల ప్రదర్శన పూర్తికాగానే శిక్షకులు ఎన్నికలలో పాల్గొన్న సభ్యులందరికి ధన్యవాదాలు తెలపాలి. తరువాత కింద వివరణ ఇవ్వాలి.

సంస్థలో కేవలం మూడు స్థానాలకు మాత్రమే ఉన్నాయి కావున ఇద్దరు మాత్రమే ఎన్నికవుతారని మనం సభ్యులకు గుర్తు చేయాలి. సభ్యులలో చాలామంది 1 కంటే ఎక్కువ సీట్లు సాధించారని, అంటే సభ్యులలో చాలామందిపై విశ్వాసం వున్నదని నొక్కి చెప్పాలి.

సమాజ హితవునుకోరే మనపై సమాఖ్యలు ఒకరిని ఎన్నికలను నిర్వహించటానికి వ్యక్తి చదివిన తర్వాతనే ప్రమాణ స్వీకారం చేసే ప్రమాణం చేయించాలి. ఎన్నికలు నిర్వహించిన వ్యక్తి చదివిన తర్వాతనే ప్రమాణ స్వీకారం చేసే వ్యక్తి ప్రమాణ పత్రాన్ని చదవాలి. అప్పుడే ఆమె మొదటి/రెండవ ప్రతినిధిగా తన బాధ్యతలను అర్థం చేసుకుంటారు. ప్రతినిధిగా వారు నిర్వర్తించవలసిన విధులు, బాధ్యతలను చదివించాలి.

ఎన్నికైన ప్రతినిధులు, సంఘం సభ్యులకు అభినందనలు తెలుపుతూ సంఘం కోసం, సభ్యుల మేలు కోసం పనిచేస్తామని హామీ ఇవ్వాలి.

ఎన్నికల ప్రక్రియ అంతటినీ, ఓట్ల లెక్కింపును ఎన్నికల ఫలితాలను, పూర్తిగా సంస్థ తీర్మానముల పుస్తకంలో నమోదు చేయాలి.

**అభ్యాసలకుల నుండి రాబట్టవలసిన సమాధానాలు:**

- ★ **పాలకవర్గం అంటే:** రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యక్రమాలు నిర్వహించటానికి మహాసభచే ఎన్నుకోబడిన సభ్యులను పాలకవర్గం లేదా బోర్డు ఆఫ్ డైరెక్టర్లు అంటారు.
- ★ పాలకవర్గం సభ్యుల పదవీ కాలం ఎంత వుండాలి? ఎంత వుంటే మంచిది? 3 నుంచి 5 సంవత్సరాలు వరకు వుండవచ్చు. అయితే 3 సంవత్సరాలు వుంటే మంచిది.

* పాలకవర్గ సభ్యుల సంఖ్య: వారి పదవీకాలానికి గుణిజంగా వుండాలి. ఇది వ్యాపార సంస్థ కాబట్టి నిరంతర బోర్డు కొనసాగాలి.
* చేతులు ఎత్తి ఎన్నిక చేసుకునే పద్ధతి మంచిదా? మరి ఏ విధంగా ఎన్నికలు జరగాలి? చేతులు ఎత్తే పద్ధతి వల్ల సమస్యలు వస్తాయి, రహస్య ఓటింగ్ పద్ధతి అయితే ప్రజాస్వామ్య బద్ధంగా వుంటుంది.

పై విధంగా శిక్షకుడు అభ్యాసకులు ఎంతవరకు అవగాహన పెంచుకున్నారో మూల్యాంకనం చేసుకోవాలి.

* * *

# రైతు ఉత్పత్తిదారుల సంస్థ పాలకవర్గం, పదాధికారుల బాధ్యతలు, విధులపై శిక్షణా కార్యక్రమం

## అభ్యాసకులు: రైతు ఉత్పత్తిదారులు సంస్థ పాలకవర్గం, పదాధికారులు

## శిక్షణ ఉద్దేశం:

1. అభ్యాసకులు రైతు ఉత్పత్తిదారుల సంస్థ పాలకవర్గం బాధ్యతలు, విధులను చెప్పగలుగుతారు.
2. అభ్యాసకులు రైతు ఉత్పత్తిదారుల సంస్థ పదాధికారుల విధులు, బాధ్యతలు చెప్పగలుగుతారు.

**పద్ధతి:** అభ్యాసం

**వ్యవధి:** 90 నిమిషాలు

**కావలసిన పరికరాలు:** బ్రౌన్‌షీట్లు, మార్కర్ పెన్నులు, ప్రశ్నాపత్రం

**విషయం:** శిక్షకుడు కింది ప్రశ్నలు వేసి అభ్యాసకుల నుండి సమాధానాలు రాబట్టాలి

ప్రశ్నలు:

1 రైతు ఉత్పత్తిదారుల సంస్థను ఎవరెవరు నడిపిస్తారు?
2. మహాసభ అంటే ఎవరు?
3. పాలక వర్గం అంటే ఎవరు?
4. పదాధికారులు అంటే ఎవరు?

రాబోవు సమాధానాలు:

1. రైతు ఉత్పత్తిదారుల సంస్థను మహాసభ, పాలకవర్గం, పదాధికారులు, సిబ్బంది నడుపుతారు.
2. వాటాధానం, సభ్యత్వ రుసుం చెల్లించిన వారిని మహాసభ సభ్యులు అంటారు.
3. రైతుఉత్పత్తిదారుల సంస్థ కార్యక్రమాలను నిర్వహించటానికి మహాసభచే ఎన్నుకోబడిన సభ్యులను పాలకవర్గం అంటారు.
4. రైతు ఉత్పత్తిదారుల సంస్థను రోజువారీ కార్యక్రమాలను నిర్వహించుటకు పాలకవర్గం తమనుండి 3 లేదా 4 మంది సభ్యులను పదాధికారులు ఎన్నుకుంటారు. వారే అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారి.

**అభ్యాసకుల నుండి వచ్చిన సమాధానాను ఫెసిలిటేటరు (శిక్షకుడు) క్రోడీకరించాలి.**

శిక్షకుడు అభ్యాసకుల సంఖ్యను బట్టి మూడు లేదా నాలుగు చిన్న గ్రూపులుగా విభజించాలి. వారికి సంస్థ యొక్క పాలకవర్గం, పదాధికారుల విధులకు సంబంధించిన ఒక ప్రశ్నాపత్రం అందించాలి. చిన్నగ్రూపులలో వారు చర్చించుకుని ఒక్కొక్క ప్రశ్నకు సమాధానం కేటాయించిన గదిలో టిక్ () చెయ్యాలి అని సూచించాలి. అంటే ప్రశ్నకి సమాధానం పాలకవర్గంకి సంబంధించినా లేదా పదాధికారులదీ అనే విషయం అభ్యాసకులు 'టిక్' చెయ్యాలి చర్చకు 30 నిమిషాల సమయం కేటాయించాలి. అభ్యాసకుల ప్రజంటేషన్ తర్వాత పాలకవర్గం అధికారాలు, విధులు, పదాధికారుల విధులు వివరించాలి.

**ప్రశ్నాపత్రం:**

**సూచన: సరైన గడిలో టిక్ (√) పెట్టండి.**

| క్ర.సం. | ప్రశ్న | పాలక వర్గం | పదాధికారులు |
|---|---|---|---|
| 1 | సంస్థకు అధ్యక్షుని ఎన్నుకునేది ఎవరు? | | |
| 2 | బ్యాంకు అకౌంట్ ఎవరు నిర్వహిస్తారు? | | |
| 3 | ప్రణాళికలను రూపొందించి మహాసభ ఆమోదానికి సమర్పించాల్సిన వారు ఎవరు? | | |
| 4 | అధ్యక్షుని తొలగించు అధికారం ఎవరిది? | | |
| 5 | సంస్థకు సిబ్బంది ఎంతమంది వుండాలో నిర్ణయించవలసినది ఎవరు? | | |
| 6 | సంస్థ యొక్క ఉత్తర ప్రత్యుత్తరాల నిర్వహణ బాధ్యత ఎవరిది? | | |
| 7 | సంస్థ ప్రగతిని 'స్వీయ మదింపు' చేయవలసినది ఎవరు? | | |
| 8 | సమావేశాలకు అధ్యక్షత వహించవలసినది ఎవరు? | | |
| 9 | సంస్థ యొక్క రికార్డుల నిర్వహణ చేయవలసిది? | | |
| 10 | ప్రతి యేటా సంస్థ ఆడిట్ జరిపించవలనది ఎవరు? | | |
| 11 | సభ్యులకు సంస్థ ద్వారా సేవలు సమకూర్చడం | | |
| 12 | సిబ్బంది నియామకంలో పాలుపంచుకోవడం | | |
| 13 | సంస్థ నిధుల సంరక్షణ, పెట్టుబడులు తీరు సమీక్ష | | |
| 14 | అకౌంట్ల నిర్వహణ తీరు పరిశీలించడం | | |
| 15 | సంస్థకు వివిధ రకాలు/రూపాలలో నిధుల సమీకరణ, వినియోగం, పెట్టుబడి | | |
| 16 | చట్టబద్ధమైన పత్రాలు (రిటర్న్) దాఖలు, సమాచార వ్యవస్థల నిర్వహణ, పర్యవేక్షణ | | |
| 17 | సంస్థ ప్రయోజనం కోసం నిధులు నిర్వహించటానికి అవసరమైన ఏదైనా ఇతర అంశాలను, విషయాలను రూపొందించడం | | |
| 18 | వార్షిక నివేదికలను, వార్షిక ఆర్థిక పట్టికలను, వార్షిక ప్రణాళికలను, బడ్జెట్‌ను 'మహాసభ' ఆమోదం కోసం సమర్పించటం | | |
| 19 | ఆడిట్ నివేదికను, చర్యల నివేదికలను పరిశీలించి 'మహాసభ'కు సమర్పించడం | | |
| 20 | ఇతర సహకార సంఘాలలో సభ్యత్వాన్ని సమీక్షించడం అవసరమైతే ప్రతినిధిని ప్రతిపాదించటం | | |
| 21 | సంస్థ నిర్వహణకు సంబంధించిన పరిపాలన, ఆర్థికపరమైన వ్యాపార నియమాలను రూపొందించి, మహాసభ ఆమోదం కోసం సమర్పించాలి | | |
| 22 | 'మహాసభ' అప్పగించే ఇతర బాధ్యతలను నిర్వర్తించడం | | |
| 23 | ఓటింగ్‌లో పాల్గొనాలి | | |

చివరగా శిక్షకులు "పదవీ విరమణ చేసిన సభ్యులు, సంస్థ బైలాలో రాసుకుని వుంటే మరలా ఎన్నికలలో నిలబడవచ్చును, ఎన్నిక కావచ్చు. అయితే వరుసగా మూడు సంవత్సరాలు ఎన్నిక అవ్వటానికి అనర్హులు" అని వివరించాలి.

**పాలకమండలి సభ్యుల బాధ్యతలు, విధులు:**

| క్ర.సం. | ప్రశ్న | పాలక వర్గం | పదాధికారులు |
|---|---|---|---|
| 1 | సభ్యులను చేర్చుకోవడం, తొలగించడం | | |
| 2 | అధ్యక్షుడిని, ఇతర పదాధికారులను ఎన్నుకోవడం, తొలగించటం | | |
| 3 | సమావేశాల నిర్వహణ | | |
| 4 | రైతు ఉత్పత్తిదారుల సంస్థ యొక్క సిబ్బంది ఎంతమంది వుండాలో నిర్ణయించడం | | |
| 5 | కార్యాచరణ ప్రణాళికలు, వ్యాపార ప్రణాళికలు రూపొందించటం, ప్రగతి సమీక్ష చేయటం | | |
| 6 | సంస్థ ప్రగతిని స్వీయ మదింపు చేయటం | | |
| 7 | పాలకవర్గం 'మహాసభ'కు జవాబుదారిగా వుండాలి | | |
| 8 | ఎన్నికల నిర్వహణ | | |

అభ్యాసకులు గ్రూపులో చర్చించి అభ్యాసం (ఎక్సర్‌సైజు) ద్వారా రాసి ప్రజంట్ చేసిన పాలకవర్గ అధికారాలు, విధులను శిక్షకుడు క్రోడీకరిస్తూ క్రమం వారీగా పై విధంగా వివరించాలి.

పాలకవర్గం అధికారాలు, విధులను ప్రశ్నలు–సమాధానాల రూపంలో అభ్యాసకులలో "నెమరు" వేయించి అభ్యాసకులు తెలుసుకున్నారని నిర్ధారించుకోవాలి. తరువాత సభ్యులు పట్టికలో గుర్తించిన పదాధికారుల విధులు, బాధ్యతలను చదివించి, చర్చను శిక్షకులు కింది విధంగా వివరించాలి.

**పదాధికారులు, విధులు, బాధ్యతలు:**

పాలకవర్గ సభ్యులు ప్రతి వార్షిక మహాసభ సమావేశంలో కొత్తగా ఎన్నుకున్న పాలకవర్గ సభ్యులను కలుపుకుని తమలో నుండి ఒక సంవత్సరం కోసం అధ్యక్షుని, ఉపాధ్యక్షుని, కార్యదర్శిని, సహాయ కార్యదర్శి, కోశాధికారిని ఎన్నుకోవాలి.

**అధ్యక్షుడు:**

√ పాలకవర్గ, మహాసభ సమావేశాలకు అధ్యక్షత వహించాలి.

√ పాలకవర్గం నిర్ణయానికి సంబంధించిన ఏ విషయంలోనైనా ఇరువైపులా సమానంగా ఓట్లు వచ్చిన సందర్భంలో మాత్రమే వినియోగించుకునే విధంగా అధ్యక్షునికి అదనంగా క్యాస్టింగ్ ఓటు' (నిర్ణయాత్మక ఓటు) వుంటుంది.

√ సంస్థ తరపున అన్ని న్యాయసంబంధమైన పత్రాలపై ఒక సంతకందారుగా వుంటారు.

**కార్యదర్శి:**

★ మహాసభ, పాలకవర్గ సమావేశాలు ఏర్పాటు చేయుట, వాటి తీర్మానాలు, నిర్ణయాలు అమలు చేయుట

★ సంస్థ సిబ్బందిపై పరిపాలన నియంత్రణ కలిగి వుండాలి

★ సంస్థకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలి

★ పాలకవర్గం, అధ్యక్షులు అప్పగించిన బాధ్యతలు నెరవేర్చాలి

★ సంస్థ తరపున న్యాయసంబంధమైన అంశాలలో 'అధీకృత సంతకందారు'గా వ్యవహరించాలి

★ సంస్థ తరపున వ్యాజ్యములు చేసే అధికారం కలిగి వుండాలి

★ రికార్డులు, లెక్కల నిర్వహణ జరిగేలా చూడాలి

**కోశాధికారి:**

✳ సంస్థ నెలవారీ ప్రణాళికలు, బడ్జెట్‌ను రూపొందించి పాలకవర్గం ఆమోదానికి సమర్పించాలి

✳ సంస్థ ఆస్తుల భద్రత, నిధుల నిర్వహణ కోశాధికారి బాధ్యత

* సంస్థకు ప్రతియేటా ఆడిట్ జరిగేటట్లు చూడటం, ఆడిటర్లకు సహకరించడం
* ఎప్పటికప్పుడు సంస్థ యొక్క 'ఓటరు జాబితా'ని సవరించాలి

పదాధికారుల విధులను శిక్షకుడు ప్రశ్నలు – సమాధానాల రూపంలో అభ్యాసకులతో నెమరు వేయించి వారు తెలుసుకున్నారని నిర్ధారించుకోవాలి. చివరిగా శిక్షకుడు శిక్షణ మొదట్లో ఉపయోగించి చిత్రాన్ని మరొక్కమారు అభ్యాసకులకు యిచ్చి 10 నిమిషాలు కేటాయించి సమాధానాలు టిక్ () చెయ్యమని చెప్పి మొదట సమాధాన పరచిన దానికి ఇప్పుడు సమాధానపరచిన దానికి తేడా వుందా లేదా, మెరుగైన విషయాన్ని అభ్యాసకులే నిర్ధారించుకునేలా వివరించే విధంగా విషయాల పట్ల అవగాహన పెంపొందించినట్లు అభ్యాసకులే గుర్తిస్తారు. అభ్యాసకులు జ్ఞానం పెంచుకున్నారని శిక్షకుడు నిర్ధారించుకుంటాడు.

ముగింపు:

1. అభ్యాసకులు రైతు ఉత్పత్తిదారుల సంస్థ పాలకవర్గ సభ్యుల అధికారాలు, విధులు చెప్పగలిగారు
2. అభ్యాసకులు రైతు ఉత్పత్తిదారుల సంస్థ పదాధికారుల విధులు చెప్పగలిగారు

* * *

# సమావేశాలు

**ఉద్దేశం:** **అభ్యాసకులు రైతు ఉత్పత్తిదారుల సంస్థలో సమావేశాల ఆవశ్యకత, రకాలు, నిర్వహణ పద్ధతిని అర్థం చేసుకుని నిర్వహించగలుగుతారు.**

**విషయాంశాలు:**

* సమావేశం – నిర్వచనం
* సమావేశం – ఆవశ్యకత
* సమావేశం – రకాలు
* సమావేశ నిర్వహణ పద్ధతి

**శిక్షణ పరికరాలు: చార్టులు, మార్కర్ పెన్నులు, తెల్ల కాగితాలు, బోర్డు**

**సమయం:** **90 నిమిషాలు**

**పద్ధతి:** **బ్రెయిన్ స్టార్మింగ్, రోల్‌ప్లే, పరస్పర చర్చ (ఐఎల్ఎం)**

**1. సమావేశం నిర్వచనం:**

శిక్షకుడు అభ్యాసకులను బ్రెయిన్ స్టార్మింగ్ ద్వారా కింది ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టాలి.

మీ గ్రామంలో ఏమైనా సమావేశాలు చూశారా?

సమావేశం అంటే ఏమిటి?

సభ్యుల నుండి వచ్చిన సమాధానాలను క్రోఢీకరించి సమావేశం నిర్వచనం తెలియచేయాలి.

కొంతమంది వ్యక్తులు జట్టుగా కూర్చుని వాడి సమస్యల పట్ల చర్చించుకునే ప్రక్రియని 'సమావేశం' అంటారు.

**2. సమావేశం ఆవశ్యకత:**

శిక్షకుడు అభ్యాసకులను కింది ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టాలి.

1 రైతు ఉత్పత్తిదారుల సంస్థలో సమావేశం అవసరం, ఆవశ్యకత ఏమిటి?

సభ్యుల నుండి వచ్చిన సమాధానాలను క్రోఢీకరించి సమావేశం యొక్క ఆవశ్యకతను వివరించాలి. సమావేశం పాలకవర్గ సభ్యులను సంస్థ నిర్వహణకుఉ అవసరమైన నైపుణ్యం, విజ్ఞానం పెంపొందించుకోవటానికి అవకాశం కల్పిస్తుంది.

* సంస్థకు సమావేశం ప్రాణం వంటిది.
* పాలకవర్గ సభ్యులకు క్రమశిక్షణ అలవడుతుంది
* కలిసికట్టుగా నిర్ణయాలు చెయ్యడానికి ఉపయోగపడుతుంది
* సంస్థలో పారదర్శకతని పెంచుతుంది
* సంస్థ వ్యాపార అభివృద్ధికి తగిన ప్రణాళికలను రూపొందించుకుని సమీక్షించుకోవచ్చును
* సంస్థ పనితీరుకు అద్దం పడుతుంది
* లావాదేవీలపై అందరికి అవగాహన కలుగుతుంది
* సిబ్బంది పనితీరుని సమీక్ష చెయ్యవచ్చు
* పాలకవర్గ సభ్యుల హాజరుని తెలుసుకోవచ్చు
* సంస్థ వ్యాపార నియమాల అమలుతీరును పరిశీలించవచ్చు

శిక్షకుడు అభ్యాసకులు మరింత బాగా అర్థం చేసుకోవటానికి 'సమావేశం–సంఘానికి ప్రాణం' అనే చార్టుని చర్చించి, సమావేశ ప్రాముఖ్యత వివరించాలి.

### 3. సమావేశాలు - రకాలు:

శిక్షకుడు అభ్యాసకులను కింది ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టాలి.

1 సమావేశం – రకాలు ఏమిటి?

2 సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారు?

సభ్యుల నుండి వచ్చిన సమాధానాలు క్రోఢీకరించి సమావేశాల రకాలను కింది విధంగా వివరించాలి.

* పాలకవర్గం సమావేశం
* మహాసభ/సర్వసభ్య సమావేశం
* పాలకవర్గ సమావేశం:
* పాలకవర్గ సమావేశానికి పాలకవర్గసభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలి
* నెలకు ఒకసారి పాలకవర్గం సమావేశం జరపాలి
* పాలకవర్గసమావేశం జరుగు తేది, స్థలం ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం జరగాలి
* పాలకవర్గ సమావేశానికి కనీసం 2/3 వంతు సభ్యులు హాజరు కావాలి
* సమావేశంలో చర్చించిన అంశాలను 'తీర్మానాల పుస్తకం' నందు పొందుపరచాలి
* సభ్యులు ఎవరైనా వరుసగా మూడు సమావేశాలకు (అనుమతి లేకుండా) గైరుహాజరు అయితే అట్టి సభ్యులు పాలకవర్గంలో కొనసాగజాలరు.

* సంస్థ అధ్యక్షులు ఈ సమావేశానికి అధ్యక్షత వహించాలి. అధ్యక్షులు హాజరు కాని సమయంలో ఉపాధ్యక్షులు లేదా పాలకవర్గ సభ్యులలో మరొకరు తాత్కాలికంగా అధ్యక్షత వహించవచ్చును.

శిక్షకుడు పై విషయాలను ఉప విధులకు అనుగుణంగా జరపాలని వివరించాలి.

## ప్రత్యేక సమావేశం- నోటీసు.

...................... రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్.

రిజిస్టరు నెం:.................................. మండలం, ............................. జిల్లా, ఆంధ్రప్రదేశ్.
ప్రత్యేక సమావేశం నోటీసు

తేది:

స్థలం

శ్రీ/శ్రీమతి ....................................... గారికి .................................. తేదీన ................ గంటలకు మన పాలకవర్గ ప్రత్యేక సమావేశం............................................ స్థలం నందు జరుగును. తమరు తప్పక హాజరు కాగలరు.

ఇట్లు

**కార్యదర్శి**

**సంతకం.**

**సమావేశపు - నిర్వహణ పద్ధతి:**

**పద్ధతి: రోల్‌ప్లే**

**శిక్షణ పరికరాలు: చార్టులు**

శిక్షకుడు 10మంది సభ్యులను ఎన్నుకుని వారిచే సమావేశ నిర్వహణ రోల్‌ప్లే చేయించాలి. రోల్ ప్లేకి 20 నిమిషాల సమయం కేటాయించాలి. రోల్ ప్లే నిర్వహణ విధానాన్ని శిక్షకుడు అభ్యాసకులకు ముందుగా వివరించాలి.

* కొందరు సమావేశం ప్రారంభానికి ముందే వచ్చి ఎదురు చూస్తూ వుంటారు
* ఇద్దరు సభ్యులు ఇతర విషయాల గురించి సమావేశంలో చర్చిస్తుంటారు
* మరో ఇద్దరు సభ్యులు సమావేశంలో కూర్చోకుండా బయట మాట్లాడుతుంటారు

సభ్యులను మొదటగా గ్రూపు చేస్తున్న సమావేశ విధానాన్ని గమనించమని చెప్పాలి. సమావేశంలో చేయవలసినవి, చేయకూడనివి, సమావేశం నిర్వహించే విధానం గురించి శిక్షకుడు అభ్యాసకులను ప్రశ్నలు అడిగి వారితోనే సమాధానాలు చెప్పించి కింది విధంగా సమావేశ నిర్వహణ గురించి వివరించాలి.

* పభ్యులందరూ గుండ్రంగా కూర్చోవాలి
* ప్రార్థనా గీతంతో సమావేశం ప్రారంభించాలి
* సభ్యుల హాజరు, హాజరుకాని సభ్యులపై చర్చ, నిర్ణయాలు
* అధ్యక్షులు సభ్యులతో చర్చించి 'అజెండా' తయారు చేయాలి
* గత సమావేశంలో చర్చించిన విషయాలు, తీర్మానాల అమలుపై చర్చించి సమీక్షించాలి

* 'రైతు విజ్ఞాన సమితి' ప్రతిపాదనలు, సూచనలపై చర్చించి నిర్ణయాలు చెయ్యాలి
* సభ్యత్వ నమోదు, వాటాధనంపై చర్చించాలి
* అద్దె పరికరాల సెంటరుపై సమీక్ష
* ఆదాయ, వ్యయాలపై నివేదిక, చర్చ, తీర్మానం
* రాబోవు నెలలో చేపట్టవలసిన అంశాలను బడ్జెట్‌పై ఆమోదం
* ఇతర విషయాలు
* ముగింపు

చివరగా తీర్మానాల పుస్తకంలో సభ్యులందరితో సంతకం చేయించాలి.

శిక్షకుడు పై విషయాలను ఒక్కొక్కటి వివరిస్తూ అభ్యాసకులకు అర్థమయ్యేలా వివరించాలి. సమావేశ నిర్వహణ గురించి మరింతగా వివరించాలంటే 'స్వయం సహాయక సంఘం' వీడియో ద్వారా సమావేశ నిర్వహణ చూపించవచ్చు.

* * *

## వార్షిక మహాసభ నిర్వహణ, అధికారాలు

**ఉద్దేశం:** వార్షిక మహాసభ సమావేశ నిర్వహణా విధానం, అధికారాలు గురించి అభ్యాసకులు వివరంగా తెలుసుకుంటారు. తెలియచేయగలుగుతారు.

**పద్ధతి:** పెద్ద గ్రూపు చర్చ

**పరికరాలు:** చార్టులు, మార్కరు పెన్నులు, ఫ్లాష్‌కార్డులు

**సమయం:** 45 నిమిషాలు.

శిక్షకుడు అభ్యాసకులకు కింది ప్రశ్నలు వేసి వచ్చిన సమాధానాలు క్రోఢీకరించి వివరించాలి

* వార్షిక మహాసభ అంటే ఏమిటి?
* వార్షిక మహాసభ ఎలా నిర్వహించాలి?
* మహాసభ అధికారాలు ఏమిటి?
* సంఘంలో వాటాధనం చెల్లించిన సభ్యులందరిని కలిపి 'మహాసభ' అంటారు.
* ప్రతి సంవత్సరం మహాసభ సభ్యులందరూ హాజరయ్యే సమావేశాన్ని 'వార్షిక మహాసభ' అంటారు.
* ఈ సమావేశానికి హాజరు కావలసిన కనీస సభ్యుల సంఖ్యను 'కోరం' అంటారు. (ఉపవిధులలో నిర్ణయించుకున్న విధంగా కోరం వుంటుంది)
* ఏదైనా కారణం చేత మహాసభ సమావేశంలో 'కోరం' లేకపోతే ఆ సమావేశాన్ని 'వారం' రోజులు వాయిదా వేయాలి. తదుపరి సమావేశానికి 'కోరం' వుండునట్లు జాగ్రత్త పడాలి.
* ఆర్థిక సంవత్సరం ముగిసిన ఆరు నెలలలోపు వార్షిక మహాసభ నిర్వహించాలి. ఉదా: మన సంస్థ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి మార్చి అనుకుంటే, ఆర్థిక సంవత్సరం ముగిసిన 6నెలలలోపు అనగా సెప్టెంబరు నెలలోపు వార్షిక మహాసభ సమావేశం నిర్వహించాలి.

**వార్షిక మహాసభ నిర్వహణ:**

* ప్రార్థనా గీతంతో ప్రారంభించాలి
* సంఘం అధ్యక్షులు సమావేశానికి అధ్యక్షత వహించాలి
* అధ్యక్షులు సభ్యులందరికి స్వాగతం పలకాలి.
* గత మహాసభ సమావేశపు చర్చల నివేదిక ధృవీకరణ
* గత మహాసభ సమావేశం తీర్మానాల అమలు పరిశీలన
* వార్షిక నివేదిక పరిశీలన
* ఆడిట్ నివేదిక పరిశీలన
* రాబోవు సంవత్సరం ప్రణాళికలు, బడ్జెట్ ఆమోదం
* బడ్జెట్ మిగులు లేదా లోటు నిర్వహణ
* వివిధ నిధుల ఏర్పాటు
* పాలకవర్గ సభ్యుల హాజరు, లావాదేవీల పరిశీలన
* పాలకవర్గ సభ్యుల (పదవీ కాలం ముగిసిన) తొలగింపు, కొత్త వారిని ఎంపిక చేయడం
* ఆడిటరు నియామకం, చెల్లించవలసిన రుసుం ఆమోదం
* సహకార సంఘాలతో సమన్వయం
* ఉత్తమ పురస్కారాలు
* ఆహ్వానితుల సందేశం
* పాలకవర్గ సభ్యుల ఎన్నిక, అవసరమైతే తొలగింపు
* కార్యదర్శితో వందన సమర్పణ

**మహాసభ అధికారాలు:**

* పదవీకాలం ముగిసిన పాలకవర్గ సభ్యుల తొలగింపు
* పాలకవర్గ సభ్యులలో ఏర్పడిన ఖాళీలు మరొకరితో ఎంపిక చెయ్యడం
* పాలకవర్గ సిబ్బంది తొలగింపు, నియామకం
* ఆడిటర్ల నియామకం, తొలగింపు
* సంస్థకి సంబంధించిన అంతిమ నిర్ణయాధికారం మహాసభదే
* అవసరమైతే ఉపవిధుల సవరణ
* ప్రణాళికలు, బడ్జెట్ ఆమోదం

చివరగా శిక్షకుడు సభ్యుల ప్రశ్నలకు చర్చల ద్వారా సమాధానాలు వివరించి అభ్యాసకులు మహాసభ నిర్వహించుకునేలా తయారు చేయాలి. ఒక సంఘం యొక్క 'వార్షిక' సమావేశ మినిట్స్ నమూనాని అభ్యాసకులకు అందజేయాలి.

శిక్షకుడు ఫ్లాష్ కార్డుల ద్వారా అభ్యాసకుల 'ఫీడ్‌బ్యాక్' తీసుకుని వారి అభ్యసనా స్థాయిని మూల్యాంకనం చేయాలి. అంతిమంగా అభ్యాసకులు మహాసభ వార్షిక మహాసభ నిర్వహణ విధానం తెలుసుకున్నారు.

* * *